ముహూర్తం
శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: బహుళ అష్టమి, రా.7.47 వరకు అనంతరం నవమి; నక్షత్రం: స్వాతి రా.7.42 వరకు, అనంతరం విశాఖ; అమృతకాలం: ఉ.11.15 నుండి 12.50 వరకు; వర్జ్యం: రా.1.16 నుండి 2.51 వరకు; దుర్ముహూర్తం: మ.12.24 నుండి 1.12 వరకు, మ.2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:57 • సంచిక:283 • సోమవారం 28 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+12 • వెల: 5.00 • Published from:Hyderabad|Karimnagar|Nizamabad|Suryapet|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati |Kurnool |Anantapur|Nellore

వాహనాల రిజిస్ట్రేషన్‌కు కొత్త రూల్స్

ఏప్రిల్ 1 నుంచి డీలర్ల వద్దే రిజిస్ట్రేషన్

- తొలుత బైక్‌లు, కార్లకు.. ఆ తర్వాత రవాణా వాహనాలకు
- రూ. 11కోట్లతో రూపొందుతున్న సాఫ్ట్‌వేర్
- రవాణాశాఖ కార్యాలయాల్లో తగ్గనున్న అవినీతి
- ఫ్యాన్సీ నెంబర్ల కేటాయింపు ఆర్టీఏ పరిధిలోనే
- రిజిస్ట్రేషన్ లేకుండా వాహనాలు రోడ్డెక్కితే జరిమానా
- నిబంధనలను అతిక్రమిస్తే డీలర్‌షిప్ రద్దు..



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వాహనాల కొనుగోలుదారులకు రాష్ట్ర రవాణా శాఖ చల్లటి కబురు అందించింది. ఇకనుంచి వాహనాలను కొనుగోలు చేసే యజమానులు రవాణా శాఖ అధికారుల సమక్షంలో కాకుండా డీలర్ల వద్దే నెంబర్లు రిజిస్ట్రేషన్ చేయించుకునే నూతన విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ విధానం అమలులోకి తెచ్చేందుకు రవాణాశాఖ కసరత్తును ముమ్మరం చేసింది. వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను డీలర్లకే అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆదేశాలివ్వడంతో రవాణా శాఖ చర్యలు ప్రారంభించింది. ఈ విధానంతో ఇక ఆర్టీఏ కార్యాలయాలు వెలవెలబోయే అవకాశాలు ఉన్నాయి. కేవలం డ్రైవింగ్ లైసెన్సుల జారీ, రెన్యువల్, వాహనాల ఫిట్‌మెంట్ సర్టిఫికెట్‌లు, తనిఖీలకు మాత్రమే రవాణా శాఖ ➪ 2వ పేజీలో...

రైతుకు ప్యాకేజీ?

నేడో, రేపో కేంద్ర కేబినెట్ భేటీ

- వ్యవసాయ సంక్షోభంపై కీలక నిర్ణయం
- మద్దతు ధర లేదా పెట్టుబడికి మొగ్గు
- ఉచిత పంట బీమాకు మోడీ యోచన
- ఫిబ్రవరి 1 నుంచి బడ్జెట్ సమావేశాలు



న్యూఢిల్లీ: వ్యవసాయరంగంలో సంక్షోభ నివారణకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకోనుంది. ఒకటి రెండు రోజుల్లో ఈ విషయమై కేంద్రకేబినెట్ ముందడుగు వేయనుంది. తొలుత ఈరోజే కేబినెట్ భేటీ జరుగుతుందని సమాచారం వచ్చినప్పటికీ, ఆఖరిక్షణంలో వాయిదా పడింది. సాగు సమస్యలకు పరిష్కారం చూపడంతోపాటు, రైతుల ఆదాయం పెంపునకు దోహదపడేలా ప్రభుత్వం నిర్ణయం ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. చిన్న, సన్నకారు రైతుల రుణసమస్యలను ప్రధాన ఎజెండాగా వ్యవసాయ మంత్రి ఈ భేటీలో కీలక ప్రతిపాదనలు చేస్తారు. సమీప, దీర్ఘకాల ప్రాతిపదికన వ్యవసాయశాఖ కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందుకు భారీ మొత్తంలో నిధులు అవసరం అవుతాయని కూడా సమాచారం. సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్నందున దీనిపై అనివార్యంగా కీలక నిర్ణయం తప్పక ఉంటుందని ప్రభుత్వ వర్గాల సమాచారం. ప్రతిపక్షాలు ఇప్పటికే రుణమాఫీ ప్రకటన చేసిన నేపథ్యంలో, ప్రభుత్వం ఎలాంటి చర్యలు ➪ 2వ పేజీలో...

ముహూర్తం ఓకే

7న విస్తరణ

- కేబినెట్ బెర్తులపై కేటీఆర్‌తో సీఎం చర్చ
- బడ్జెట్ సమావేశాలు
- కేంద్ర ఆర్థిక సంఘం బృందం 15న రాక
- ఈలోగా కేబినెట్ విస్తరణ పూర్తికి నిర్ణయం
- ఆశావహులలో మళ్లీ చిగురించిన ఆశలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మంత్రివర్గ విస్తరణకు సీఎం కేసీఆర్ బలమైన ముహూ ర్తాలను ఖరారు చేశారా? ఈ ముహూర్తాలకు సంబంధించి పండితులతో ఆయన ఇప్పటికే చర్చించి తేదీలను ఖరారు చేశారా? అవుననే అంటున్నాయి తెరాస, ప్రభుత్వ వర్గాలు. ఈ నెల 30 లేదా ఫిబ్రవరి 7న రెండు ముహూర్తాలను కేసీఆర్ ఎంపిక చేశారని, అయితే, 30న గవర్నర్ నరసింహన్ అందుబాటులో ఉండటం లేదని, దీంతో ఫిబ్రవరి 7న మంత్రివర్గాన్ని విస్తరించేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని వారు చెబుతున్నారు. ఫిబ్రవరి రెండో వారంలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించినందున, ఆ లోపే మంత్రి వర్గంలోకి కొత్తవారిని తీసుకోవాలన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి వర్గంలో ఎవరెవరిని తీసుకోవాలి? ఏ సామాజిక వర్గాలకు చోటు కల్పించాలి? జిల్లాల వారీగా ఎవరిని తీసుకుంటే బాగుంటుంది? అన్న అంశాలపై ఆయన సుదీర్ఘ కసరత్తు చేసే పనిలో నిమగ్నమై ఉన్నట్లు తెలుస్తోంది. ఎట్‌హోం సందర్భంగా శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో సమావేశమైన కేసీఆర్ మంత్రివర్గ విస్తరణ అంశంపై రెండు గంటలకు ➪ 3వ పేజీలో...



ఫలించిన పరిశ్రమ!

పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణ అగ్రస్థానం

- పెట్టుబడుల ఆకర్షణలో మేటి
- ఐదేళ్లలో రూ.5.9లక్షల కోట్ల పెట్టుబడులు
- 5.38 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- రాష్ట్రంపై అంతర్జాతీయ సంస్థల మోజు
- వికేంద్రీకరణతో జిల్లాల్లో సమీకృత ప్రగతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన పారిశ్రామిక ప్రగతితో అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి ప్రభుత్వంలో మూడేళ్లలోనే దాదాపు రూ. 1,27,050 కోట్ల పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించి రికార్డు సృష్టించింది. పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ఆ తర్వాత రెండేళ్లలో ఈ పెట్టుబడుల వాటా రూ. 5.9 లక్షల కోట్లకు పెంచుకోవడంతో రెండో విడత పాలన మొదలుపెట్టింది. నూతన పారిశ్రామిక విధానంతో పారిశ్రామికాభివృద్ధిలో అమాంతంగా 79 శాతం వృద్ధిరేటును సాధించి తన ఘనతను ప్రపంచానికి చాటిచెప్పింది. అనేక అంతర్జాతీయ పరిశ్రమల ఏర్పాటుతో 5.38 లక్షల మందికి ఉపాధి అవకాశాలను విస్తృతం చేసేలా తెలంగాణ సర్కార్ చేసిన కృషి ఇప్పుడిప్పుడే ఫలాలిచ్చేలా అత్యంత వేగంగా కార్యాచరణ సాగుతోంది. ఐకియా, కోకాకోలా, ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్, జాన్సన్ అండ్ జాన్సన్, చైనాకు చెందిన డాంగ్ పాంగ్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్, ఇన్సుమన్ ప్రాజెక్టు వంటివి లక్షలాది కోట్ల పెట్టుబడులతో తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు ముందు కొచ్చాయి. వీటికి తెలంగాణ ప్రభుత్వం సులువుగా టీఎస్ఐపాస్ ద్వారా అనుమతులు, భూముల కేటాయింపు, నిరంతర విద్యుత్ అందజేత, ఇన్‌సెంటివ్‌లు వంటి వాటితో ప్రోత్సాహం కల్పించింది. దీంతో రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోంది. రోజుకో రికార్డును సొంతం చేసుకుంటున్న రాష్ట్రం మరో రికార్డుకు చేరువవుతోంది. పెట్టుబడుల సాధన, పరిశ్రమల వ్యవస్థాపన, ఉపాధి కల్పనలో జెట్ వేగంతో దూసుకుపోతోంది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని ఏకగవాక్ష అనుమతులతో సరికొత్త రికార్డులను సొంతం చేసుకుంది. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం తన మూడేళ్ల అనతి కాలంలోనే 1,60, 894 మందికి ప్రత్యక్ష ఉపాధిని కల్పించి నిరుద్యోగులకు అండగా నిల్చింది.

కొత్త జిల్లాలతో అభివృద్ధిని వికేంద్రీకరణ చేయవచ్చన్న ప్రభుత్వ అంచనాలు నిజమవుతున్నాయి. నూతన పారిశ్రామిక విధానం ద్వారా అత్యధికంగా మారుమూల జిల్లాల్లోనే పరిశ్రమలకు తెలంగాణ సర్కార్ అనుమతులను జారీ చేసింది. పెద్దపల్లి, వరంగల్‌లాంటి జిల్లాలు ఈ రంగంలో శరవేగంగా దూసుకుపోతున్నాయి. పారిశ్రామిక కారిడార్‌గా, వాణిజ్య కేంద్రంగా ఉన్న పెద్దపల్లి ఈ ఐదేళ్లలో గణనీయ అభివృద్ధిని సాధించింది. పారిశ్రామిక వికేంద్రీకరణ ఫలాలు జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక పెట్టుబడుల సాధనలో రంగారెడ్డి జిల్లా కూడా అద్భుత ప్రగతిని సాధించింది. మొదటినుంచీ పారిశ్రామిక రంగంలో తనకున్న హవాను ఈ జిల్లా కాపాడుకుంది. ఈ జిల్లాలో 8వేలకుపైగా పరిశ్రమలు నూతనంగా అనుమతిని సాధించాయి. దేశీయ, విదేశీ పారిశ్రామిక వర్గాల్లో అపారమైన నమ్మకాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పించడంతోనే ఈ ప్రగతి సాకారమైంది. అద్భుతమైన శాంతిభద్రతలు, 24 గంటల ➪ 2వ పేజీలో...



కట్టకపోతే కటీఫ్!

- డబుల్ బెడ్‌రూం గుత్తేదారులపై సర్కారు సీరియస్.. మరొక్క హెచ్చరికతో సరి..
- మారకపోతే బహుళజాతి సంస్థలకు బాధ్యత
- స్వీయపర్యవేక్షణకు సిద్ధమైన సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : లక్షలాదిమంది పేదలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న రెండు పడక గదుల ఇళ్ళ నిర్మాణ ప్రక్రియలో ఆశించిన పురోగతి లేకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ పథకం లక్ష్యాన్ని చేరుకోకపోవడం అత్యంత బాధాకరమని సీఎం కేసీఆర్ అనేక సందర్భాల్లో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. నిర్మాణాలకు అవసరమైన నిధులు సమృద్ధిగా ఉన్నా, నియోజకవర్గ కేంద్రాల్లో స్థలాలు కేటాయించినా ఎందుకు ఆలస్యం జరుగుతోంది? లోపం ఎక్కడుంది? కాంట్రాక్టర్లు ➪ 3వ పేజీలో...



ఇండోనేసియా మాస్టర్స్ విజేత సైనా

- అంతర్జాతీయ టైటిల్‌తో 2019 బోణి
- గాయంతో ప్రత్యర్థి మారిన్ నిష్క్రమణ
- కన్నీళ్లతో కోర్టు వదిలిన కరోలినా

12 లో

ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత జకోవిచ్

నొవాక్‌కు 15వ గ్రాండ్ స్లామ్



బాలిక కిడ్నాప్ సుఖాంతం

- మామిళ్లమడవలో కిడ్నాప్.. హైదరాబాద్‌కు తరలింపు
- 24 గంటల్లో ఛేదించిన పోలీసులు



కిడ్నాపైన బాలికతో పోలీసులు

తుంగతుర్తి, ప్రభన్యూస్: ఆడుకుంటున్న ఐదేళ్ల బాలికను కొందరు కిడ్నాప్ చేస్తే... 24 గంటల్లో వారిని పట్టుకుని చిన్నారిని పోలీసులు రక్షించిన సంఘటన సూర్యాపేట జిల్లాలో సంచలనం సృష్టించింది. సకాలంలో పోలీసులు స్పందించి వేగంగా దర్యాప్తు చేయడంతో కిడ్నాపర్లను గుర్తించడం, నూతన్‌కల్, ఎల్‌బీనగర్ పోలీసులు సమన్వయంతో వ్యవహరించడం, నిందితులకన్నా ముందుగానే వారి ఇళ్లవద్దకు చేరుకుని కాపుకాసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది. నూతనకల్ మండలంలోని మామిళ్లమడవ గ్రామంలో చిన్నారని అపహరించిన దుండగులు హైదరాబాద్‌కు తరలించగా అక్కడ మాటువేసిన నూతన్‌కల్ పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు వివరాలను ➪ 3వ పేజీలో...



అకాల వర్షం అపార నష్టం

- రాష్ట్రవ్యాప్తంగా పలుప్రాంతాల్లో విస్తారంగా వర్షం
- కంది, మిరప, పొగాకు, వేరుశనగ పంటలకు దెబ్బ
- మార్కెట్‌లోకి వచ్చిన ధాన్యం, మిరపకు తీరని నష్టం
- మరో 48 గంటలు వర్షాలు: వాతావరణ శాఖ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. అతిశీతల గాలులు వీస్తుండడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింతగా తగ్గుముఖం పట్టాయి. దీంతో చలి తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ తుపాను ప్రభావం మరో 48 గంటలపాటు కొనసాగుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. మహారాష్ట్ర తీరంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని ఆదివారం సాయంత్రం అధికారులు తెలిపారు. తెలంగాణ మీదుగా కర్నాటక వరకు ఉపరితల ద్రోణి ఆవరించి ఉంది. విదర్భ తూర్పు ప్రాంతంలో 1500 మీటర్ల ఎత్తున ఆవర్తనం కొనసాగుతోందని ఫలితంగా తెలంగాణాలోని అన్ని జిల్లాల్లోనూ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం విడుదల చేసిన తాజా బులెటిన్‌లో పేర్కొంది. కోస్తాంధ్రలోనూ ఓ మోస్తరు వర్షాలు, జల్లులు పడుతాయని, ➪ 2వ పేజీలో...

ఔరా..!



ఫలించిన పరిశ్రమ!

(మొదటిపేజీ తరువాయి)

నిరంతర విద్యుత్, ఇండస్ట్రియల్ ఫ్రెండ్లీ విధానాలు, అవినీతి రహిత అనుమతుల వంటివి పారిశ్రామిక వర్గాల్లో విశ్వాసం పెంచాయి. అంతర్జాతీయ పరిశ్రమల పెట్టుబడులకు ప్రభుత్వం ఈ ఐదేళ్లలో ఇచ్చిన పూర్తి భరోసా మరిన్ని పెట్టుబడులకు అనుకూలంగా మారింది.

ఆగమేఘాలపై అనుమతులు

గతంలో ఎక్కడైనా ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే దాదాపు 33 శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి వచ్చేది. ఇది అనేక వ్యయప్రయాసలు, భారీగా ముడుపులతో కూడుకుని తీవ్ర కాలయాపనకు కారణంగా భావించి అనేక మంది పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లేవారు. తీవ్ర జాప్యం, అవినీతి పారిశ్రామిక రంగానికి ఆటంకంగా ఉన్నాయనే ఆరోపణలు ఉండేవి. ఆ తర్వాత తెలంగాణ ఆవిర్భవించిన అనతికాలంలోనే పారదర్శకతకు చిహ్నంగా టీఎస్ ఐపాస్‌ను సర్కార్ అమలులోకి తెచ్చింది. పారిశ్రామిక వర్గాల స్వీయ ధ్రువీకరణతో అన్ని శాఖల అనుమతులను ఏకగవాక్ష విధానంలో ఒకే దగ్గర అందించే వెసులుబాటు తెలంగాణ ప్రభుత్వం కల్పించింది. మరోవైపు గతంలో ఉన్న పారిశ్రామిక పవర్ హాలీడేలకు తెలంగాణ ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. ఇది పారిశ్రామిక వర్గాలకు ఎంతో ఊరటనివ్వడంతోపాటు ఉత్పాదకత, లాభాల పెంపునకు మార్గంగా నిల్చింది.

రైతుకు ప్యాకేజీ?



(మొదటిపేజీ తరువాయి)

తీసుకోనుందన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఫిబ్రవరి 1నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభవుతున్నందున, ఈ సమావేశాల్లోనే ఇందుకు సంబంధించిన నిర్ణయానికి ఆమోదముద్ర వేయించాలని ఎన్డీయే ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

మోడీ ముందున్న ప్రత్యామ్నాయాలు..

- సకాలంలో బ్యాంకు రుణాలు తిరిగి చెల్లించిన రైతాంగానికి వడ్డీ మాఫీ చేసే ప్రతిపాదన ఒకటి కేంద్రం మదిలో ఉందని తెలుస్తోంది. ఇందుకు రమారమి రూ. 15,000 వేల కోట్లు అవసరం అవుతాయని అంచనా.
- ఆహారపంటలపై బీమా పాలసీ అమలు చేయడం. ఇందుకయ్యే ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించే ప్రతిపాదన కూడా చర్చకు రానుంది.
- తెలంగాణ, ఒడిశా ప్రభుత్వాలు అమలు చేస్తున్న పెట్టుబడి పథకాన్ని జాతీయస్థాయిలో ప్రవేశపెట్టడం. తద్వారా నేరుగా రైతుకు పంటసాయం అందించే యోచన.
- గతంలో మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం అనుసరించిన కనీస మద్దతు ధర విధానంపైనా మోడీ ప్రభుత్వం లోతుగా చర్చించినట్లు తెలుస్తోంది.
- ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకున్నా అమలు చేసేందుకు తగినంత సమయం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ సమావేశాల్లోనే ప్రకటన చేసి, పార్లమెంటు ఆమోదం పొంది, తక్షణమే అమలు చేస్తేనే రాజకీయంగా లబ్ధి కలుగుతుందని పేర్కొంటున్నారు.

షాక్‌కర్స్...!



ఘనంగా గణతంత్రం
తెరలేచిన రణతంత్రం
రాజ్'కీ'య ఎత్తు?
పొటమరిస్తున్న పొత్తు!

కులాల్లో కార్చిచ్చు
బిగిస్తున్నారు ఉచ్చు
ఎత్తుకు పైఎత్తులు?
ఎవరికెవరు మిత్రులు!

-దిన్నా

ఎమ్మెల్సీ ఎవరిని వరించేను?



ఫిబ్రవరి రెండోవారంలో ఎన్నికల నోటిఫికేషన్

- 7తర్వాత ఎప్పుడైనా నోటిఫికేషన్ వచ్చే ఛాన్స్
- ఖాళీల భర్తీపై సీఎం కేసీఆర్ దృష్టి
- ఇప్పటికే కొందరికి ఖరారు
- సిట్టింగ్‌లలో ఐదుగురికి తిరిగి ఛాన్స్?
- శేరి సుభాష్ రెడ్డికి ఇప్పటికే లైన్‌క్లియర్
- మిగతా పదిమంది కోసం పరిశీలన
- ప్రాతినిధ్యం లేనివర్గాలకు పెద్దపీట
- ఎన్నికల హామీల్లో భాగంగా కొందరికి న్యాయం
- ఆశావహులు వందకు పైనే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శాసనమండలిలో ఖాళీ అయిన, అవుతున్న స్థానాల భర్తీకి సంబంధించి ఫిబ్రవరి రెండోవారంలో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, ఫిబ్రవరి 7తర్వాత ఎప్పుడైనా నోటిఫికేషన్ రావొచ్చని టీఆర్ఎస్ వర్గాలు అంచనావేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గం, లోక్‌సభ అభ్యర్థులను బేరీజు వేసుకుని సీఎం కేసీఆర్ ఆచితూచి అభ్యర్థులను ఎంపికచేస్తున్నారు. ఫిబ్రవరి ఐదుతర్వాత లేదా నోటిఫికేషన్ రాగానే ఎమ్మెల్సీ అభ్యర్థులను ఒకేసారి సీఎం కేసీఆర్ ప్రకటించే అవకాశం కనబడుతోంది. ఇప్పటికే ఏడుస్థానాలు ఖాళీ కాగా, మార్చిలో ఖాళీకానున్న తొమ్మిది స్థానాలు కలిపి మొత్తం 16స్థానాలకు ఒకేసారి అభ్యర్థులను ప్రకటిస్తారని టీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నికల్లో పోటీకి ప్రయత్నించి అవకాశం దక్కనివారు, ఎంతోకాలంగా అవకాశం కోసం ఎదురుచూస్తున్నవారు, పార్టీకి ఆదినుండీ విధేయతతో ఉంటూ ఒడిదొడుకుల్లోనూ నిలబడ్డవారు ఇలా అన్ని అంశాలను బేరీజు వేసుకుని సీఎం అభ్యర్థులను ఎంపికచేస్తున్నట్లు తెలుస్తోం ది. ప్రత్య క్షఎన్నికలలో ప్రాతినిధ్యం దక్కని, పెద్దగా ప్రాతినిధ్యం లేని వర్గా లకు ఒకటి,రెండు స్థానాలు ఇవ్వడం ఖాయమని అంచనా వేస్తున్నారు. సీఎం కేసీఆర్ ఆదినుండీ ప్రత్యక్షఎన్నికల్లో సరైన అవకాశాలు దక్కని నేతలను పెద్దలసభకు పంపడం ద్వారా న్యాయం చేస్తున్నారు. రాజ్యసభ సభ్యుల ఎంపికలో ఈ ముద్ర స్పష్టమైంది. శాసనమండలి అభ్యర్థుల ఎంపికలోనూ ప్రస్ఫుటమవుతుందని అంటున్నారు.

ఆరుగురికి ఖరారు?

మొత్తం 16ఎమ్మెల్సీ స్థానాల్లో ఆరు గురికి ఇప్పటికే ఖరారైనట్లేనన్న చర్చ టీఆర్ఎస్ వర్గాల్లో ఉంది. నల్లగొండ ఉపాధ్యాయనియోజకవర్గం నుండి పిఆర్‌టి యు అభ్యర్థిగా బరిలో ఉన్న బిసి వర్గానికి చెందిన పూలరవీందర్‌కు గతంలో లాగే మద్దతు పలకాలని, కరీంనగర్ అభ్యర్థిగా ప్రస్తుత మండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డినే తిరిగి నిలపాలని నిర్ణయించినట్లు తెలు స్తోంది. ప్రస్తుత హోం మంత్రి మహమూద్‌అ లీని తిరిగి ఎంపికచేయ డం లాంఛనమే. ఇటీవల టిఆర్ఎస్‌లో చేరిన కరీంనగర్ ఎ మ్మెల్సీ సంతోష్‌కుమార్‌కు రెన్యువల్ ఖాయమేనని, వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా ఉన్న మహ్మద్ సలీంకు క ూడా రెన్యువల్ జరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఇక సీఎం పొలిటి కల్ కార్యదర్శి శేరిసుభాష్‌రెడ్డికి గతంలో ప్రకటించినట్లుగానే ఎమ్మెల్సీ పదవి ఖాయమైనట్లేనని చెబుతున్నారు. దీంతో ఇప్పటికే ఆరు స్థానాలు దాదాపు ఖరారు కాగా, ఇందులో రెండు మైనారిటీ, రెండు బిసి, రెండు రెడ్డి సామాజికవ ర్గానికి చెందిన వారు ఉన్నారని నేతలు విశ్లేషిస్తున్నారు.

ఆ పదిమంది ఎవరు?

ఇప్పటికే ఆరుస్థానాలకు దాదాపు ఖరారుకాగా, మిగతా పది స్థానాలకు ఆశావహుల సంఖ్య భారీగా ఉంది. వందమందికి పైగా నేతలు గట్టిప్రయత్నాలు చేస్తుండగా.. సీఎం కేసీఆర్ సామాజిక సమీకరణాలు, భవిష్యత్‌లో పార్టీకి జరిగే ఉపయోగం, సేవలను దృష్టిలో పెట్టుకుని వడపోత కార్యక్రమం చేస్తున్నట్లు తెలుస్తోంది. పదిమందిలో ఒకరు లేదా ఇద్దరు మహిళలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్‌కు చెందిన సత్యవతిరాథోడ్, కరీంనగర్‌కు చెందిన జడ్పీఛైర్‌పర్సన్ తుల ఉమ, నల్లగొండకు చెందిన మాజీ మంత్రి ఉమామాధవరెడ్డి పేర్లు ప్రము ఖంగా వినబడుతున్నాయి.





మాజీమంత్రి రెడ్యానాయక్ కుమార్తె కవిత కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుండి అధికారుల సంఘం నేత చంద్రశేఖర్ గౌడ్ లేదా మాజీ ఎమ్మెల్సీ ఆర్. సత్యనా రాయణల లో ఒకరికి ఛాన్స్ దక్కవచ్చు. హైద్రాబాద్ స్థానికసం స్థల ఎమ్మె ల్సీగా ఉన్న ఎంఎస్ ప్రభాకర్‌రావుకు మళ్లీ అవకాశం ఉంటుం దా? లేదా ఆయనను ఏదైనా కీలక కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రకటించి ఆ స్థానం మరొకరికి ఇస్తారా అన్న చర్చ సాగుతోంది. ప్రభాకర్‌రావును షిఫ్ట్ చేయాలనుకుంటే స్థానిక సంస్థల అభ్యర్థిగా సలీంను నిలిపే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఇక హైదరాబాద్ నుండి టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సోమభరత్‌కుమార్ పేరు కూడా వినబడుతోంది. వరంగల్ నుండి బసవరాజు సారయ్య, తక్కళ్ళప ల్లి రవీందర్‌రావుల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరికీ చోటు లభించినా ఆశ్చర్యం లేదని టీఆర్ఎస్ వర్గా లు అంటున్నాయి. రజక వర్గానికి చెందిన సారయ్యకు ప్రాతిని ధ్యం కల్పించే యోచనలో సీఎం ఉన్నారు. ఆదిలాబాద్ నుండి న ల్లాల ఓదేలు, సముద్రాల వేణుగోపాలచారి, గడ్డం అరవింద్ రెడ్డి, నల్లగొండ నుండి గుత్తా సుఖేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, వేనేపల్లి చంద ర్‌రావు, ఉమా మాధవరెడ్డి, కరీంనగర్ నుండి రవీందర్ సింగ్, ఈద శంకర్‌రెడ్డి, తుల ఉమ, కోలేటి దామోదర్ గుప్తా, నిజామా బాద్ నుండి కేఆర్ సురేష్‌రెడ్డి, ఖమ్మం నుండి జలగం ప్రసాదరా వు, దిండిగల రాజేందర్, రంగారెడ్డి నుండి మలిపెద్ది సు ధీర్‌రెడ్డి, శైలేష్‌రెడ్డి, మెదక్ నుండి దేశపతి శ్రీనివాస్, బాలమల్లు పేర్లు వి న బ డ ు త ు న్నాం ు ు. సమీకరణాలన్నింటినీ పరిశీలించి సీఎం ఎవరికి అవకాశమిస్తారోనన్న ఆసక్తి టీఆర్ఎస్ వర్గాల్లో నెలకొంది.

ప్రస్తుతం శాసనమండలిలో ఖాళీలు ఇలా ఉన్నాయి..

- మల్కాజ్‌గిరి ఎమ్మెల్యేగా ఎన్నికకావడంతో మైనంపల్లి హనుమంతరావు, కొడంగల్ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో పట్నం మహేందర్‌రెడ్డి తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. దీంతో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి.
- మునుగోడు ఎమ్మెల్యేగా ఎన్నికకావడంతో నల్లగొండ స్థానికసంస్థల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆ పదవికి రాజీనామా చేశారు.
- వరంగల్ స్థానికసంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కొండా మురళీధర్‌రావు పార్టీమారినందున తన పదవికి రాజీనామా సమర్పించగా, మండలి ఛైర్మన్ ఆమోదించారు.
- ఇక పార్టీమారారన్న కారణంతో యాదవరెడ్డి, ఆర్.భూపతిరెడ్డి, రాములునాయక్‌లను ఎమ్మెల్సీ పదవులకు అనర్హులుగా ప్రకటిస్తూ, సభ్యత్వం రద్దుచేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు.
- రాజీనామాలు, చర్యలతో ఏడు ఖాళీలు ఇప్పటిదాకా ఏర్పడ్డాయి.
- కరీంనగర్,మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా ఉన్న పాతూరిసుధాకర్‌రెడ్డి, గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా ఉన్న స్వామిగౌడ్ పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. ఈనేపథ్యంలో 45రోజుల ముందుగానే ఎన్నికల నోటిఫికేషన్ రానుంది.
- నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయనియోజకవర్గ ఎమ్మెల్సీ పూలరవీందర్ పదవీకాలం కూడా మార్చి 29తో ముగియనుంది. దీంతో అక్కడ ఎన్నిక అనివార్యం.
- ఇక ఎమ్మెల్యే కోటాలో మండలికి ప్రాతినిధ్యం వహిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీతో పాటు టిఆర్ఎస్ సభ్యులు మహ్మద్ సలీం, కాంగ్రెస్ నుండి టిఆర్ఎస్‌లో చేరిన సంతోష్‌కుమార్, ఎంఎస్ ప్రభాకర్, కాంగ్రెస్ సభ్యులు షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డిల పదవీకాలం కూడా మార్చి 29తో ముగియనుంది. దీంతో ఈ ఆరు స్థానాలకు కూడా ఎన్నిక జరపాల్సి ఉంది.
- ఇప్పటికే ఖాళీ అయిన ఏడుకు తోడు మార్చిలో ఖాళీకానున్న తొమ్మిది స్థానాలు కలిపి 16స్థానాలకు ఎన్నిక నిర్వహించనున్నారు.

నేను పేదల పక్షమే..!

- ప్రస్తుత రిజర్వేషన్లపై 10 శాతం ఈడబ్ల్యూఎస్ ప్రభావం ఉండదు
- తమిళనాడు ర్యాలీలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- మదురైలో ఏఐఐఎంఎస్‌కు శంకుస్థాపన
- కొచ్చిలో బీపీసీఎల్ రిఫైనరీ విస్తరణ కాంప్లెక్స్ జాతికి అంకితం

న్యూఢిల్లీ: ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లపై ఈడబ్ల్యూ ఎస్ కోటా రిజర్వేషన్ల ఎలాంటి ప్రభావం చూపబోవని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దళితులు, గిరిజనులు, ఇతరులకు కల్పించిన రిజర్వేషన్లకు ఇబ్బంది లేకుండా చట్టాన్ని తీసుకొచ్చా మన్నారు. రిజర్వేషన్లపై వ్యతిరేక ప్రచారం చేస్తున్న శక్తులను తి ప్పికొట్టాలని యువతను ఆయన పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ప్రతి ఒక్కరికీ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతోనే అదనపు రిజర్వేషన్లను కల్పించామన్నారు.

ప్రస్తుతమున్న రిజ ర్వేషన్లపై ఎలాంటి ప్రభావం లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. తమిళనాడులోని కొందరు వ్యక్తులు రిజర్వేషన్లపట్ల అనుమానం, అవిశ్వాస పరి స్థితులను కల్పిస్తున్నారని విమర్శించారు. వారి ఆసక్తు లను మనుగడలో ఉంచేందుకు రిజర్వేషన్లపై విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు. పేద ప్రజల పక్షాన బలంగా నిలబడతానని మోడీ పునరుద్ఘా టించారు. తమిళానాడులో బీజేపీ నిర్వహించిన ఓ ర్యాలీలో మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకడిన పేదలకు విద్య, ఉద్యోగాలు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకొచ్చిన రాజ్యాంగస వరణ చట్టంపై విమర్శలను ఆయన తిప్పికొట్టారు. తమిళనాడులోని ప్రతిపక్ష పార్టీ డీఎంకే 10 శాతం ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వ్యతిరేకించింది. సామాజిక వెనుకబాటుతనం ఆధారంగానే రిజర్వేషన్లు కల్పించాలని విమర్శించింది. ఈ మేరకు 103వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

తమిళనాడులో ఎయిమ్స్‌కు శ్రీకారం..

తమిళనాడులోని మధురైలో రూ. 1,264 కోట్లతో నిర్మించతలపెట్టిన ఏఐఐఎంఎస్(ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)కు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. 750 పడకలు, 100 ఎంబీబీఎస్ సీట్లు ఉండే ఏఐఐఎంఎస్‌లు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత సంకల్పనాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. దేశంలో ప్రపంచస్థాయి ఆరోగ్య సదుపాయాలను కల్పించేందుకు ఎన్‌డీఏ ప్రభు త్వం కట్టుబడి ఉందన్నారు.

ఈ మేరకు దేశంలోని పలు చోట్ల 14 కొత్త ఏఐఐఎం ఎస్‌లను ఏర్పాటు చేస్తున్నా మన్నారు. ఏఐఐఎంఎస్ తరహా ఆరోగ్య సదుపాయాలను కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు, గుజరాత్ నుంచి గువహాటి వరకు కల్పించను న్నామన్నారు. ప్రధానమంత్రి స్వస్థ్య సురక్ష యోజన పథకం కింద దేశంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పునరుద్ధరించనున్నామన్నారు. తమిళనాడు మెడికల్ కాలేజీల్లో న్యూ సూపర్ స్పెషాలిటీ బ్లాక్స్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

కృతజ్ఞతలు.. నిరసనలు..

ఏఐఐఎంఎస్ శంకుస్థాపన కార్యక్రమానికి తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి హాజరయ్యారు. ఏఐఐఎంఎస్‌ను కేటాయించినందుకు ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోడీ పర్యటనపట్ల ఎండీఎంకే నిరసన వ్యక్తం చేసింది. కావేరి వివాదంలో తమిళనాడుకు మోడీ నమ్మకద్రోహం చేశారని ఆరోపించింది. పార్టీ అధ్యక్షుడు వైకో నిరసన వ్యక్తం చేశారు. నల్లరంగు బెలూన్లతో గోబ్యాక్ మోడీ అంటూ నిరసనలు తెలిపారు. ఆందోళనలు నిర్వహించిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాని మోదీ తమిళనాడు పర్యటనతో ట్విట్టర్‌లో గో బ్యాక్ మోడీ, మధురై థ్యాంక్స్ మోడీ, టీఎన్ వెల్‌కమ్స్ మోడీ వంటి హాష్‌ట్యాగ్స్ ట్రెండింగ్‌లో నిలిచాయి.

బీపీసీఎల్ రిఫైనరీ విస్తరణ

కొచ్చిలో ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్) రిఫైనరీ విస్తరణ కాంప్లెక్స్‌ను ప్రధాని మోడీ జాతికి అంకితం చేశారు. రిఫైనరీ కాంప్లెక్స్ వద్ద కొత్తగా పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఇత్తుమన్నూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, భారీ నిల్వ ట్యాంకు నిర్మాణానికి కూడా ఆయన శంకుస్థాపన చేశారు.

4350 ఎంటీ సామర్థ్యంగల భారీ నిల్వ ట్యాంకర్‌ను ఇది. దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించేందుకు పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

కాపలాదారును తొలగించేందుకే మహాకూటమి..

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కలకత్తాలో నిర్వహించిన యూనైట్ ఇండియా ర్యాలీపై మోడీ విమర్శల దాడి చేశారు. దేశకాపలాదారును తొలగించేందుకే తమ మధ్య విభేదాలను పక్కనబెట్టి విపక్ష నేతల ఏకమయ్యారని ఎద్దేవా చేశారు. తనపై వ్యతిరేకత, భయం కారణంగానే అంతా ఒక్కటయ్యారన్నారు. తాను మాత్రం పేద ప్రజల పక్షాన ఉంటానని పునరుద్ఘాటించారు. అవినీతి, కుటుంబ పాలన నుంచి దేశాన్ని రక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవినీతికి వ్యతిరేకంగా తాను తీసుకుంటున్న చర్యలు చైన్నై నుంచి ఢిల్లీ వరకూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయన్నారు. కాంట్రాక్టులు, సంక్షేమ పథకాల్లో అవినీతికి పాల్పడినవారు పట్టుబడుతున్నారన్నారు. దేశాన్ని మోసం చేసినా, దోచుకున్నా న్యాయస్థానాల ముందు నిలబడాల్సి ఉంటుందన్నారు. నేరగాళ్లు భారత్‌లో ఉన్నా, విదేశాల్లో ఎక్కడున్నా తీసుకొచ్చి బోనులో నిలబెడతామన్నారు. పెద్ద మొత్తంలో బ్యాంకు రుణాలు తీసుకుని విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరగాళ్లు విజయ్‌మాల్యా, నిరవ్ మోడీ, మెహుల్ ఛోక్సీలను ఉద్దేశించి మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు.



అకాల వర్షం అపార నష్టం

(మొదటిపేజీ తరువాయి)

వాతావరణం పూర్తిగా మేఘావృతమై ఉంటుందని వెల్లడించింది. తుపాను తీవ్రతపై అధికారుల అంచనా ప్రకారం దక్షిణ తెలంగాణ జిల్లాల్లో సోమవారం కూడా భారీ వర్షాలు పడనున్నాయి. శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన ఉపరితల ఆవర్తనంతో అన్ని జిల్లాలతో పాటు రాజధాని హైదరాబాద్‌లోనూ భారీ వర్షాలు కురిశాయి. దాదాపు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో రహదారులన్నీ జలదిగ్బంధంతో చిక్కుకున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు ఇళ్ళల్లోకి చేరింది. మహానగర పాలక సంస్థ డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు రంగంలోకి దిగి నష్టనివారణ చర్యలు ప్రారంభించాయి.

భారీ వర్షాల ధాటికి వ్యవసాయ రంగానికి భారీ నష్టం జరిగింది. పొగాకు, కంది, మిరప పంటలతో పాటు మార్కెట్లోకి వచ్చిన వరిధాన్యం, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాల నుంచి అందిన ప్రాథమిక సమాచారం మేరకు దాదాపు 50వేల ఎకరాల్లో పంటనష్టం సంభవించింది. మెదక్, మహబూబ్‌నగర్, గద్వాల, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, గజ్వేల్, సిద్దిపేట జిల్లాల్లో నష్టం తీవ్రంగా కనిపిస్తోంది. హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపిన సమాచారం మేరకు గడిచిన 24 గంటల్లో సిద్దిపేట జిల్లా నంగునూరు, దుబ్బాకలలో అత్యధికంగా 10 సెంటిమీటర్ల గరిష్ఠ వర్షపాతం రికార్డయింది. అలాగే భూపాలపల్లి, మొగుళ్ళపల్లి, హుజూరాబాద్, మంథని, తిమ్మాపూర్‌లలో 7 నుంచి 8 సెంటిమీటర్ల వర్షం కురిసింది. మిగతా అనేక ప్రాంతాల్లో 5 సెంటిమీటర్ల వరకు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారి శ్రావణి తెలిపారు.

ప్రైవేటు ఉద్యోగులకు ప్రభుత్వ అండ

హరీష్‌రావు భరోసా



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రైవేటు ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో ప్రైవేటు ఉద్యోగులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఉన్న మంత్రుల నివాసముదాయంలోని తన నివాసంలో తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్రకమిటీ 2019డైరీని ఆయన ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రైవేటు ఉద్యోగులు తమవంతు పాత్ర పోషించారని, ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తూ దేశంలోనే నెంబర్‌వన్ సంక్షేమప్రభుత్వంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ బిబిపాటిల్ , సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తం, నాయకులు పాల్గొన్నారు.

వాహనాల రిజిస్ట్రేషన్‌కు కొత్త రూల్స్

(మొదటిపేజీ తరువాయి)

పరిమితం కానుంది. తొలుత రవాణేతర వాహనాల రిజిస్ట్రేషన్లను డీలర్ల వద్దే నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఈ విధానంతో రవాణా శాఖ కార్యాలయాల వద్ద ఏజెంట్ల మోసాలు, అవినీతిని తగ్గించేందుకు అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

అక్రమాలకు పాల్పడితే డీలర్లపై చర్య

వాహనాల రిజిస్ట్రేషన్లకు నిర్దేశించిన ఫీజు కన్నా ఎక్కువ మొత్తాన్ని వసూలు చేస్తే వాహనాల డీలర్లకు భారీ జరిమానా విధించడంతో పాటు వారికున్న డీలర్ షిప్‌లను కొన్ని నెలల పాటు రద్దు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం నిబంధనలను అమలులోకి తెచ్చింది. హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్‌లను డీలర్లే వాహనాలకు అమర్చాల్సి ఉంటుంది. హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌లు లేకుండా వాహనం రహదారిపైకి వస్తే భారీగా జరిమానా కూడా విధించనున్నారు. అలాగే, నెల రోజుల పాటు రిజిస్ట్రేషన్‌లు చేయకుండా సదరు వాహనం డీలర్‌పై నిషేధం విధించనున్నారు. రెండోసారి కూడా ఇటువంటి తప్పే చేస్తే మూడు మాసాల పాటు డీలర్ రిజిస్ట్రేషన్ లైసెన్సును సస్పెన్షన్‌లో పెట్టడంతో పాటు రూ.5 లక్షలు జరిమానా వసూలు చేసే అధికారాన్ని కేంద్రం కట్టబెట్టింది. ఇటువంటి తప్పులు అనేక పర్యాయాలు చేస్తే రిజిస్ట్రేషన్ లైసెన్సు రద్దు చేసి వాహన డీలర్లపై కేసులు కూడా నమోదు చేయనున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్‌కు నిర్దేశిత ఫీజుకన్నా అధికంగా వసూలు చేసే డీలర్లకు కేసును బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు జరిమానా విధించేలా మార్గదర్శకాలు రూపొందించారు. కొత్త విధానం అమలుకు ప్రస్తుతం ఉన్న వ్యవస్థను సమూలంగా మార్చాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు.

ఆన్‌లైన్ వ్యవస్థ... సమూల మార్పులు

డీలర్ల వద్ద వాహనాల రిజిస్ట్రేషన్‌లను చేపట్టేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటుంది. ఇందుకోసం రూ.11 కోట్లు అవసరం అని రవాణా శాఖ అంచనా వేస్తోంది. వచ్చే నెల రోజుల పాటు ఈ ఆన్‌లైన్ వ్యవస్థను రూపొందించి ప్రయోగాత్మకంగా డీలర్ల వద్ద రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని, సాంకేతికపరమైన ఇబ్బందులు తలెత్తితే మార్చి నెల చివరి వరకు వాటిని అధిగమించి ఏప్రిల్ 1 నుంచి పూర్తి స్థాయిలో డీలర్ల వద్దే వాహనాల రిజిస్ట్రేషన్‌కు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఫ్యాన్సీ నెంబర్లు కావాల్సిన వారు, వాటిని కోరుకునే వారు తప్పనిసరిగా రవాణాశాఖ కార్యాలయానికి వెళ్లవలసి ఉంటుంది.

మార్గదర్శకాలు ఇలా....

నూతన వాహనాల రిజిస్ట్రేషన్ విధానానికి సంబం ధించిన మార్గదర్శకాలను, విధి విధానాలను, రవాణాశాఖ తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. ఈ విధానంలో తొలుత వ్యక్తిగత వాహనాలైన కార్లు, బైకులను విక్రయించే డీలర్ల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు కల్పిస్తూ మార్గదర్శకాలను రూపొందించారు. రిజిస్ట్రేషన్‌కు ఎప్పటిలానే స్లాట్ విధానాన్ని కొనసాగించాలని, ఇందుకోసం కొత్తగా రూపొందిస్తున్న సాఫ్ట్‌వేర్‌లో అన్ని వివరాలను పొందుపర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ఇదివరకే ఏర్పాటైన 21 జిల్లాల్లో రవాణాశాఖ కార్యాలయాలు పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభించాయి. కొత్తగా ఏర్పాటు చేసిన నారాయణపేట, ములుగు జిల్లాల్లోనూ మార్చి చివరి నాటికి ఈ కార్యాలయాలను ప్రారంభించాలని రవాణాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. వాహనాల అమ్మకాలకు డీలర్లు లేని ప్రాంతాలలో ఎవరైనా వాహనాలను కొనుగోలు చేస్తే వారు ఎక్కడ కొన్నారో అక్కడే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, కొనుగోలు సమయంలోనే తమ చిరునామాలను స్పష్టంగా పేర్కొనాలని రవాణాశాఖ కోరుతోంది. వాహనాలు కొనుగోలు చేసే సమయంలోనే సంబంధిత డీలర్లు రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన మార్గదర్శకాలను, నియమ, నిబంధనలను వాహన యజమానులకు తెలియపర్చాలని, హైసెక్యూరిటీ నెంబర్‌ప్లేట్ల విషయంలోనూ వారికి దిశానిర్దేశనం చేయాల్సిన బాధ్యత కూడా డీలర్లపైనే ఉందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం అనగా ఏప్రిల్ 1 నుంచే ఈ విధానం అమలులోకి రానుంది.



ముహూర్తం ఓకే 7న విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)

పైగా చర్చించినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతుండటం, ఫిబ్రవరి 15న కేంద్ర ఆర్థిక సంఘం ప్రతినిధుల బృందం రాష్ట్రానికి రానుండటంతో ఈ లోపే మంత్రివర్గ విస్తరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్న ఆలోచనలో కేసీఆర్ ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. నాలుగు రోజుల పాటు సాగిన శాసనసభ సమావేశాలు ఆ తర్వాత ఐదు రోజుల పాటు జరిగిన సహస్ర చండీ యాగంలో బిజీగా ఉన్న కేసీఆర్.. శుక్రవారం రాత్రి ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి హైదరాబాద్ వచ్చారు.

కేటీఆర్‌తో కేసీఆర్ చర్చ

శనివారం రోజంతా రిపబ్లిక్ డే వేడుకల్లో గడిపిన ఆయన ఆదివారం మంత్రివర్గ విస్తరణపై దృష్టిసారించినట్లు చెబుతున్నారు. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావుతో మంత్రివర్గ కూర్పుపై సమాలోచనలు జరిపినట్లు తెలుస్తోంది. ఓ వైపు పార్టీ కార్యకలాపాలు, పంచాయతీ ఎన్నికలపై దృష్టి పెట్టిన కేసీఆర్ మరోవైపు మంత్రివర్గ కూర్పు పై తనదైన శైలిలో సమాచారం తెప్పిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిసింది. చండీయాగం ముగిసి పంచాయతీ ఎన్నికలు తుది దశకు చేరుకోవడంతో ఇక ఎమ్మెల్యేల దృష్టంతా మంత్రివర్గ విస్తరణపైనే పడింది. శాసనసభ ఎన్నికల ఫలితాలు ప్రకటించి 56 రోజులు గడుస్తుండటంతో అధినేత నిర్ణయం కోసం ఆశావహులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. డిసెంబర్ 11న అసెంబ్లీ ఫలితాలు వెలువడగా 13న సీఎం కేసీఆర్‌తో పాటు హోం మంత్రిగా మహమూద్ అలీ ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఇది జరిగిన కొన్ని రోజుల్లోనే మరో విడత విస్తరణ ఉంటుందని భావించినా.. కేసీఆర్ మాత్రం శాసనసభ సమావేశాలు తర్వాతే మంత్రివర్గంలోకి కొత్తవారిని తీసుకుంటామన్న సంకేతాల నిచ్చారు. అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. ఆ తర్వాత ఐదు రోజుల పాటు చండీయాగం కూడా నిర్వహించారు. ఇక మంత్రివర్గం ఎప్పుడు కొలువు తీరుతుందోనన్న ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో కేసీఆర్ తేనీటి విందు కార్యక్రమంలో భాగంగా గవర్నర్‌ని కలిసి సుదీర్ఘంగా మాట్లాడటంతో మంత్రి పదవుల కోసం వేచి చూస్తున్న వారిలో ఆశలు చిగురించాయి. స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం, డిప్యూటీ స్పీకర్‌గా ఎవరిని ఎంపిక చేయకపోవడంతో ఆశావహులు తమ పదవుల కోసం వెంపర్లాడుతూ కేసీఆర్, కేటీఆర్‌ని ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

ఊహలపల్లకిలో....

కేంద్ర ప్రభుత్వం ఈ దఫా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్ట నుండటంతో కేసీఆర్ కూడా రాష్ట్రంలో ఇదే తరహా బడ్జెట్‌ను శాసనసభ ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. బడ్జెట్‌ను ప్రవేశ పెట్టాలంటే ఆర్థికమంత్రి తప్పనిసరి. మరి ఈ దఫా ఈ మంత్రిత్వశాఖ ఎవరికి దక్కుతుంది? అన్న సస్పెన్స్ కొనసాగుతోంది. పరిమిత సంఖ్యలో మంత్రులను తీసుకుంటారా? లేక పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని విస్తరిస్తారా? అనే అంశంపై స్పష్టత లేకపోవడంతో ఎవరికి వారు తమకు మంత్రి పదవులు ఖాయమన్న ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో మంత్రులుగా పనిచేసిన నలుగురు సీనియర్లు ఓటమి చెందడంతో వారి స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన నేతలు ఆ జిల్లాల్లోనే మంత్రి పదవుల కోసం పోటీ పడుతుండటం గమనార్హం. ఎమ్మెల్యేలుగా ఉండి మంత్రులుగా పనిచేసిన వారిలో ఈ దఫా తిరిగి అదే పదవులు దక్కే అవకాశం లేదన్న ప్రచారం ఊపందుకుంది. యువనేత కేటీఆర్ నాయకత్వంలో పనిచేయడానికి సరైన జట్టును కేసీఆర్ సిద్ధం చేస్తున్నారని పార్టీలో అంతర్గతంగా ప్రచారం జరుగుతోంది. ఒకే స్వభావం కలిగిన ప్రభుత్వ శాఖలన్నింటినీ ఒకే మంత్రి పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించిన కేసీఆర్ ఆ దిశగా మంత్రుల ఎంపికలోనూ ఇదే విధానానికి శ్రీకారం చుట్టాలని ప్రతిపాదించినట్లు సమాచారం. సీఎంతో పాటు 18 మందిని మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉంది. మరో 16 మందికి అవకాశం ఉన్నా.. ఈ దఫా ఇందులో ఎంతమందిని తీసుకుంటారో?నన్న అనుమానాలు, చర్చలు జోరుగా సాగుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పూర్తి మంత్రివర్గం కాకుండా కొందరిని తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. సమర్థత, పార్టీ పట్ల విధేయత, సామాజిక సమీకరణలు, జిల్లాలు, ఇటీవల ఎన్నికల్లో పనిచేసిన విధానం, ఎన్నికల ప్రచారం, పంచాయతీ ఎన్నికల్లో వారి పాత్ర వంటి అంశాలను బేరీజు వేసుకుని మంత్రులుగా అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కీలకమైన సాగునీటి పారుదల శాఖతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖలను కొంతకాలం తన వద్ద ఉంచుకోవాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. అటవీశాఖపై ప్రత్యేక దృష్టి సారించిన కేసీఆర్ అడవిదొంగలపై ఉక్కుపాదం మోపుతానని, కలపను అక్రమంగా తరలించే వారితో పాటు వన్య ప్రాణులను సంహరించే వారిపై పీడీచట్టాన్ని ప్రయోగించాలని అధికారులకు గట్టిగా హెచ్చరించిన కేటీఆర్ అటవీ పర్యావరణ శాఖను కూడా కొంతకాలం తానే నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం.



పిల్లల్లో స్ఫూర్తి నింపేందుకే ది డాట్ దట్ వెంట్ ఫర్ ఏ వాక్

• రచయితలు రీమా గుప్త, శారద అక్కినేని, లక్ష్మీ నంబియార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పిల్లలకు స్ఫూర్తినిచ్చే విధంగా ది డాట్ దట్ వెంట్ ఫర్ ఏ వాక్ పుస్తకాన్ని రూపొందించామని రచయిత్రులు రీమా గుప్త, శారద అక్కినేని, లక్ష్మీ నంబియార్ తెలిపారు. గడిచిన 200 సంవత్సరాల నుండి నేటి వరకు వివిధ రంగాల్లో రాణించి, భావి తరాలకు మార్గదర్శకులుగా నిలిచిన 51 మంది భారతీయ నారీమణుల జీవిత విశేషాలను ఈ పుస్తకంలో పొందుపరిచామని వారు చెప్పారు. ఆదివారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో జరిగిన హైదారాబాద్ లిటరరీ ఫెస్టివల్ కార్యక్రమంలో ఆ పుస్తకాన్ని హెచ్‌పీఎస్ డైరెక్టర్ ఫయాజ్ ఖాన్, ప్రిన్సిపల్ స్కంద బాలీ కలిసి ఆవిష్కరించారు. అనంతరం రచయిత్రులు రీమా గుప్త, శారద అక్కినేని, లక్ష్మీ నంబియార్‌లు కలిసి ఇండియా ఎహెడ్ - ఆంధ్రప్రభతో ప్రత్యేకంగా మాట్లాడుతూ పుస్తకం గురించి వివరించారు.. ఝాన్సీరాణీ మొదలుకుని 51 మంది మహిళలను ఎంపిక చేసుకుని వారి ఆదర్శభావాలను పిల్లలకు అర్థమయ్యే రీతిలో పుస్తకంలో వివరాలను క్రోఢీకరించామన్నారు. ఈ పుస్తకంలో ఏడు నుంచి పన్నెండు సంవత్సరాల లోపు వయస్సున్న బాలలకు అర్థమయ్యే విధంగా లెర్నింగ్ టెక్నాలజీతో కూడిన చిట్టి కథలు ఉంటాయన్నారు. స్వాతంత్ర సమరంలో పోరాడిన మహిళలు, శాస్త్రవేత్తలు, వ్యాపారం, పురాతన మార్షల్ ఆర్ట్స్, ఆయుర్వేదం, యోగా, విద్య, న్యాయం, వైద్యం, భరతనాట్యం వంటి ప్రముఖ రంగాల్లో అత్యుత్తమంగా రాణించిన మహిళల వివరాలను సేకరించి పుస్తకంలో పొందుపరిచామన్నారు.

ఝాన్సీరాణీ(స్వాతంత్ర్య సమరయోధురాలు), జానకి అమ్మాళ్ (బొటానికల్ శాస్త్రవేత్త), రుక్మిణీదేవి అరుండల్ (భరతనాట్యం), కమలా దేవి ఛటోపాధ్యాయ (నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఫౌండర్), ననమ్మాళ్ (యోగా గురువు) వంటి 51మంది ప్రముఖుల జీవిత విశేషాలతో లఘు రూపంలో కథలను రూపొందించామన్నారు. అయితే 51 మంది నారీమణులు జీవితాల్లో సొంతం చేసుకున్న భారతరత్న, తదితర అవార్డులను స్పృశించకుండా కథలను తయారు చేయడం జరిగిందని వారు వెల్లడించారు.

బాలిక కిడ్నాప్ సుఖాంతం

(మొదటిపేజీ తరువాయి)

తుంగతుర్తి పోలీసులు మీడియాకు వివరించారు. నూతనకల్ మండలం మామిళ్లమడవలో చివ్వెంల ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం లింగాల వెంకన్న, రేణుకల కూతురు, ఐదేళ్ల కీర్తన సాయంత్రం 4:30గంటల సమయంలో ఇంటి సమీపంలో ఆడుకుంటోంది.ఆ సమయంలో అక్కడకు వచ్చిన మద్దిరాల మండలం మామిళ్ళమడవ ఆవాసం ధరావత్ తండాకు చెందిన ధరావత్ ఈరన్న,శాంతి, రవి బాలికను దగ్గరకు పిలిచి బిస్కెట్ ప్యాకెట్ ఇచ్చి కబుర్లలో పెట్టారు. అప్పుడే వచ్చిన సూర్యాపేట బస్సులో బాలికను తీసుకెళ్లారు. తన కూతురు కీర్తన కనిపించకపోవడంతో వెంకన్న 100కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు. ముందుగా మద్దిరాల ఎస్ఐకి కాల్ వెళ్ళగా అక్కడి ఎస్ఐ నూతనకల్ ఎస్ఐ శివకుమార్‌కు విషయంచెప్పి అప్రమత్తం చేశాడు. సిబ్బందితో చివ్వెంల క్రాస్ రోడ్డుకు చేరుకొన్న ఎస్ఐ శివకుమార్ బాలిక, కిడ్నాపర్ల కదలికలపై ఆరా తీశారు. వారంతా ఎర్రపాడు స్టేజీవద్ద దిగారని బస్ కండక్టర్ చెప్పడంతో మహబూబాబాద్ జిల్లా, దంతాలపల్లి వద్దకు చేరుకున్న ఎస్ఐ శివకుమార్ సీసీ కెమెరా రికార్డులను పరిశీలించేప్రయత్నం చేశారు.అవి పనిచేయకపోవడంతో మళ్లీ చివ్వెంల క్రాస్‌రోడ్డుకు వచ్చి విచారణ చేపట్టారు. నిందితులు బిస్కెట్ ప్యాకెట్ తన దుకాణంలోనే కొన్నారని, బాలికను వారు తీసుకెళ్లారని నిర్ధారించాడు. ఎక్కడినుంచి వచ్చారని అడిగితే మామిళ్లమడవ ధరావత్ తండా నుంచి వచ్చామని వారు చెప్పారని దుకాణం యజమాని చెప్పడంతో పోలీసులకు ఆధారం దొరికనట్టయింది.

ఫలించిన పోలీసుల సమన్వయం

హైదరాబాద్‌కు బయలుదేరిన నూతన్‌కల్ పోలీసులు ఎల్‌బినగర్ పోలీసులను అప్రమత్తం చేశారు. కిడ్నాపర్ల ఇంటి అడ్రస్ తెలిపి నిఘా పెట్టాలని కోరడంతో పోలీసులు మన్సూరాబాద్‌లోని కిడ్నాపర్‌ల ఇంటి వద్దకు చేరుకున్నారు. కిడ్నాపర్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నూతనకల్ ఎస్ఐ తన బృందంతో అక్కడకు చేరుకొని కిడ్నాపర్లను అదుపులోకి తీసుకొని బాలికతో పాటు తుంగతుర్తికి తీసుకువచ్చారు. కిడ్నాపర్లకు గతంలో నేర చరిత్ర లేదని, బాలికను అమ్మి సొమ్ము చేసుకుందామనుకున్నారని తెలిపినట్లు సీఐ తెలిపారు. ఆదివారం కీర్తనను తండ్రి వెంకన్నకు తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో సీఐ అయోధ్య, ఎస్ఐ శివకుమార్‌లు అప్పగించారు. ఈ మేరకు ముగ్గురు కిడ్నాపర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 24గంటలు గడవకముందే గుర్తు తెలియని వ్యక్తులు చేసిన కిడ్నాప్‌ను ఛేదించిన నూతనకల్ ఎస్ఐ శివకుమార్‌ను, కానిస్టేబుల్ వీరబాబు, శ్రీనివాస్, బలరాంలను సీఐ అభినందించారు.



సేవల రంగంలో భారీ వృద్ధి

కలిసి వస్తున్న జీఎస్‌డీపీ

• ఈ ఏడాది ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి ఢోకా లేదిక • ఖర్చులు పెరిగినా ఆందోళన లేదు

• పెరుగుతున్న రాబడులు • రుణ సేకరణకు మార్గం సుగమం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రాష్ట్రంలో సేవల రంగంలో భారీ వృద్ధి రేటు సొంతమవుతోంది. దీంతో రాబడి పెరిగి జీఎస్‌డీపీ వృద్ధిరేటు దిశగా పరుగులు పెడుతోంది. ఎఫ్ఆర్‌బీఎం(రుణ పరిమితి)చట్టానికి రాష్ట్ర జీఎస్‌డిపి పెరుగుదలే కీలకంగా మారనుంది. దీంతో రాష్ట్ర అప్పులకు ఇది మరింత అనుకూలంగా మారనుందని ఆర్థిక శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. జీఎస్‌డీపీ గణనకు 2004-05 ఆర్థిక ఏడాదిలను గుర్తించడాన్ని సవరించిన కేంద్ర ప్రభుత్వం మూల వార్షికాన్ని 2011-12కు మార్చింది. అప్పటినుంచీ అన్ని రాష్ట్రాలు కూడా దీనినే అనుసరించాలని ఆదేశించింది. రాష్ట్రాల జీఎస్‌డీపీ అంచనాలకు అవసరమైన పలు ఉత్పత్తులలో కేంద్రం 50 శాతం అంచనా వేస్తే, రాష్ట్రాలు 50 శాతం అంచనా వేస్తాయి. అయితే తెలంగాణలో తాజా పరిస్థితుల నేపథ్యంలో వృద్ధిరేటు 10నుంచి 14 శాతం మధ్య ఉండే అవకాశాలున్నాయని ఆర్థిక, ప్రణాళికా శాఖలు అంచనా వేస్తున్నాయి. ఇది తేలితే ఇక 2019-20లో రాష్ట్ర ఆదాయం (జీఎస్‌డీపీ) ఎంత ఉందనేది స్పష్టం కానుంది.

రూ.2లక్షల కోట్ల బడ్జెట్...

ఈ యేడాది బడ్జెట్ ప్రస్తు వార్షిక ఏడాదికంటే 10నుంచి 15 శాతం పెరుగుదలతో రూ. 2లక్షల కోట్లకు చేరనుందని తెలుస్తోంది. అయితే ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు ఈ యేడాది నిధుల్లో అధిక ప్రాధాన్యతనివ్వనున్నారు. వివిధ పథకాలకు గత బడ్జెట్‌ల తరహాలో ఇబ్బడిముబ్బడిగా కాకుండా ప్రాధాన్యత మేరకే నిధుల కేటాయింపు జరగనుంది. రాష్ట్రస్థూల ఉత్పత్తి పురోగమనం నేపథ్యంలో మొత్తం ఆదాయంలో 3.5 శాతం ప్రకారం అంటే రూ. 20నుంచి రూ. 24వేల కోట్ల మేర ఎఫ్ఆర్‌బీఎం చట్టం కింద మార్కెట్ రుణాలు తెచ్చుకునేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేయనున్నారు. మరోవైపు మిగతా మొత్తం ఆదాయాలను కేంద్ర సాయం, గ్రాంట్లతో పాటు రాష్ట్ర వనరులపై అంచనాలు పెట్టుకోనున్నారు.

15శాతం అంచనాల పెంపు...

ఈ యేడాది రాష్ట్ర ఆర్థిక రాబడులు, పన్నేతర, సొంత వనరుల రాబడిలో 15 శాతం వృద్ధిరేటు నేపథ్యంలో కీలకశాఖలపై అంచనాలు మరో 15నుంచి 18 శాతం మేర పెరగనున్నాయి. ఇక ప్రస్తుత ఆర్థిక యేడాదిలో ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలైన గృహ నిర్మాణం, గ్రామీణ తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత నివ్వనున్నారు. ప్రధానంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు భారీగా నిధుల కేటాయింపు తప్పనిసరి కానున్నది. ఇరిగేషన్‌కు బైటినుంచి, ప్రధానంగా ఆర్థిక సంస్థలనుంచి రుణం సేకరించాలని ప్రతిపాదించనున్నారు. కార్పొరేషన్ల పేరుతో చేసే రుణాలను బడ్జెట్‌లో ప్రస్తావించే అవకాశం లేదు.

పెరగనున్న ఖర్చుల భారం...

తాజా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రాష్ట్రప్రాధాన్య తా పథకాలకే సింహభాగం నిధులు అక్కరకానున్నాయి. ప్రభుత్వ పథకాల తోపాటు ఉద్యోగుల వేతనాలు, పీఆర్సీ అమలు, ఐఆర్‌తోపాటు ఇతర సౌకర్యాల కల్పనకు అధిక వ్యయం కానుంది. గతంలో ప్రభుత్వం ప్రకటించిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమాన వేతనాలు, క్రమబద్ధీకరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు ఖజానాపై భారం మోపనుంది. ఇందులో మిషన్ కాకతీయ, సాగునీరు, విద్యుత్ ప్రాజెక్టులు, రైతు రుణమాఫీ, సబ్సిడీ ఎరువులు, విత్తనాల సరఫరా, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, డబుల్ బెడ్‌రూం ఇండ్లతోపాటు పెరిగిన కొత్త ఉద్యోగాలు, తెలంగాణ తొలి పీఆర్సీ అమలు నేపథ్యంలో ఉద్యోగులు వేతనాలకు అధికంగా కేటాయింపులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఫ్రంట్ కోసం ఢిల్లీలో కేసీఆర్ యాగం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ సీఎం కేసీఆర్ మరో యాగానికి సిద్ధమౌతున్నారా..? దేశ రాజధాని ఢిల్లీ వేదికగా యాగం నిర్వహించేందుకు కేసీఆర్ సన్నాహాలు చేస్తున్నారా..? అంటే టీఆర్ఎస్ వర్గాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ఫెడరల్ ఫ్రంట్ విజయానికి, లోక్‌సభ ఎన్నికల తర్వాత జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేందుకు కేసీఆర్ ఢిల్లీలో రాజశ్యామల యాగం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. వచ్చేనెల చివరి వారంలో లేదా.. మార్చి తొలివారంలో యాగం నిర్వహించేలా కేసీఆర్ యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు విశాఖ శారదాపీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర ఆశీర్వాదాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫెడరల్ ఫ్రండ్ విజయానికి రాజశ్యామల యాగం నిర్వహించాలని పండితులు సూచించడంతో కేసీఆర్ అందుకు తగిన ఏర్పాట్లను చేసుకుంటున్నారని తెలుస్తోంది. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాట్లు జరుగుతుండగానే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మహాకూటమితో జతకట్టి మోడీని గద్దె దించేందుకు జాతీయ పార్టీల నాయకులతో చర్చలు జరుపుతున్నారు. మమతా బెనర్జీ కోల్‌కతాలో నిర్వహించిన భారీ ర్యాలీకి సైతం చంద్రబాబు హాజరై మోడీపై ధిక్కార స్వరం వినిపించారు. ఈనేపథ్యంలో వచ్చే ఎన్నికల తర్వాత మహాకూటమి, కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌లలో ఏది నిలబడుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

తెలుగు జాతికి ఎన్టీఆర్ స్ఫూర్తి

• మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు



'ఎన్టీఆర్ బయోగ్రఫీ' పుస్తకావిష్కరణలో మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఖ్యాతి తెలుగు భాష, సంస్కృతి ఉన్నంత వరకు ఉంటుందని మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ, ఐఆర్ఎస్ అధికారి కె చంద్రహాస్‌లు రచించిన ఎన్‌టీఆర్ బయోపిక్ ఇంగ్లీష్ పుస్తకాన్ని ఆయన ఆదివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. పుస్తకం ఆవిష్కరణ అనంతరం మొదటి ప్రతిని ఎన్‌టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణకు అందించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ దివంగత సీఎం ఎన్‌టీఆర్ మహానుభావుడని కొనియాడారు. సమాజం కోసం లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్‌లా సేవ చేశారని అన్నారు. ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రిగా తెలుగు ప్రజలకు చేసిన సేవ మరెవ్వరూ చేయలేదన్నారు. తాను సినిమాలు చూడనని, పవన్ కళ్యాణ్ ఎవరో తెలియదన్నారు. చిరంజీవి తెలుసని.. వాళ్ల నాన్న కూడా తెలుసన్నారు. తాను ఎక్సైజ్ మంత్రిగా ఉన్నప్పుడు బదిలీ కోసం వస్తే పని చేసి పెట్టానని చెప్పారు. ఎన్‌టీఆర్ జీవిత చరిత్రను ఇంగ్లీష్‌లో పుస్తక రూపంలో తీసుకురావడం సంతోషంగా ఉందని ఎన్‌టీఆర్ తనయుడు రామకృష్ణ అన్నారు. ఎన్‌టీఆర్ చరిత్ర దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తెలిసే అవకాశం ఉందన్నారు.

కట్టకపోతే కటీఫ్!



(మొదటిపేజీ తరువాయి)

ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు? అనే అంశాలపై స్వయంగా తానే దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు సంబంధించి త్వరలోనే ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి సుదీర్ఘంగా చర్చించనున్నారు. జిల్లాలు, నియోజకవర్గాలు, ప్రాజెక్టుల వారీగా అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం తీసుకుని, మరో రోజు కాంట్రాక్టర్లతో సమావేశం కావాలని నిర్ణయించారు. నిర్దిష్టమైన కాల వ్యవధిని విధించి, ఆ తర్వాత ఒప్పందాలను రద్దు చేయాలన్న ఆలోచనను ఇప్పటికే అధికారులతో పంచుకున్నారు. ఇప్పటికే ఒకటి, రెండు సార్లు నోటీసులు జారీ చేసిన ప్రభుత్వం చివరగా మరోసారి నోటీసులిచ్చి...వారిలో మార్పు రాకపోతే ఒప్పందాలు రద్దు చేయాలని భావిస్తోంది. అనంతరం బహుళజాతి నిర్మాణ సంస్థలకు బాధ్యతలు అప్పగించాలని భావిస్తోంది. తుది దశకు చేరుకున్న కొన్ని ఇళ్లనైనా మార్చినాటికి పూర్తిచేయాలన్న ధృడ సంకల్పంతో చర్చలు ముమ్మరం చేశారు.

ఎవరినీ వదలొద్దు

సాహసోపేత నిర్ణయంతో దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ''డబుల్ బెడ్‌రూమ్'' ఇళ్ళ నిర్మాణంలో జరుగుతున్న నిర్లక్ష్యంపై సీఎం కేసీఆర్ స్వయంగా దృష్టిపెట్టి వచ్చే ఆర్థికసంవత్సరంలో మొదటి దశ ఇళ్ళ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంకల్పించారు. నియోజకవర్గ కేంద్రాల్లో మిశ్రమ ప్రగతి పట్ల ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆందోళన నేపథ్యంలో వాస్తవ పరిస్థితులపై తాజాగా ఆరా తీశారు. లక్ష్యం మేరకు ముందుకు సాగని నిర్మాణ పనులపై అందుకు గల కారణాలపై ఆయన ఆగ్రహంతో ఉన్నారు. సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఎంచుకున్న లక్ష్యాలపై గ్రామస్థాయిలో నీలినీడలు కనిపిస్తున్నందున నిర్లక్ష్యానికి గల కారణాలపై విచారన జరిపి బాధ్యులపై చర్యలకు ఆదేశించారు. ఈ విషయంలో అధికారులైనా, కాంట్రాక్టర్లయినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

ఇవీ కొన్ని కారణాలు

అత్యంత ప్రాధాన్యత గల ఈ అంశంపై అధికార యంత్రాంగంలో చిత్తశుద్ధి లోపం, వారిపై వివిధ రాజకీయ పక్షాల ఒత్తడి, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, కొన్ని చోట్ల భూసేకరణను స్థానిక రాజకీయ నాయకులు ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లాంటి అంశాలను కొందరు ఎమ్మెల్యేలు ఇటీవల సీఎం దృష్టికి తీసుకువెళ్ళారు. ఉద్దేశపూర్వక రాజకీయ జోక్యాన్ని అరికట్టి కొన్నేళ్ళుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చాలని నిర్ణయించారు.

అధికారిక సమాచారం మేరకు డబుల్ బెడ్‌రూమ్ పథకానికి ఇప్పటి వరకు ప్రభుత్వం సుమారు రూ.850 కోట్లు ఖర్చుచేసింది. ఇటీవల ఆయా జిల్లాల నుంచి, స్థానిక ఎమ్మెల్యేల నుంచి అందిన ప్రతిపాదనల మేరకు ముఖ్యమంత్రి లక్ష్యానికి మించి మరో 6,436 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళను కొత్తగా మంజూరు చేశారు. వీటిని కూడా ఈ ఏడాది నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు ప్రారంభించారు. మొదటి దశ పాలనలో తలపెట్టిన రెండు లక్షల ఇళ్ళ నిర్మాణాన్ని పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ దిశగా అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు.

నిధులకు ఢోకా లేదు

రెండో విడతగా మండల కేంద్రాల్లోనూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళను నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లా కలెక్టర్లు స్థలాల సేకరణపై దృష్టి కేంద్రీకరించారు. ఒకవైపు కొనసాగుతున్న నిర్మాణాలు, మరోవైపు స్థలాల సేకరణ, ఈ క్రమంలో తలెత్తే సమస్యల పరిష్కారంపై పర్యవేక్షణ బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలకే అప్పగించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాల తర్వాత ప్రతిష్టాత్మక పథకమైన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణంపై ఆయన ప్రత్యేక శ్రద్ధపెట్టి ఈ పథకాన్ని కూడా దేశానికి రోల్‌మోడల్‌గా చేయాలన్న లక్ష్యంతో ముందడుగు వేస్తున్నారు. నేరుగా పేద వర్గాల జీవన ప్రమాణాలతో ముడి పెట్టుకుని ఉన్న ఈ పథకాన్ని లక్ష్యంలోపు పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగిస్తే బంగారు తెలంగాణ నిర్మాణంలో కొంతమేరకు సఫలీకృతమైనట్టేనని ఆయన భావిస్తున్నారు. అందుకోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు వెనకాడకూడదని అధికార యంత్రాంగానికి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు.

10 జిల్లాల్లో మొదలే కాలేదు

డబుల్ బెడ్‌రూమ్ పథకం అమలులో పది జిల్లాలు దూసుకుపోతున్నాయి. హైదరాబాద్ నగరంతో పాటు సిద్దిపేట, కరీంనగర్, కామారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్, సిరిసిల్ల, మేడ్చల్ కొత్తగూడెం, వరంగల్ అర్బన్ జిల్లాలు ఈ పథకం ఇళ్ళ నిర్మాణంలో పురోగతి సాధిస్తున్నాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణంలో 11 జిల్లాల్లో పురోగతి పాక్షికంగా కనిపిస్తోంది. మహబూబ్‌నగర్, మెదక్, మహబూబాబాద్, సంగారెడ్డి, జనగామ, భూపాలపల్లి, సూర్యాపేట, పెద్దపల్లి, యాదాద్రి, ఆదిలాబాద్, వరంగల్ అర్బన్ జిల్లాల్లో ఆశించిన మేరకు పథకం అమలు కావడం లేదు. డబుల్ బెడ్‌రూమ్ పథకం అమలులో పది జిల్లాలు పూర్తిగా వెనుకబడి ఉన్నాయి. నాగర్‌కర్నూల్, జగిత్యాల, వనపర్తి, నిర్మల్, నల్గొండ, మంచిర్యాల, రంగారెడ్డి, వికారాబాద్, కొమురంభీం, గద్వాల జిల్లాల్లో ఈ పథకం ఇంకా పునాదులకు కూడా నోచుకోలేదు.

రాజకీయ అడ్డంకులు

రాజకీయ మనుగడ కోసం ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు పేద వర్గాలకు ప్రత్యక్ష్యంగా లబ్ధి చేకూర్చే ఇలాంటి పథకాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గత ఏడాది కాలంగా కొన్ని జిల్లాల్లో యుద్ధప్రాతిపదికన ముందుకు సాగిన రెండు పడకల ఇళ్ళ నిర్మాణ పనులు గత ఏడాదిన్నర కాలంగా మందకొడిగా సాగుతున్నాయి. నియోజకవర్గ కేంద్రాల్లో అధికార, ప్రతిపక్ష నాయకులు, ఆయా పార్టీల కార్యకర్తల మధ్య నెలకొంటున్న ప్రతికూల పరిస్థితులు ప్రభుత్వ లక్ష్యాలను దెబ్బతీస్తున్నాయి. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి త్వరలోనే డబుల్ బెడ్‌రూం పథకాన్ని పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయబోతోంది.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

వాస్తవికతతో కాకిబొడ్డు

డాక్టర్ వాడ్రేవు వరలక్ష్మీ దేవి అధ్యక్షతన ''కాకిబొడ్డు'' ఆవిష్కరణ ఇటీవలనే జరిగింది. వేదిక రంగరాయ మెడికల్ కాలేజి, కాకినాడ, ప్రముఖ రచయితలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి ఈ కథల పుస్తకానికి ముందుమాట రాయడమే కాకుండా అద్భుతమయిన కథల గురించిన ప్రసంగాన్ని వినిపించారు. మధురాంతకం నరేంద్ర ప్రముఖ రచయిత కె.ఎన్.వై. పతంజలితో పోల్చారు. వాసిరెడ్డి నవీన్ ''ఈ కథల సంపుటిలో 5 కథలను ఉత్తమ కథలుగా ఎన్నిక చేయడం జరిగింది'' అని చెప్పారు. అద్దేపల్లి దీపక్ మాట్లాడుతూ గతంలో రాజుల వేట కథలు రాసిన దాట్ల నారాయణమూర్తి రాజు, పూసపాటి కృష్ణంరాజు, ''దివాణం చేరీవేట'' కథలను ఉటంకిస్తూ, తన ప్రసంగాన్ని కొనసాగించారు. దాట్ల దేవదానం రాజు ''ఈ కథలు చదివిన తరువాత తనపై ఇంకా బాధ్యత పెరిగింది'' అని చెప్పారు.

చిరంజీవి వర్మ రాసిన ఈ పన్నెండు కథలు రాజుల జీవితాలను కాసి వడబోసి రాసినవి. ఈ కథారచయిత బాల్యం నుండి తన ప్రాంతాలలోని వాస్తవికతను తన కళ్లతో చూస్తూ హృదయంతో బంధించి కథలను దృశ్యంతో మనముందు ఆవిష్కరించాడు.

''కాకిబొడ్డు'' కథలో కొండూరి రామరాజు లోగిలి ఆయన ఇంట్లో ఎప్పుడూ బొమ్మిడాయిల పులుసు, కొర్రమేను వేపుడు, నాటుకోడి పలావ్ ఎంతో బావుంటాయి. ''అసలు రాజుల ఇళ్లలో కూరల రుచి జమ్మ జివ్వున లాగుద్ది. ఈ రాజులతో ఎలా అయినా పేచీయండి. నచ్చితే పెట్టి చంపేస్తారు. నచ్చకపోతే కొట్టి చంపేస్తారు. రాజుల వంట కడుపు మంట'' అని ఎంత ఛలోక్తిగా రాసాడు!!



అద్భుతమైన కథా సంవిధానం నాకు నచ్చిన మరో కథ 'పులి కాల్చిన తుపాకి'. నాకు ఈ కథ చదువుతున్నప్పుడు జిమ్ కార్బెట్ నవల ''ది జంగిల్'' గుర్తుకొచ్చింది. ఈ కథ రాయాలంటే అటవీనేపథ్యం పూర్తిగా తెలిసియుండాలి. అక్కడ జంతువుల గురించి సమగ్రంగా తెలిసుంటేనే రాయగలుగుతాము. పులిని చంపాలంటే వేటగాడికి పులిభాష తెలియాలంటాడు. అడవిలో పులి అడుగుజాడలు పసికట్టాలి. చిట్టిరాజు పాత్ర ద్వారా రాజుల శౌర్యాన్ని దర్పాన్ని ఎంతో ధీరోదాత్తంగా చెప్పాడు. ''నేను పులిని చంపిన తరువాత ఈ తెల్లోళ్లతో కరచాలనం చేయకూడదు' అంటాడు. ఈ సాహసికుని కరస్పర్శను స్పృశించలేకపోతున్నామే అనే బ్రిటిష్‌వారు మదన పడటాన్ని మనముందు ఉంచాడు.

''భ్రమ'' అనే కథలో నాటకాల వాళ్ల జీవనశైలిని, పల్లెటూళ్లలో ఆరోజుల్లో ఎంతటి ఆదరణ ఉండేదో తెలియజెప్పిన కథ. ఆఖరికి తబలా కొట్టేవాళ్లు, హార్మోనియం వాయించేవాళ్ల గురించి కూడా తెలియజేసి మనల్ని ఆ కాలానికి తీసుకెళ్లిపోతాడు రచయిత. ఉదాహరణకు తుని దాట్లవారి కోట, రామచంద్రాపురం రాజబాబుగారి కోట, ఇంకా ఎన్నో రాజుల మండువా లోగిళ్లను, అక్కడి ఆచార వ్యవహారాలను, ఆనాటి రాచరికపు ఘోషాపద్ధతులను ఎంతో చక్కగా విపులీకరించారు. మిగతా కథల్లో ఒక్క రాజుల గురించి మాత్రమే కాదు. ఆనాటి కుల వృత్తుల చేసేవారి పట్ల చూపే ఆదరణను, ఆప్యాయతను పాఠకులకు విశదీకరించాడు. క్షత్రియ కుటుంబాలలోని సంబోధనలు బహుచిత్రంగా ఉంటాయి. భావోజీ, అమ్మయ్యా, చివరికి భార్యను కూడా ఏమండీ అని పిలిచే సంస్కృతి ఆనాటిదని మనకి తేటతెల్లం చేసాడు.

''శిక్ష'' అనే కథలో ఆనాటి రేడియో వార్తలను మనకు జ్ఞాపకం చేశాడు. గతంలో మనం ఎన్నో కథలు చదివుండొచ్చు. వాక్యాన్ని ఎక్కడ ముగించాలో ఆయనకు బాగా తెలుసు. ఎప్పుడో తన చిన్నతనంలో విన్న సంభాషణలను కూడా విన్నది విన్నట్లుగా చూసింది చూసినట్లుగా రసరమ్య రీతిలో వర్ణించాడు.

ఇంకా 'అహం బ్రహ్మోస్మి' కథలో మనిషిలో ఉండాల్సినవి, వదిలేయాల్సినవి తేల్చి చెప్పాడు. రాజుల మర్యాదల గురించి రాసిన మరో మంచి కథ ''మురాద్దప్పేరు'' అన్న ఆనాటి మాండలీకాన్ని మళ్లీ మనకు నెమరువేశాడు. మొత్తానికి మిగతా కథలన్నీ వేటికవే విలక్షణమైనవి. నేను చిరంజీవి వర్మను సముద్రంలోకి వేటకు వెళ్లిన జాలరితో పోలుస్తాను. ఎందుకంటే అతనెప్పుడూ నిరాశపడడు. వల నిండా చేపలు పడిన తరువాత వలను ఒడ్డుకు చేర్చడం చాలా కష్టం. అలాగే ఈ పన్నెండు కథానికలను గుదిగుచ్చడం మరింత కష్టం. ఇది ఒక సామాజిక వర్గం గురించి రాసిన కథలు మాత్రమే కాదు, ఆనాటి సంప్రదాయాల్ని, సంస్కృతిని, మానవ సంబంధాల్ని మళ్లీ మనకు జ్ఞాపకం చేశాడు. ఇంతటి గొప్ప కథా సంపుటిని అందించిన చిరంజీవ వర్మ అనే వత్సవాయి చిట్టి వెంకటపతిరాజు బహుధా అభినందనీయుడు.

ప్రతుల కొరకు ఎమెస్కో, విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ, నవచేతన, అన్ని పుస్తక విక్రయ కేంద్రాల్లో లభ్యమవుతాయి.

- పొత్తూరి సీతారామరాజు
9948849607

నా ఊరు నాడు-నేడు!

ఒకనాడు...
నా ఊరు ఒక నైమిశారణ్యం
నా ఊరు ఒక జీవకారుణ్యం
నా ఊరు ఓ జనారణ్యం
నా ఊరు గమ్యాల అగమ్యం
ముఖాల్లో మెరుపులే తప్ప
కరెంటు వెలుగుల్లేని ఊరు!
బురద నిండిన నేలలే తప్ప
రోడ్డంటూ కనిపించని ఊరు!
దాహార్తుల అరుపులు తప్ప
నీటి ఊటలకు నోచని ఊరు!
నిస్సత్తువల మూలుగులే తప్ప
దవాఖానాల దాఖల్లాలేని ఊరు!
ఐతేనేం...నా ఊరు నవనవోన్మేషం
నా ఊరు ఉప్పొంగే జలపాతం
నా ఊరు ఉరికొచ్చే ఉత్సాహం
నా ఊరి నిండా జనం జనం
నా ఊరికదే బలం బలం
ఆ గాలి నిండా జనాశ్వాసం
ఆ ధూళికణాల్లో జనపదం
జనావేశమే సూర్యోదయం
జనం కేరింతలే సుప్రభాతం
లేనివన్నీ ఉన్నట్టే అనుకుని
ఆస్వాదించే ఘనజనగణం!

మరి ఈనాడు...
నా ఊరు ఒక కీకారణ్యం
నా ఊరు వెతల నిలయం
నా ఊరు విధివంచిత మన్యం
నా ఊరు నిశీధిలో నిశ్శబ్దం!
ఊరు ఊరంతా వెలుగులే
ఇంటింటా కరెంటు జిలుగులే
అద్దాల్లా...మెరిసే తారురోడ్లే
నా ఊరికి అవి వడ్డాణాలే!



భగీరథుడి వైభోగానికి
నా ఊరే ఓ నిదర్శనమే
నీటి ఊటల్లో నిత్యస్నానాలే
నా ఊరు ఒక ఆరోగ్యనిలయమే
సకల సౌభాగ్యాల సుమమే
లేనిదల్లా మా ఊర్లో జనమే
లేనిదల్లా ఆ జన గళమే!
పొట్ట చేతపట్టుకుని పిల్లలు
పట్నాలకు ఎగిరెళ్లిపోయారు
వాళ్లే మా బతుకులంటూ
పెద్దవాళ్లు ఊరొదిలి వెళ్లారు!
అందుకే అన్నీ ఉన్నా
నా ఊరిప్పుడు అనాథ!
ఉండాల్సినవారు లేక
నా ఊరిప్పుడు ఒంటరి!
పేగుబంధం కోసం
అర్రులు చాస్తున్న ఓ
ఎముకల గూడు నా ఊరు!!

- వయ్యస్సారెస్
9000013367

సాహితీ శిఖరాల మోనార్క్...ఇనాక్

గుర్రం జాషువ ప్రభావంతో ప్రారంభదశలో ఇనాక్ పద్యాలు రాశారు. పద్యశైలిలో జాషువ ముద్ర కనబడటంతో అందుకు భిన్నంగా తనదైన స్వీయముద్ర కోసం ఆయన తహతహలాడారు. తనపై పడుతున్న జాషువ, కరుణశ్రీల ప్రభావాలను దగ్ధం చేసుకోవాలన్న బలమైన తలంపుతో పద్యానికి దూరంగా జరిగి వచనానికి దగ్గరయ్యారు.

చాలా మంది కవులు, రచయితలు స్థిరపడిన మార్గంలోనే పరమలౌక్యాన్ని ప్రదర్శిస్తూ ముందుకు సాగిపోతారు. కొంతమంది రచయితలు చుట్టూ ఆవరించిన దుర్గమారణ్యాన్ని ఛేదించి, గాండ్రించే పెద్ద పులులను ధిక్కరించి, బుసలుకొట్టే కాల నాగులను వెక్కిరించి అసమాన సంకల్పబలంతో మహోన్నత సృజనోత్తేజంతో మూసుకుపోయిన దారుల్లో గుండా దూసుకువస్తారు. దారికడ్డంగా పడి ఉన్న రాళ్లూ రప్పలను, ముళ్లతుప్పలను తొలగించి, మిట్టపల్లాల్ని చదునుచేసి, కొత్త బాట వేస్తారు. కాలానుగుణ మార్పులను గమనించి, పరిసరాలను పరిశీలించి బాటను విస్తరిస్తారు. రహదారిని, గమనాన్ని, గమ్యాన్ని నవనవోన్మేషంగా నిర్దేశించి జాతిని ప్రభావితం చేస్తారు. ఇలాంటి రచయితలే యుగకర్తలుగా, మార్గదర్శకులుగా నీరాజనాలందుకుంటారు. ఈవిధమైన సాహిత్య మార్గదర్శి ఆచార్య కొలకలూరి ఇనాక్. **''చీకటిని ఉరి తీయాలని/ఉదయపు వెలుతురులో కాలం/ కలం అద్ది/సమాజం మీద సంతకం చేశాను''** అని ప్రకటించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ ఈ పవిత్రమైన ఆశయానికి కట్టుబడి తన రచనలతో వర్తమాన సాహిత్యాన్ని తేజోవంతం చేశాడు. ఒక మహావృక్షం శాఖోపశాఖలుగా విస్తరించి మధుర ఫలాలనందించినట్లుగా ఆచార్య ఇనాక్ విభిన్న ప్రక్రియల్లో రచనలు చేసి ఆధునిక సాహిత్యాన్ని సంపద్వంతం చేశాడు. కథ, నవల, నాటకం, కవిత్వం, విమర్శ, పరిశోధన, అనువాదం లాంటి ప్రక్రియల్లో 96 గ్రంథాలు వెలువరించిన ఇనాక్ ప్రతి ప్రక్రియలోను ఒక ప్రామాణిక రచనను అందించటం మాత్రం ఎంతో విశేషంగా భావించవచ్చు. ఊరబావి (కథల సంపుటి) అనంత జీవనం (నవల) మునివాహనుడు (నాటకం) ఆది ఆంధ్రుడు (కవిత్వం) తెలుగు వ్యాస పరిణామం (పరిశోధన) వాయిస్ ఆఫ్ సైలెన్స్ (అనువాదం) విమర్శిని (విమర్శ) ఇత్యాది గ్రంథాలన్నీ క్లాసిక్స్‌గా పాఠకులతో పాటు విమర్శకుల ప్రశంస అందుకోవడం తెలుగు సాహిత్యంలో అరుదైన విషయం. బహుముఖీన సాహిత్య కర్తృత్వం, అపురూపమైన స్వతంత్ర వ్యక్తిత్వం, ప్రగాఢమైన, సామాజిక దృక్పథం, పదునైన కళాతత్వ దృష్టి లాంటి విశిష్ట లక్షణాలు సంగమించిన ఇనాక్ వంటి మహారచయిత భారతీయ సాహిత్యంలో వ్యంగ్యం. ఎనభై సంవత్సరాల వయస్సు కలిగిన ఇనాక్ అనే సాహిత్య విజ్ఞాన సర్వస్వం పుటలను తిరగవేస్తే జీవితమంత సాహిత్య చైతన్యం వెల్లివిరుస్తుంది. అగాధాలను అధిగమించి శిఖరాలనధిరోహించే మహత్తర శక్తి సమకూరుతుంది.

గుంటూరు జిల్లా వేజెండ్లలో మాదిగ కుటుంబంలో జన్మించిన కొలకలూరి ఇనాక్ తొమ్మిది సంవత్సరాలకే తండ్రి రామయ్య మరణిస్తే తల్లి విశ్రాంతమ్మ ఆలనా పాలనలో బతుకు బడిలో ఓనమాలు దిద్దుకున్నాడు. **''అమ్మ నన్ను దున్నింది. సాగు చేసింది. పంట పెట్టింది. పంట చూచి పరవశించింది. ఆకలిని మరిచే నిద్రను నేర్పింది. ఆమెకు కోపం వస్తే అగ్నిపర్వతం, ఆదరిస్తే దయాసముద్రం. నన్ను సమస్యల కొండల మీద చెడుగుడు ఆడింది. పరిష్కారాల సముద్రాలలో ఈదించి గజ ఈతగాణ్ణి చేసింది!''** అంటూ ఇనాక్, తల్లి తనను ఎంతగా ప్రభావితం చేసిందో విజేతగా నిలిచే జీవన విద్యా నైపుణ్యాన్ని ఏవిధంగా నేర్పిందో కవితాత్మకంగా తెలియజేశాడు. అనంతమైన పేదరికాన్ని, దుర్భరమైన అంటరానితనాన్ని త్రోసిరాజని ఇనాక్ జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలనందు తీరు, ఆయన జీవన పరిణామ క్రమం అత్యంత స్ఫూర్తిదాయకం. స్ఫూర్తిదాయకమైన జీవితా నుభవాల నుండి తన సాహిత్య వస్తురూపాలను ఇనాక్ పుటం పెట్టుకున్నాడు. బి.ఎ.ఆనర్స్ విద్యార్థిగా ఉన్నప్పుడే నూనుగు మీసాల నూత్నయవ్వనంలో 'దృష్టి' నాటిక రాసి ఇనాక్ ఆకాశవాణి జాతీయ నాటిక పోటీలో ద్వితీయ బహుమతి అందుకొని సవర్ణ రచ యితలను ఆశ్చర్యపరిచారు. దృష్టి నాటక రచనతో ప్రారంభమైన ఇనాక్ సృజన 'అమరావతి'(2018) అనే కవితా సంపుటి వరకూ అప్రతిహతంగా సాగు తూనే ఉంది. 9నాటకాలు, 10 నవలలు, 9 కథా సంపుటాలు, కులం ధనం, షరామామూలే, త్రిదైవ పతాకం, చెప్పులు, కన్నీటి గొంతు, ఆశాజ్యోతి లాంటి కవితా సంపుటాలు, సాహిత్య దర్శిని, సమీక్షణం, శూద్రకవి శుభమూర్తి, వసు చరిత్ర వైశిష్ట్యం, ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం లాంటి ఎన్నో గ్రంథా లను వెలువరించారు. ఏభయ్యో దశకం ఉత్తరార్థంలో సాహిత్యంలోకి అడుగుపెట్టిన ఇనాక్ ఆనాటి కాలప్రభావంతో రష్యా వైపు చూడకుండా మాదిగ పల్లె, మాలపల్లె వైపు దృష్టిసారించారు. అభ్యు దయ, విప్లవ సాహిత్యాల వైపు నడవకుండా ఆయా ఉద్యమాల మౌలిక స్ఫూర్తిని అర్థం చేసుకొని తన జాతి జనుల విముక్తి కేంద్రంగా ఇనాక్ రచనలు చేశారు. ''పీడితుల నుకున్న వాళ్ల పక్షాన నా పోరాటం. అదే నా సాహిత్య రూపం. వాళ్లకోసమే నేను రాస్తున్నాను. వాళ్లు విముక్తులైతే చాలు. దళితులు, స్త్రీలు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వాళ్లు నా పరిధి వాళ్లు'' అంటూ తన సాహిత్య కవరేజ్ ఏరియాను ఎంతో ఉదాత్తంగా తెలియజేసిన ఇనాక్ అట్టడుగు వర్గ ప్రజల జీవితాలను అత్యున్నత సాహిత్య విలువలతో చిత్రించారు. ''సమస్యను తెలిపి ప్రమాదం హెచ్చరించి, పీడితుల జీవన పోరాటం చిత్రించి, పీడకుల్ని సమస్య, పరి ష్కారానికి సన్నద్ధం చేసి అందరూ సమానంగా సహజీవనం చేసే స్థితి తేవడానికి తోడ్పడే సాహిత్యం సృష్టించడం నా లక్ష్యం'' అని చాటి చెప్పి ఈ లక్ష్యసాధన కోసం ఇనాక్ ఆరు దశాబ్దాల సాహిత్యాన్ని అంకితం చేశారు. కంచికచర్ల కోటేశు సంఘటన నుండి వేముల రోహిత్ వరకు జరిగిన సంఘటనలను, జతిగతులను, విప్లవ, స్త్రీవాద, దళితవాద, ముస్లిమ్‌వాద, మాదిగ దండోరా, తెలంగాణ వంటి సామాజిక, అస్తిత్వ ఉద్యమాలు అందించిన భావజాలానికి ఇనాక్ సాహిత్యం నిలువుటద్దంలా ఉంటుంది. అస్తిత్వ ఉద్యమాలకు ఒక తాత్విక ఆలంబనగా ఇనాక్ సాహిత్యం దోహదపడింది. రవిగాంచని, ఏ కవి గాంచని జీవితపు సన్నని సందుల్లో గుండా తెలుగు కథను కదం తొక్కించారు. కథా శిల్పాన్ని కొత్తపుంతలు తొక్కించారు. ''ఇనాక్ కథలు కాలానికి ఎదురొడ్డి నిలిచే మహేతి హాసాలు'' అంటూ కారా మాస్టారు ఇనాక్ కథల ఔన్నత్యాన్ని కీర్తించారు. జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత రావూరి భరద్వాజ కూడా ''ఇనాక్ కథలు నన్ను తీవ్రంగా ప్రభా వితం చేశాయని కితాబిచ్చారు. తలలేనోడు, ఆకలి , ఊరబావి, పిండీకృతశాటి, గంగాస్నానం, తాకట్టు, హారతి లాంటి కథలు భారతీయ సాహిత్యంలో ప్రముఖంగా పేర్కొనదగినవి. అస్పృశ్యగంగ, కట్టడి, కాకి, కొలువులు మొదలగు కథాసంపుటులు విశేషమైన ప్రజాదరణ పొందాయి. రాయలసీమ, నేపథ్యంలో రాసిన సర్కారు గడ్డి, అనంత జీవనం లాంటి నవలలు విలక్షణమైన కథావస్తువుతో వినూతమైన శిల్పవైవిధ్యంతో కూడి వ్యవస్థలోని డొల్లతనాన్ని తెలియజేస్తాయి. ఆచార్య ఇనాక్ తెలుగు సాహిత్య విమర్శలో మిగిలిపోయిన ఎన్నో ఖాళీలను సమర్థవంతంగా పూరించారు. శూద్రుని కావ్యం కుక్కతాకిన పాలు వంటిదని, కాకి ముట్టిన పాయసం లాంటిదని అప్పకవి లాంటి వాళ్లు నోరు పారేసుకుని కుహనా తీర్పులు చెబితే శూద్రకవి శుభమూర్తి రచించిన కావ్యం కాబట్టే వసుచరిత్ర విశిష్టకావ్యంలో వర్ధిల్లిందని, ఆ కావ్య రమణీయతకు శూద్రత్వమే అసలు కారణమని ఇనాక్ తన విమర్శ ద్వారా నిరూపించారు. శ్లేష వైభవంలో, నాటక ధర్మంలో వర్ణనా నైపుణ్యంలో వస్తుచరిత్ర మహాప్రబంధమని ఆయన ''శూద్ర కవి శుభమూర్తి వసు చరిత్ర వైశిష్ట్యం'' అనే విమర్శ గ్రంథం చాటి చెప్పారు. తెలుగు విమర్శకులు, జానపద సాహిత్య పరిశోధకులు విస్మరించిన పార్శ్వాలను ''జానపదుల సాహిత్యవిమర్శ'' అనే రచన ద్వారా ఇనాక్ సూక్ష్మంగా విశ్లేషించారు. పాలకస్థాన సాహిత్యంతో పాటు ప్రజాస్థాన సాహిత్యం కూడా ప్రత్యామ్నాయంగా వికసిస్తూనే ఉంటుందని ఇందు లోని ప్రత్యేక లక్షణాలను పరిశీలించవలసిన అవసరముందని ఆయన సూచించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి ఎంపికైన విమర్శనా గ్రంథంలో ఇనాక్ అనేక మౌలికమైన, నిర్మాణాత్మకమైన ప్రతిపాదనలు చేశారు. చిన్నయసూరి బాల వ్యాకరణం, తెలుగు కథ, తెలుగు నవల, ఆవిర్భావ వికాసాల గురించి కొత్త కోణాలను ఆవిష్కరించారు. ఇనాక్ సాహిత్యం రాజ్యాంగ నైతికతకు దర్పణంగా నిలుస్తుంది. ఆయన సృజన మెరుగైన సమాజ నిర్మాణం కోసం రాసిన మేనిఫెస్టోలాగా కన బడుతుంది. ఆయన జ్ఞానపీఠమంత సాహితీవేత్త. ఇనాక్ ఒక సాహిత్య శిఖరం.



(రేపు ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుని ఇనాక్ అందుకుంటున్న సందర్భంగా)

- కోయి కోటేశ్వరరావు
9440480274

కథల పోటీ-2019

అర్చన ఫైన్ ఆర్ట్స్ అకాడమీ (హ్యూస్టన్) శ్రీ శారద సత్యనారాయణ మెమోరియల్ ఛారిటబుల్ సొసైటి సంయుక్త ఆధ్వర్యంలో కథల పోటీ -2019ని నిర్వహిస్తున్నది. కథలు నాలుగైదు అరఠావులు మించకుండా ఉండాలి. యునికోడ్‌లో టైప్ చేసిన స్క్రిప్టులు (వర్డ్‌ఫైల్) మాత్రమే పంపాలి. హామీ పత్రం తప్పనిసరి. మొదటి బహుమతులుగా రూ.2000/- 5 కథలకు, రెండవ బహుమతులుగా రూ.1000/- చొప్పున పది కథలకు అందించబడతాయి. బహుమతి పొందిన కథలు ప్రముఖ వెబ్ సైట్ పత్రికలో ప్రచురించబడతాయి. కథలు చేరాల్సిన చివరితేదీ 31 మార్చి 2019. కథలు పంపాల్సిన మెయిల్ ఐడి. rachanalu2019@gmail.com.

-కోసూరి ఉమాభారతి
అర్చన ఫైన్ ఆర్ట్స్ అకాడమీ (హ్యూస్టన్) యు.ఎస్.ఎ.

జాతీయస్థాయి ఉగాది కవితల పోటీ

సాహితీ కిరణం ఆధ్వర్యంలో యం.బాలనాగయ్య స్మారక జాతీయ స్థాయి ఉగాది కవితల పోటీకి 20 లైన్లకు తక్కువ కాకుండా 30 లైన్లు మించని కవితలను ఆహ్వానిస్తున్నాము. విజేతలు 5గురికి ఒక్కొక్కరికి రూ.1000/-చొప్పున బహుమతులుంటాయి. కవితలు చేరవలసిన చివరితేదీ 28-2-2019, చిరునామా- ఇం.నెం. 11-13-154, అలకాపురి, రోడ్‌నెం. 3, హైదరాబాద్-500102, సెల్.నెం. 9490233148.

- పొత్తూరి సుబ్బారావు-ఎడిటర్
సాహితీ కిరణం

జనరంజక కవి ప్రతిభా పురస్కార ఫలితాలు

రావిరంగారావు సాహిత్య పీఠం నిర్వహించిన జనరంజక కవి ప్రతిభా పురస్కారాల పోటీలో సిరికి స్వామినాయుడు 'మట్టిరంగు బొమ్మలు' (వచన కవితలు) చిత్తలూరి సత్యనారాయణ 'నల్లచామంతి' (వచనకవితలు) భైరి ఇందిర 'సవ్వడి' (గజల్లు) బెలగాం భీమేశ్వరరావు 'మా యింటి దేవతలు' (బాలగేయాలు) ఎంపిక చేయబడ్డాయి.

- నర్రా ప్రభావతి, కన్వీనర్, రావిరంగారావు సాహిత్యపీఠం

జగన్నాథశర్మకు జైనీ జాతీయ సాహితీ పురస్కారం

సాహిత్య వార్తలు

జగన్నాథ శర్మ ఆయల సోమయాజులకు ''లక్ష్మీనారాయణ జైనీ జాతీయ సాహితీ పురస్కారం'' లభించింది. ఆయన రాసిన మొదటి పేజీ కథలను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. రేపు సాయంత్రం ఆరుగంటలకు రవీంద్రభారతి సమావేశమందిరంలో జరిగే ప్రత్యేక సభలో లక్ష రూపాయల నగదుతో పురస్కారం అందజేస్తారు. ఈకార్యక్రమంలో నందిని సిధారెడ్డి, సుధామ, శ్రీరాంతో పాటు అనేకమంది ప్రముఖులు పాల్గొంటారు.

- డా॥ ప్రభాకర్ జైనీ, చైర్మన్
జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్

గాంధీ సందేశ పథం ఆవిష్కరణ

యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా ప్రచురించిన 'గాంధీ సందేశ పథం' కవితా గ్రంథం ఆవిష్కరణ 30న తెలంగాణ సారస్వత పరిషత్తులో సాయంత్రం ఆరుగంటలకు జరుగుతుంది. డా॥ కె.వి.రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ సభకు తెలంగాణా భాషా సంస్కృతి శాఖ, సంచాలకులు మామిడి హరికృష్ణ అధ్యక్షత వహిస్తారు. 'గాంధీ తత్త్వం- నేటి సమాజం' అంశంపై దేవులపల్లి ప్రభాకరరావు ప్రసంగిస్తారు. ఆత్మీయ అతిథులుగా జి.ఎస్.వరదాచారి, జివివి ఎస్‌డివిఎన్ ప్రసాద్, సుధా తదితరులు పాల్గొంటారు.

- డా॥ ఆచార్య ఫణీంద్ర. అధ్యక్షులు, యువభారతి
9959882963

లైఫ్ ఈజ్ ఏ మూమెంటు ఆవిష్కరణ

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, భాషాభివృద్ధి పీఠం అధ్వర్యంలో ప్రొఫెసర్ ఎస్వీ రచించిన జీవితం ఒక ఉద్యమం, స్వాతి శ్రీపాద ఆంగ్ల అనువాదం 'లైఫ్ ఈజ్ ఏ మూమెంటు' ఆవిష్కరణ సభ 29వ తేది మధ్యాహ్నం 3గం.లకు సమావేశ మందిరం, పొ.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్ నందు ప్రొ.పి. లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరుగుతుంది. ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్తగా డా॥నందిని సిధారెడ్డి, గౌరవ అతిథిగా దేశపతి శ్రీనివాస్, ఆత్మీయ అతిథులుగా ప్రొ॥అలేఖ్య పుంజాల, పత్తిపాక మోహన్, చింతపట్ల సుదర్శన్‌లు పాల్గొంటారు.

- ప్రొ॥ రెడ్డి శ్యామల, ప్రొ.జి.ఎస్. గాబ్రియల్ , భాషాభివృద్ధి పీఠం

జీవన తత్వఝురి-వల్లరి

గజల్ అనేది ఉర్దూ కవితా సాహిత్యంలో అత్యంత ప్రముఖమైన సాహితీ ప్రక్రియ మరియు కవితా రూపం. ఫారసీ ఉర్దూలలో గజళ్లలో విప్రభల శృంగారానికి ప్రాధాన్యత నిచ్చారు. శృంగార రసాన్ని వారు ' హాకీకి ' అనీ 'మజాజి ' అని రెండు తరగతులుగా విభజించారు. మజాజి అంటే సామాన్య లౌకిక ప్రేయసి ప్రియుల ప్రేమ, హాకీకి అంటే పారాలౌకిక ప్రేమ అని అంతర్జాతీయ ఆంగ్ల కవి, గజల్ రచయిత శ్రీ రోచిస్మాన్ తెలిపారు. గజల్ అంటే ప్రియురాలితో సల్లాపం అంటారు స్వర్గీయ సినారే ...! గజల్ అంతా శృంగారమయం, విరహవేదన అనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. ఉర్దూ, ఫారసీ గజళ్ళను పరిశీలిస్తే నిజమనిపిస్తుంది కూడా. ''సాహిత్యం సమాజానికి ప్రతిబింబం'' సమసమాజ చైతన్య కళిక కవి. లయబద్దము, ఛందోబద్ధము అయిన గజల్‌ని భౌతిక పరమైన ప్రేమకే పరిమితం చేయకుండా అధి భౌతిక, సామాజిక స్పృహతో కూడిన కథా వస్తువుల మహత్ ప్రస్తానం కళారత్న కృష్ణ బిక్కి గారి వల్లరి. 83 గజళ్ళ సమాహారం. ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ మాధవ గారి కుంచె నుంచి జాలువారిన అందమైన ముఖ చిత్రం , ప్రతి గజల్ కి ముందు సందర్భోచితంగా వేసిన బొమ్మలు అందంగా ఉన్నాయి. పుస్తకానికి వన్నె తెచ్చాయి. సాహితీ సాంస్కృతిక సంస్థ '' శంకరం వేదిక '' స్థాపకులు శ్రీ యలవర్తి రాజేంద్ర ప్రసాద్ గారు, శ్రీమతి ధనలక్ష్మి గారు పుస్తక ప్రచురణ కర్తలు. వల్లరి వారికే అంకితమివ్వబడింది. వల్లరిలోని ఒక్కో గజల్ ఒక్కో గ్రంథంతో సమానం, హృదయాన్ని తట్టి లేపాయి , మేధస్సుకు పదును పెట్టాయి కొన్ని చర్నాకోల్ తో ఛళ్ళున చరుస్తాయి.

మాస్టారు ..కృష్ణబిక్కిగారు ఒక జ్ఞాన బాండాగారం, సాహితీ ఘని, ఆయన ఒక స్కూల్, ఎందరికో మార్గగామి."everything is miracle in my life" ?అంటారాయన.

మొదటిగజల్ 'ప్రపంచాన గొప్ప కవిత అమ్మే కదా ప్రవచించ లేని ప్రేమ చరిత అమ్మే కదా ! ' అని మొదలవుతది. తల్లి ఎడల, స్త్రీ ఎడల గల గౌరవ భావం ద్యోతకమవుతాయి. **''జీవులను సృష్టించిన దేవుడే శిలగా మారితే ...తల్లి దేవతై వచ్చెను ..నీదు భవిత అమ్మే కదా''** అన్నది లాండింగ్. మాతృమూర్తిని దేవతగా మలచిన వైనం మహోన్నతం. ఇంకా **''కూతురు అమ్మయితే బాల్యం తిరిగొస్తుంది, కళ్లెదుట బొమ్మైతే ప్రాణం తిరి గొస్తుంది''** అంటారు. **'' అర్ధరాత్రి అయినా నా కోసం ఎదురుచూసే ఆ కళ్ళతడి నా తల్లైతే....రాగం తిరిగొస్తుంది''** ఇక్కడ కూతురినే తల్లిగా మలచిన వైనం, ఈ ఆర్ద్రత ఎవరినైనా కదిలిస్తుంది. ఇండియన్ ఐడియలిజంకి ఆయువు పట్టు అయిన సత్యం శివమ్ సుందరం ..(సత్యం - ట్రూత్ ,శివమ్ goodness, సుందరం - బ్యూటీ) ఇది భారతీయ తత్వ ఝురి , ఈ మూడు మహోన్నత తత్వాలు వారు తమ వల్లరిలో చూపించారు.


''రససిద్ధుడైన కవికళ్లలో మెరిసిన కాంతి కదా కవితంటే, ఆ బుద్ధుని గుండెలో విరిసిన శాంతి కదా కవితంటే''

''వేదాలు శాస్త్రాలు ఉపనిషత్తులు చదివితేమి?/ అహంకారమ్ము గంనీవు జాలంటూ నీకులేదు

''చినుకులుగా కరిగితేమ్ మేఘాలు అలసిపోవు /చెమట చుక్కలు రాలితేమ్ దేహాలు అలసిపోవు''

''తొందరపడి ప్రేమించకు కళ్ళలోన తడి ఉండదు /అందరిలో రోదించకు గుండెలోన సడి ఉండదు''

''విషాదమే సౌందర్యం కదా కలతెందుకు నేస్తమా /వియోగమే మాధుర్యం కదా కవితెందుకు నేస్తమా ''



✣✣✣✣✣

ఇలాంటి ఎన్నో గజల్స్ ఫిలాసఫిని ఎస్టాబ్లిష్ చేస్తాయి. వల్లరిలో బిక్కీగారు వాడిన ప్రతీకలు వెలువరించిన భావుకత ఎంతో అమోఘమైనవి . ఇంకా **''అర్ధరాత్రి అయిన నా కోసం ఎదురు చూసే / ఆ కళ్ళ తడి నా తల్ల యితే రాగం తిరిగొస్తుంది''** అనే ఆర్ద్రత తనకు మాతృమూర్తిపై గల అవాజ్యమైన ప్రేమను కూతురినే తల్లిగా చూసే వైనం స్త్రీ మూర్తిపై గల గౌరవాన్ని తెలియజేస్తుంది.

''కనులు తడిసిన విరహ గీతం యెదను పువ్వైకోసేనా/నేను కట్టిన కలలమేడ కాలుతుంటే చూడలేను''

''ఆ పువ్వు అలా రాలి నీ పెదవిని చేరిం దిలే/ నీ నవ్వు ఎదను కోస్తుంటే భలే బాగుందిలే ''

''మోడును చిగురింప చేసే కాలం కదా ?చెలిమంటే/ కలత చెందే ప్రేమ గుండె తైలం కదా చెలిమంటే''

''ఎవరు నిన్ను ద్వేషించిన అసూయతో దూషించిన /దూరమైన వియోగరాగమే మందనుకో ''

''అందమైన ఆకాశం కావాలని అనుకోకు అందనిదేదైనా కోరు కోవాలని అనుకోకు''

✣✣✣✣✣

''పట్టుచీర కోరికే చిమ్మట కద మనసు కృష్ణా/చెమ్మలేని కంటివైపు చూడాలని అనుకోకు''

'' నన్ను ఒదిలిపోతేమి నీ జ్ఞాపకాలు నదినైపోతా/నా ఆకాశం నీవైతే నీ నీలిమను నేనౌతా''

''మాట్లాడేదేముంది మౌనమే మిగిలింది /కాట్లాడేదేముంది ధ్యానమే మిగిలింది''

✣✣✣✣✣

ఎంత అద్భుతమైన భావుకత! ఎంత గొప్పవైన ప్రతీకల ఆవిష్కరణ. జీవితానుభవాల సారం వల్లరి

రససిద్ధి, సామాజిక స్పృహ , తాత్వికత అంతా కలిపితే బిక్కి కృష్ణ కవిత్వం అవుతుంది. అనుక్షణం భావనల కందిరీగలు మెదడును తొలుస్తుండాలి. సమాజమే ఒక ఉపాధ్యాయు డవ్వాలి, ప్రతిది కథా వస్తువుగా మారగలగాలి, స్పందించే హృదయం ఉండాలి. అప్పుడు మనసు గెలుచుకునే కవి ఉద్భవిస్తాడు.

సర్వ మానవాళిని , సమస్త జీవరాశిని ఒకటిగా చూడగలిగే విశాల దృక్పథం ఏర్పడుతుంది. వల్లరి దీనికొక ఉదాహరణ. కవి వ్యక్తిత్వాన్ని , అతనిలోని సునిశి తమైన పరిశీలన పటిమను, మానవత్వపు సుగంధాలను పరిచయం చేసింది వల్లరి. బిక్కి కృష్ణ అద్భుతమైన రసరమ్య భావాలతో వల్లరి అంతా పల్లవించారు.

''ఆకాశమంత ప్రేమ ఆమె చిరునామా'' అని తన 'కాలం నది ఒడ్డున' లో చెప్పారు. ఇప్పుడు అన్ని హంగులతో ..ప్రకృతి రమణీయమైన లాలిత్యాన్ని, మానవ సంబంధాలను, వ్యక్తిత్వ వికాసాన్ని, ఆధ్యాత్మికతని, భౌతికతని సంపూర్ణమైన జీవన తత్వాన్ని తమ వల్లరిలో దృశ్యమానం చేశారు అందుకే ...కళారత్న కృష్ణ బిక్కి 'వల్లరి' సంపూర్ణ జీవనతత్వ ఝురి.


- రమాదేవి కులకర్ణి
8985613123

ఉద్యాన వర్సిటీ పనుల వేగం పెంచండి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉద్యాన వర్సిటీ నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా ములుగులోని యూనివర్సిటీ ప్రధాన కార్యాలయం, రాజేంద్రనగర్, మోజర్లలోని ఉద్యాన కళాశాలల్లో రహదారులు, విద్యార్థుల వసతి గృహాలు, తరగతి గదులు, పరిశోధన, ప్రయోగశాలలు, క్షేత్రాల నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మార్చి 31 నాటికి 100శాత పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాలు, పరిశోధనశాల్లో పరికరాలు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ సదస్సులు జరుగుతున్నందున అందుకు వీలుగా వర్సిటీ ఆడిటోరియాన్ని విశాలంగా, అన్ని వసతులతో నిర్మించాలని ఆదేశించారు. అంతకు ముందు అధికారుల బృందంతో కలిసి ములుగు యూనివర్సిటీ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణాన్ని పార్థసారథి సందర్శించారు.

రేపు కిసాన్ కాంగ్రెస్ దక్షిణాది రాష్ట్రాల సదస్సు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : భవిష్యత్ వ్యవసాయ విధానాలపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో మంగళ వారం కిసాన్ కాంగ్రెస్ దక్షిణాది రాష్ట్రాల సదస్సు హైదరాబాద్‌లో జరగనుంది. గాంధీభవన్ వేదికగా నిర్వహించనున్న ఈ సదస్సులో వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు అంశాలను చర్చించడంతో పాటు వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమంలో అనుసరించాల్సిన వ్యూహరచన రూపొందిస్తామని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం గాంధీభవన్‌లో కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డి కలిసి మీడియాతో మాట్లాడారు.. ఈ సదస్సులోఏఐసీసీ కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ నానా పటేల్‌తో పాటు కర్నాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ ప్రతినిధులు హాజరవుతారని వారు తెలిపారు. అలాగే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ప్రచారం చేయవల్సిన వ్యవసాయ విధానాలు, ప్రతిపాదనలపై కూడా చర్చిస్తామని వారు వెల్లడించారు. ఈ సదస్సులో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి, సిఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాటు కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని వారు వివరించారు.


కలప స్మగ్లర్‌పై పీడీయాక్టు

- నిందితుడు చంచల్‌గూడకు..

ఆదిలాబాద్ రూరల్, ప్రభన్యూస్: అటవీ సంపదను పరిరక్షించడానికి కలప స్మగ్లర్లపై కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జిల్లా పోలీసులు వెంటనే స్పందించారు. సిరికొండ మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన షేక్ షబ్బీర్ (30)పై పిడి చట్టంపై కేసు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేసి హైదరాబాద్ చంచల్ గూడ జైలుకు తరలించినట్లు ఎస్పీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇది తొలి పీడీ యాక్టు కేసుగా గుర్తించవచ్చు. షేక్ షబ్బీర్‌పై 21 అక్రమ కలప రవాణా కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. త్వరలో మరికొందరు ఫారెస్టు స్మగ్లర్లపై పీడీ యాక్టు నమోదు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. కలప అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో అక్రమ కలప రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి స్వయం పర్యవేక్షణలో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

అటవీ పోలీసు అధికారులు సంయుక్తంగా ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాయుధ పోలీసులతో అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టి అడ్డుకుంటామని అన్నారు. జిల్లా అటవీ సంపదను రక్షించడానికి అన్ని కోణాల్లో దృష్టిసారించి పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి పోలీసు శాఖ కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్ ఉత్తర్వులను 24గంటల్లోనే అమలు చేసి నిందితున్ని హైదరాబాద్ చంచల్‌గూడజైలుకు తరలించినట్లు తెలిపారు.


పంజాబ్ మద్యం పట్టివేత



మందమర్రి టౌన్, ప్రభన్యూస్ : మంచిర్యాల జిల్లా, మందమర్రి ఏరియాలోని కళ్యాణిఖని ఓపెన్‌కాస్టులోని జాతీయ రహదారి పక్కన పంజాబ్ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు వదిలి పెట్టిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. దీనిపై సమాచారం అందుకున్న మందమర్రి సీఐ రాంచందర్‌రావు, ఎస్సై శివకుమార్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. అనంతరం బెల్లంపల్లి ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించడంతో ఎస్సైలు నిర్మల పాటిల్, సి.హెచ్. లక్ష్మీనారాయణలు సంఘటనా స్థలానికి చేరుకొని బాటిల్స్ ఏ రాష్ట్రానికి చెందినవి అనే దానితో పాటు ఎవరు వదిలి వెళ్లారనే దానిపై ఆరా తీశారు. ఇటీవల బెల్లంపల్లి ఎక్సైజ్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టడంతో దుండగులు రోడ్డు ప్రక్కన వదిలి ఉంటారని శాఖ అధికారులు అనుమానాన్ని వ్యక్తం చేశారు. సుమారు 5వేల క్వార్టర్ బాటిల్స్ ఉంటాయని, దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతామని ఎస్సై శివకుమార్ తెలిపారు.

రెసిడెన్షియల్ కాలేజీల్లో పీజీటీలతోనే ఇంటర్ బోధన

- హైస్కూల్ నుంచి ఇంటర్‌కు అప్‌గ్రేడ్
- అయినా జేఎల్స్‌కు అనుమతి లేదు
- కొనసాగుతున్న ఎంపీసీ, బైపీసీ గ్రూపులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు పోస్టు గ్రాడ్యూయేట్ టీచర్స్(పీజీటీ) పాఠాలను బోధిస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా 9, 10వ తరగతికి బోధించే పీజీటీలతోనే ఇంటర్ సిలబస్‌ను బోధింప చేసున్నారు. దీంతో ఇంటర్మీడియట్‌కు బోధించే పీజీటీలపై పని భారం ఎక్కువగా ఉంటుంది. ఇంటర్మీడియట్ స్థాయిలో ఇంటర్ సిలబస్‌ను జూనియర్ లెక్చరర్లు బోధించాల్సి ఉన్నప్పటికీ రెసిడెన్షియల్ కాలేజీల్లోని ఇంటర్ విద్యార్థులకు మాత్రం పీజీటీలే ఇంటర్ విద్యను బోధిస్తున్నారు. దీంతో విద్యార్థులు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది.

కాలేజీలుగా 35 స్కూల్స్ అప్‌గ్రేడ్

రెసిడెన్షియల్ స్కూల్స్‌లోని 35 హైస్కూల్స్‌ను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేశారు. 2017-18లో 6 స్కూల్స్ ను కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేయగా.. 2018-19లో మరో 29 కాలేజీలను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం 2017-18లో జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ అయిన వాటిలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉండగా.. 2018-19లో అప్‌గ్రేడ్ అయిన 29 కాలేజీల్లో మాత్రం కేవలం మొదటి సంవత్సరం విద్యార్థులు మాత్రమే కొనసాగుతున్నారు. ప్రతి కాలేజీలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు కొనసాగుతున్నాయి. వీటిలో ఒక్కో గ్రూపులో 40 మంది చొప్పున కాలేజీలో 80 మంది విద్యార్థులతో ఇంటర్ కోర్సును కొనసాగిస్తున్నారు.

పీజీటీలతోనే బోధన...

ఇంటర్మీడియట్ సిలబస్‌ను కూడా 9, 10వ తరగతికి బోధించే పీజీటీలతోనే బోధింప చేస్తున్నారు. ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన కాలేజీలకు వాస్తవంగా 405 మంది జూనియర్ లెక్చరర్లు అవసరం అవుతారు. అందుకోసం జనరల్ రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ అధికారులు అప్‌గ్రేడ్ చేసిన జూనియర్ కాలేజీల్లో ఇంటర్ సిలబస్‌ను బోధించడానికి జూనియర్ లెక్చరర్లు కావాలని అందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. అయితే ఇప్పటికే మోడల్ స్కూల్స్‌లో కొన్నింటిని జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసి వాటిలో పీజీటీలతోనే బోధన కొనసాగిస్తున్నారని.. అదే విధానాన్ని ఇక్కడ కొనసాగించాలని గతంలో ఉన్న ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి చెప్పినట్టు కొన్ని యూనియన్ల నాయకులు చెబుతున్నారు. వాస్తవానికి అయితే ఇక్కడ 405 మంది జూనియర్ లెక్చరర్లు అవసరం ఉంటారు. వీరిలో ఇప్పటికే 9, 10వ తరగతులకు చెప్పే రెగ్యులర్ పీజీటీలతో కొనసాగిస్తూ మరో 150 మంది పార్ట్ టైమ్ పీజీటీలు కొనసాగిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యూకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్- రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా చేపట్టిన నియామకాల్లో 200 మంది పీజీటీలను రెసిడెన్షియల్ కాలేజీలకు కేటాయించినట్టు తెలిసింది. వారితోపాటు మరో 200 మందిని పార్ట్ టైమ్ పీజీటీలుగా కొనసాగిస్తున్నారు. తప్ప నేరుగా ఇంటర్ సిలబస్‌ను బోధించడానికి మిగిలిన జూనియర్ కాలేజీల్లో బోధిస్తున్నట్టుగా జూనియర్ లెక్చరర్లను నియామకం చేయలేదు. జేఎల్ పోస్టుల నియామకం కోసం అనుమతి కోరుతూ రెసిడెన్షియల్ అధికారులు నేరుగా ప్రభుత్వానికి మరోసారి లేఖ రాసినట్టు తెలిసింది.

సర్వేల్, హసన్‌పర్తిలో జేఎల్స్ ద్వారానే బోధన

జనరల్ రెసిడెన్షియల్ ఎడ్యూకేషనల్ సొసైటీ అధ్వర్యంలో కొనసాగుతున్న సర్వేల్‌లోని జూనియర్ కాలేజీలోనూ.. అదేవిధంగా హసన్‌పర్తిలో కొనసాగుతున్న రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో మాత్రం ఇంటర్ క్లాసులను బోధించడానికి జూనియర్ లెక్చరర్లకు అనుమతి ఇచ్చారు. వాటిలోని ఇంటర్ క్లాసులను జూనియర్ లెక్చరర్లు బోధిస్తున్నారు. కానీ అదే సొసైటీ పరిధిలోని అప్‌గ్రేడ్ అయిన జూనియర్ కాలేజీల్లో మాత్రం ఇంటర్ క్లాసులను పీజీటీలు బోధిస్తున్నారు.

మల్టీ మోసాలకు అడ్డుకట్టేది?

- ఫిర్యాదులకే స్పందిస్తున్న పోలీస్ యంత్రాంగం
- ముందే అరికట్టే అవకాశం ఉన్నా పట్టించుకోని పోలీసు విభాగాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మల్టీలెవెల్ మార్కెటింగ్, వైట్ కాలర్ నేరాలపై నియంత్రణ దిశగా పోలీసులు దృష్టి కనబర్చడం లేదా? అంటే ఔననే చెప్పాలి. కేవలం ఫిర్యాదు వస్తే తప్ప పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న వాదన బలంగా వినవస్తోంది. ప్రజల బలహీనతలను తమ పెట్టుబడిగా కొందరు కేటుగాళ్లు మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలకు పాల్పడుతున్నారు.

అధిక వడ్డీ, ఒకటికి రెండింతల ఆదాయం పేరుతో అమాయకులను బుట్టలో వేసుకుంటున్నారు. మల్టీ లెవెల్ మార్కెట్, వైట్ కాలర్ నేరాల నియంత్రణకు పోలీసుశాఖలో ప్రత్యేకమైన విభాగం నిరంతరం పనిచేస్తూ ఉంటుంది. ఆ విభాగం ఇలాంటి మోసాలపై సుమోటోగా కేసులు పెట్టి విచారించే అవకాశం ఉంది. అయితే అలా జరగడం లేదు. మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేస్తే స్పందిస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఇటీవలి కాలంలో ఇలాంటి మోసాలు వెలుగుచూశాయి. మోసపోయిన బాధితులంతా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తుండటంతో ఒక్కసారిగా పోలీసులు కదిలారు. క్యూనెట్, ఫ్యూచర్ మేకర్, హీరా గోల్డ్, సన్‌పరివార్ తదితర ఘటనలు మరువకముందే కరక్కాయల పేరిట దందా కొనసాగింది. దానిని తలదన్నే రీతిలో పల్లీనూనె పేరిట దగా వెలుగుచూసింది.

రూపాలు వెరైనా అంతిమంగా కోట్లు గడించడమే ఈ కేటుగాళ్ల లక్ష్యం. మొన్న కౌన్సిల్‌లో సైతం మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలపై ప్రస్తావన వచ్చింది. ఇలా మల్టీ మోసాలకు పాల్పడే నిందితుల వెనుక బడాబాబుల హస్తం ఉండటం విశేషం. దీంతో అసలు నిందతులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ఇలాంటి కేసుల్లో నిందితులు అరెస్టయినప్పటికీ పూర్తిస్థాయిలో వారి నుంచి సొమ్ము రికవరీ అయిన సందర్భాలు తక్కువే.

ఆ నేపథ్యంలో తాము మోసపోవడంతో పాటు తమతో పాటు మరో పదిమందిని ఈ ఉచ్చులోకి దింపినవారు తమ డబ్బు తిరిగి రాకపోయినా పర్వాలేదు.. తమ వల్ల మోసపోయిన బాధితులకైనా డబ్బులిప్పించండి మహాప్రభో అంటూ ఆయా పోలీస్‌స్టేషన్ల వెంట నిరంతరం కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం శూన్యం. సైబర్ నేరాల్లో కూడా పట్టుబడిన నిందితులనుంచి పూర్తిస్థాయిలో సొమ్ములు రికవరీ కావడం లేదు. ఫిర్యాదులు అందిన తరువాత కీలక కేసులను ఛేదిస్తున్న పోలసులు.. ప్రాథమిక దశలోనే మల్టీలెవెల్ మోసాలకు అడ్డుకట్టవేస్తే మేలు.




బోరుబావిలో పడిన చిన్నారి క్షేమం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలి జిల్లా కెర్వార్ గ్రామంలో బోరుబావిలో పడిన రెండేళ్ల చిన్నారిని రక్షించారు. గ్రామంలోని ఓ పొలం వద్ద ఆడుకుంటున్న రెండేళ్ల బాలిక ప్రమాదవశాత్తూ బోరుబావిలో పడిపోయింది. 70 అడుగుల లోతులో బాలిక ఉన్నట్లు గుర్తించగా.. గ్రామస్తుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ అగ్రిమాపక శాఖ అధికారులు చిన్నారిని బయటకు తీశారు. పొక్లెయిన్ సాయంతో బావి చుట్టూ తవ్వి బయటకు తీశారు. చివరకు చిన్నారిని క్షేమంగా బయటికి తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఇంట్లోకి రావద్దు అన్నందుకు...

తల్లిదండ్రుల కాల్చివేత

- అమెరికాలో ఓ యువకుడి దురాగతం



న్యూయార్క్: అమెరికాలో కాల్పులు సాధారణ అంశంగా మారి పోతుంది. అల్లరి, చిల్లరిగా తిరుగుతున్న ఇరవైఏళ్ళ యువకుడుని ఇంట్లోకి రావద్దు అన్నందుకు తల్లిదండ్రులు, కుటుంబ స్నేహితులను నిర్ధాక్షణ్యంగా కాల్చిచంపేశాడు. అమెరికాలోని లూసియానా రాష్ట్రంలోని అసెంప్షన్ ప్రాంతానికి చెందిన డకోటా థెరియోట్ అనే యువకుడు జులాయిగా తిరుగుతుండడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోవాలనీ, ఇకపై తిరిగి రావొద్దన్నారు. దీంతో థెరియోట్ లివింగ్ స్టన్ ప్రాంతంలో ఉంటున్న కుటుంబ స్నేహితులైన బిల్లీ ఎర్నెస్ట్, సమ్మర్ ఎర్నెస్ట్, టన్నర్ ఎర్నెస్ట్ అనేకుటుంబం వద్దకు వెళ్ళాడు. అక్కడా అదే పరిస్థితి ఎదురుకావడంతో విచక్షణ కోల్పోయిన డకోటా థెరియెట్ కుటుంబ స్నేహితులైన ముగ్గురిని తుపాకీతో కాల్చిచంపాడు. అక్కడ నుండి తల్లిదండ్రుల వద్దకు వచ్చి వాళ్ళని కూడా తరిమి తరిమి కాల్చి చంపేసి పరారయ్యాడు. ప్రస్తుతం పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

'ఐఆర్ఎస్' అధికారి నివాసంలో సోదాలు

రూ.2.27 కోట్లు స్వాధీనం



జైపూర్: రాజస్థాన్‌లో ఓ ఐఆర్ఎస్ అధికారి నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు చేయగా.. కోట్లాది రూపాయల ఆస్తుల్ని బయటపడ్డాయి. సాహీరామ్ మీనా ఇంట్లో ఏసీబీ అధికారులు రెండు రోజులుగా ఈ సోదాలు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో రూ. 2,26,00,098 నగదుతో పాటు కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు దొరికాయి. ఆస్తుల వివరాల్లోకి వస్తే.. రూ.6 లక్షల విలువైన ఆభరణాలు, సాహీరామ్ మీనా పేరుతో ఉన్న ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను గుర్తించారు. జైపూర్‌లో ఓ పెట్రోలు బంక్, ఓ ఫ్లాట్, 25 షాపులు, 82 ప్లాట్లు ఉన్నాయట. ఈ ఆస్తు లెక్కింపు ఇంకా కొనసాగుతోందట. మీనాపై అవినీతి ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో సోదాలు చేసినట్లు తెలుస్తోంది. మీనా రాజస్థాన్‌లోని కోట్లాలో డిప్యూటీ కమిషనర్ (నార్కోటిక్స్) గా పనిచేస్తున్నారు.

చిరువ్యాపారుల మధ్య గొడవ

- ఇనుపరాడ్లతో దాడి..

హైదరాబాద్, ఆంధ్రప్రభ : చారిత్రాత్మక చార్మినార్ వద్ద గలాటా చోటు చేసుకుంది. ఇద్దు చిరు వ్యాపారుల మధ్య మొదలైన గలాటా చినికి చినికి గాలివానగా మారింది. ఒకరిపై ఒకరు సినిమా స్టైల్‌లో ఇనుపరాడ్లతో ఇష్టమొచ్చినట్లు దాడి చేసుకున్నారు. ఈ ఘటనతో స్థానికంగా ఉన్న వ్యాపారులు తీవ్రంగా కలత చెందారు. దాడి సమయంలో ఇతర దుకాణాల్లోని వస్తువులు పగులగొడుతుండడంతో ఆందోళన చెందారు. హుస్సేనీ ఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలీవిధంగా ఉన్నాయి. బార్కస్‌కు చెందిన సయ్యద్ బిన్ అహ్మద్ సాది, సాదం బీన్ సాదిలు చార్మినార్ పరాషా హోటల్ ఎదురుగా తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుంటున్నారు. రెయిన్‌బజార్‌కు చెందిన సలీం కూడా అక్కడే చిరు వ్యాపారి. ఎప్పటిలానే శనివారం సలీం తోపుడు బండి నుంచి తమ బండికి ఎండ రాకుండా టెంట్ వేసుకున్నారు. రాత్రయినా వేసుకున్న టెంట్ తీయకపోవడంతో సలీంను నిలదీశాడు. దీంతో వారి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. మాటా మాటా పెరిగింది. దీంతో ఆగ్రహించిన సయ్యద్ బిన్ అహ్మద్ సాది, సాదం బిన్ సాదిలు సలీంపై ఇనుపరాడ్‌లతో దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సలీం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ ఇద్దరిపై 324 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.


కాళ్ల పారాణి ఆరక ముందే..

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాళ్ల పారాణి ఆరకముందే పెళ్లయిన నాలుగు రోజులకే నవ వధువు వాటర్ హీటర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఈ హృదయ విదారక ఘటన భాగ్యనగరం సికింద్రాబాద్‌లో మహంకాళీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ కళాసిగూడ ముత్యాలమ్మ ఆలయ సమీపంలో నివసించే పరమేశ్వర్, షమీదేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. పెద్ద కూతురు వివాహం కాగా.. పరమేశ్వర్ కొంత కాలం క్రితం మృతి చెందాడు. రెండో కూతురు మనీషా(28)కు 22న నాంపల్లికి చెందిన కృష్ణశర్మతో వివాహమైంది. శుక్రవారం పుట్టింట్లో శుభకార్యం ఉండటంతో ఆమెను తీసుకువచ్చారు. శనివారం ఉదయం స్నానం చేసేందుకు హీటర్ పెట్టింది. స్విచ్‌ఆఫ్ చేయకుండా బకెట్‌లో నుంచి హీటర్ తీసింది. ఈ క్రమలో హీటర్ తాకి విద్యుత్ షాక్‌కు గురైంది. ఇది గమనించిన కుటుంబసభ్యులు కిమ్స్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మనీషా మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు.

ఘనంగా ఐఎస్‌బీ గ్రాడ్యుయేషన్ డే

- 222 మందికి పట్టాల ప్రదానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) గ్రాడ్యుయేషన్ డే ఆదివారం ఘనంగా జరిగింది. మూడు పీజీ కోర్సులకు సంబంధించిన 222 మందికి పట్టాలను అందచేశారు. సీయెంట్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ బివిఆర్ మోహన్‌రెడ్డి గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను వ్యాపారవేత్తగా ఎదగడానికి ఎన్ని కష్టాలు పడ్డారో విద్యార్థులకు వివరించారు. కష్టాలు, ఇబ్బందులను ఎదుర్కొని.. సమస్యలను అధిగమించినప్పుడే విజయం సాధించగల మన్నారు. తాను అలాంగి కష్టాలను ఎన్నింటినో అనుభవించి ఈ రోజు విజయ వంతమైన వ్యాపారవేత్తగా నిలబడగలిగానని తెలిపారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా పీజీ కోర్సులు ముగిసిన 67 మంది పీజీపీ మాక్స్ క్లాస్ ఆఫ్ 2018, 71 మంది పీజీపీ ఎంఎఫ్ఏబీ క్లాస్ ఆఫ్ 2018, 84 మంది పీజీపీ ప్రొ క్లాస్ ఆఫ్ 2018. ఆదివారం పట్టాలు పొందిన వారితో కలిపితే ఇప్పటి వరకు 9700 మంది విద్యార్థులు ఐఎస్‌బీ నుంచి వివిధ కోర్సులు పూర్తి చేసి పట్టాలు పొందారని తెలిపారు.



తెలుగు రాష్ట్రాల వినియోగదారుల ఫిర్యాదులపై సర్క్యూట్ బెంచ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి వినియోగదారుల కమిషన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు సర్క్యూట్ బెంచ్‌ను ప్రారంభించారు. ఈనెల28వ తేదీ నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు హైదరాబాద్‌లో సర్క్యూట్ బెంచ్ పనిచేయనుంది. ఆదివారం హైదరాబాద్‌కు వచ్చిన జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆర్. కె. అగర్వాల్‌ను తెలంగాణ వినియోగ దారుల వ్యవహారాల కార్యదర్శి అకున్ సబర్వాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎం.ఎఫ్.కె. జైస్వాల్‌తో కలిసి ఆయా జిల్లాల వినియోగదారులు ఫోరం అధ్యక్షులు, సభ్యులతో సమీక్షా సమావేశాన్ని వారు నిర్వహించారు. జిల్లాలలో వినియోగదారుల ఫోరాలను బలోపేతం చేయడానికి తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు హైదరాబాద్ ఆదర్శ నగర్‌లోని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణను సర్క్యూట్ బెంచ్ చేపట్టనుంది. వినియోగదారుల ఫిర్యాదులకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో దాదాపు 2685 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే కోటీ రూపాయలు, అంతకు పైబడిన ఫిర్యాదులను ఈ సర్క్యూట్ బెంచ్‌లో నేరుగా ఫిర్యాదు చేసుకునే అవకాశముంది. ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి కొత్తగా అప్పీళ్ళు, రివిజన్ పిటిషన్లు కూడా నేరుగా దాఖలు చేసుకోవచ్చు.

'నాణ్యమైన విద్య ఉపాధ్యాయుల బాధ్యత'



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నాణ్యమైన విద్య ఉపాధ్యాయుల బాధ్యత అని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అభిప్రాయ పడ్డారు. గిరిజన గురుకుల విద్యాలయాల తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిజాం కాలేజీ ఆడిటోరియంలో ట్రైబల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో ఉపాధ్యాయుల పాత్ర, పడే ఇబ్బందులు అన్న అంశంపై ఒక రోజు నిర్వహించిన విద్యా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 24 గంటల పాటు గిరిజన గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యనందిస్తుండటం ముదావహమన్నారు. సమాజంలో ఎవరైనా ఉన్నతులుగా ఎదిగేందుకు ఉపాధ్యాయుల పాత్రే కీలకమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు విద్యనందించడంలో సహాయ సహకారాల నందించింది ఉపాధ్యాయులేనని ఆయన గుర్తు చేశారు. వారి సహకారంతో అంబేద్కర్ రాజ్యాంగ రచయితగా మారి దేశానికి ఎనలేని సేవనందించారన్నారు. గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయుల సమస్యలు, ఇబ్బందులున్నట్లు అసోసియేషన్ నేతలు తెలిపారని, వాటి పరిష్కారానికి కృషి చేయగలనని ఆయన హామీనిచ్చారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ.. గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయులు, ఇతరత్రా సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. ప్రభుత్వానికి గురుకుల విద్యాలయంలో ఉన్న సమస్యలన్నీ తెలుసన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేయ గలదన్నారు. సంఘం నేతలు కుమార్, నారాయణ, శ్యాంకుమార్‌లు మాట్లాడుతూ విద్యా రంగంలో ఎటువంటి మార్పులొస్తున్నాయి? వాటిని ఏ విధంగా మనం అంది పుచ్చుకోవాలి? ఉద్యోగులుగా మనకున్న సమస్యలేమిటి? అవి పరిష్కారానికి ఏం చేయాలి? ఎలా ముందుకు వెళ్లాలి? అన్న అంశాలపై సదస్సులో చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి ఈటల రాజేందర్ హాజరై ఉద్యోగుల సంఘం క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు.

దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం

- కోస్తాలో పలు చోట్ల వర్షాలు
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి

అమరావతి ఆంధ్రప్రభ : విదర్భ నుంచి తెలంగాణా, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకు ఏర్పడిన ద్రోణి బలహీనపడి కోస్తా తీరంలో కొనసాగుతోందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. విదర్భ తూర్పు ప్రాంతంలో 1500 మీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని దీని నుంచి తెలంగాణా మీదుగా కర్ణాటక వరకు మరో ఉపరితల ద్రోణి ఏర్పడిందని దీంతో తెలంగాణా సహా కోస్తాంధ్రలో వర్షాలు కురుస్తున్నాయని అధికారులు తెలిపారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ద్రోణి ప్రభావం కారణంగా కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో పలు చోట్ల వర్షాలు కురిశాయి. అమరావతి రాజధాని నగరం విజయవాడ, గుంటూరులో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వీధులన్నీ జలమయం అయ్యాయి. సాయంత్రం ప్రారంభమైన వర్షం ఎడతెరపి లేకుండా రాత్రి వరకూ పడడంతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో పలు చోట్ల చెదురుమదురు జల్లులు పడే అవకాశం ఉందని, ఇందువల్ల మరో రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని, పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ద్రోణి ప్రభావం అంతగా లేనందున ఒరిస్సాలో పలు చోట్ల, తమిళ నాడులో అక్కడక్కడా చెదురుమదురుగా జల్లులు పడే ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో చలి ప్రభావం పెరిగే అవకాశం ఉంది. ఉత్తర తమిళనాడు తీరానికి దగ్గరలో ఉన్న నైరుతి బంగాళా ఖాతంలో 0.9 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. హిందూ మహాసముద్రం, దక్షిణ బంగాళాఖాతం మధ్య తాజాగా మరో అల్పపీడనం ఏర్పడింది. ఇదే సమయంలో దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండడం, తెలంగాణాపై ఉపరితల ద్రోణి ఏర్పడడంతో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో పొడి వాతావరణం ఉన్నా, కొన్ని ప్రాంతాలను పొగమంచు కమ్మేస్తుందని, సోమవారం అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుండగా ఇందుకు అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. తెలంగాణా నుంచి రాయలసీమ వరకు 3.1 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని, ఈ ప్రభావం వల్ల కూడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మహారాష్ట్రలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలంగాణా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

విశాఖ నుంచి జనఘోష రైలు యాత్ర

విశాఖపట్నం, ప్రభన్యూస్ : విభజన చట్టంలోని హామీలు నెరవేర్చాలని కోరుతూ మాజీ మంత్రి కొణతాల రామకృష్ణతలపెట్టిన జనఘోష రైలు యాత్ర ఆదివారం ఢిల్లీ బాట పట్టింది. ప్రత్యేక హోదా ఇవ్వాలని, విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ప్రకటించి తీరాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు నల్ల బ్యాజీలు ధరించి కొణతాల రామకృష్ణ విశాఖ రైల్వే జోన్ సాధన సమితి తరపున డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రైల్వే జోన్ సాధన సమితి జనఘోష పేరిట రైలు యాత్రకు విశేష స్పందన కనిపించింది. పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులూ, పలు రాజకీయ పక్షాల నేతలూ, రైల్వే జోన్ సాధన కమిటీ సభ్యులూ మూడు జిల్లాల నుంచీ వచ్చి పాల్గొన్నారు.

ఆదివారం విశాఖ రైల్వే స్టేషన్ నుండి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి బయలుదేరి వెళ్ళేరు. ముందుగా వారు అల్లిపురం లో గల సీపీఐ కార్యాలయం నుండి రైల్వే స్టేషన్ లో గల 8 వ నెంబరు ప్లాట్‌ఫాం వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్బంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని మంత్రులూ, ఎంపీలు, ఇతరులనూ వ్యక్తిగతంగా కలిసి విభజన అంశాలపై కేంద్రంను ఒప్పించాల్సిందిగా అభ్యర్థిస్తామన్నారు. మోదీ సానుకూలంగా స్పందించేలా ఈ యాత్ర దోహదపడగలదని ఆశించారు.

Andhraprabha business 2018
బిజినెస్

పీఎస్‌యూ బీమా కంపెనీలకు రూ.4వేల కోట్ల మూలధనం



న్యూఢిల్లీ : ఈ నెల 1వ తేదీన లోకసభలో ప్రవేశపెట్టే 2019-20 బడ్జెట్‌లో ప్రభుత్వరంగానికి చెందిన బీమా కంపెనీలకు రూ.4వేల కోట్ల మూలధనం సమకూర్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం ఆర్థికవ్యవహారాల విభాగం బడ్జెట్‌లో ప్రభుత్వరంగానికి చెందిన మూడు బీమా కంపెనీలు.. నేషనల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ, ఒరియంటల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ కంపెనీలకు మూలధనం సమకూర్చాలని కోరినట్లు చెబుతున్నారు. బీమా కంపెనీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ మూలధనం కోరింది. అయితే నిధులు అందుబాటును బట్టి ఒక్కో కంపెనీకి ఎంత మొత్తం కేటాయించాలో నిర్ణయిస్తుంది. ఇటీవల కాలంలో సాధారణ బీమా కంపెనీలు వాటిలో ప్రభుత్వ రంగానికి చెందిన కంపెనీలు కూడా భారీ నష్టాలను మూటగట్టుకుంటున్నాయి. అండర్ రైటింగ్ నష్టాలతోపాటు అత్యధిక క్లెయిమ్‌లే దీనికి కారణం. ఇదిలా ఉండగా 2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో అరుణ్‌జైట్లీ పైన తెలిపిన మూడు కంపెనీలను విలీనం చేసి ఒకే కంపెనీగా చేయాలనే ప్రతిపాదనను తీసుకువచ్చారు. ఈ విలీనం ప్రక్రియ ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్చి 31, 2017 నాటికి పైన తెలిపిన మూడు బీమా కంపెనీలు కలిసి సుమారు 200 కంటే ఎక్కువ బీమా ప్రొడక్టును విక్రయించి రూ.41,641 కోట్ల ప్రీమియం వసూలు చేశాయి. ఈ కంపెనీల మార్కెట్ వాటా 35 శాతంగా నిలిచింది. ఈ కంపెనీల నికర విలువ రూ.9,243 కోట్లుకాగా మొత్తం 44వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. దేశవ్యాప్తంగా 6000 కార్యాలయాలున్నాయి.

మొండిబకాయిల వసూళ్లలో మోడీ సర్కార్ విఫలం!

- దివాలా చట్టం కోడ్ సంస్కరణ అటకెక్కింది
- మూడేళ్లు దాటినా జోరందుకోని ఐబీసీ కోడ్

కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ పీఎస్‌యు బ్యాంకుల్లో పేరుకుపోతున్న మొండిబకాయిలు వసూళ్లకు మందుకనుగొని వసూళ్లు పెంచుకోవాలని నిర్ణయించింది. దానికి గాను 2016లో కొత్త దివాలాచట్టం కోడ్‌ను తీసుకొచ్చింది. దీంతో ప్రభుత్వ అధికారులు ఇన్వెస్టర్లు కూడా ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులకు రావాల్సిన బకాయిలు వసూలైతాయని సంబరపడిపోయారు. దీంతో పాటు కొన్ని రుణాలను పునర్వ్యవస్థీకరించి తర్వాత వసులు చేసుకోవచ్చునని ఆశించాయి. కొత్త సంస్కరణల ద్వారా మొండిబకాయిలు వసూళ్లు వేగవంతంగా వసూలు చేసుకొని.. మళ్లీ కొత్త రుణాలు ఇచ్చి దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే మోడీ ప్రభుత్వం లక్ష్యం నీరుగారిపోయింది. దివాటాచట్టంకోడ్ తీసుకొచ్చి మూడు సంవత్సరాలు పూర్తయినా పరిస్థితిలో పెద్ద పురోగతి కనిపించడం లేదు. పెద్ద ఖాతాల రుణాల పునర్మాణం మందకొడిగా ముందుకుసాగుతోంది. అయితే బ్యాంకర్లు కొన్ని మొండిబకాయి ఖాతాలను ఎంతో కొంతకు విక్రయించుకొనిసొమ్ము చేసుకుంటున్నాయి. దివాలకోర్టుచట్టం తీర్పువరకు వేచి చూడకుండా ఎంతో కొంతకు విక్రయించుకుంటున్నాయి. ఇలా చేయడం వల్ల మోడీ ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నేరవేరదు. ప్రభుత్వం బ్యాంకుల నుంచిపెద్దమొత్తంలో రుణాలు ఇప్పించి దేశ ఆర్థిక వ్యవస్థను బలోపే తం చేయడంతో పాటు ఈ ఏడాది ఎన్నికలసంవత్సరం కాబట్టి ఉద్యోగాలు సృష్టించామని పెద్దగా చెప్పుకోవడానికి వీల్లేకుండా పోతోంది.



తీర్మనాలు ఆలస్యం

ఐబీసీ కోర్టు (దివాలచట్టం)కోడ్ ద్వారా తీర్మానాలు ఆలస్యం కావడంతో ఖాయిలాపడ్డం సంస్థలను కొనుగోలు చేయాలనుకొనే ఇన్వెస్టర్లు వెనుకంజ వేస్తారని కెకెఆర్ అండ్ కంపెనీ ఐఎన్‌సీ చెందిన విజయ్ పద్మనాభన్ అభిప్రాయపడుతున్నారు. ఈ కంపెనీ ప్రపంచంలోని అతి పెద్ద ప్రైవేట్ ఈక్విటీ కంపెనీల్లో ఒకటి. భారత్‌లో ఖాయిలాపడ్డ సంస్థలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు ఆయన తెలిపారు. అయితే దివాలాచట్టం ప్రక్రియ గతంతో పోల్చుకుంటే కాస్తా నయమని అన్నారు. దివాలాకోర్టుకు వచ్చే కేసులను పరిష్కరించడానికి ఒక టైంలైన్ లేదా నిర్దిష్టంగా కొంత సమయం తీసుకొని తీర్పు ఇస్తే ఆసక్తి గల ఇన్వెస్టర్లు దివాలాతీసిన కంపెనీని కొనుగోలు చేయడానికి ముందుకొస్తారని పద్మనాభన్ వివరించారు.

ఇదిలా ఉండగా ప్రభుత్వం మే 2016లో ది ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. దీంతో చిన్న చిన్న బ్యాంకులు లేదా ఫైనాన్స్ కంపెనీ రుణం తీసుకొని డిఫాల్ట్ అయిన కంపెనీని నుంచి బకాయిలు వసూలు చేసుకోవడానికి ఐబీసీ కోర్డుకు వెళ్లవచ్చు. ఒక వేళ కోర్టు బ్యాంకు లేదా ఫైనాన్స్ కంపెనీ పిటిషన్‌ను స్వీకరిస్తే.. 270 రోజుల్లో కోర్టు తీర్మానం చేయాల్సి ఉంటుంది. అటు తర్వాత కంపెనీని విక్రయానికి పెడతారు.

కొత్త చట్టం తేవడానికి ప్రధాన కారణం డిఫాల్ట్ అయిన కంపెనీ బ్యాంకులతో సంప్రదింపులు జరిపి సర్దుబాటు చేసుకొని కేసును త్వరగా పరిష్కరించుకోవాలనేది ప్రధాన ఉద్దేశం. మొత్తానికి బ్యాంక్‌రప్టసీ ప్రాసెస్ వల్ల కంపెనీలపై పెద్దపట్టు ఉంటుంది. ఇదిలా ఉంటే దివాలా తీసిన కంపెనీలు కొనుగోలు చేసి వాటిని లాభాలబాట పట్టించి అధిక లాభాలు ఆర్జించాలనే విదేశీ ఇన్వెస్టర్లు మాత్రం జరుగుతున్న ఆలస్యం చూసి వెనక్కి వెళ్లిపోతున్నారని ఎడిల్‌వైసిస్ చైర్మన్ సిబి ఆంతోని చెప్పారు.



ఎస్సార్ కేసు గురించి

ఎస్సార్ స్టీల్ యజమానులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని రూ.50,800 కోట్లు డిఫాల్ట్ అయ్యారు. రుయా బ్రదర్స్ శశి, రవిరుయాలు దీనికి యజమానులు .. బ్యాంకులకు వేలాది కోట్ల రూపాయలు బకాయిలు పడ్డారు. అయితే ఇక్కడ దివాలాకోర్టు ఈ ఉక్కు కంపెనీని ప్రపచంలోనే అతి పెద్ద ఉక్కు కంపెనీని నిర్వహిసున్న అర్సిలర్ మిట్టల్‌కు విక్రయించాలని నిర్ణయించింది. బ్యాంక్‌రప్టసీ కోర్టు తీర్పును ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు సవాలు చేశాయి. దీనిపై తొమ్మిది నెలల దీనిపై తీర్పు రావాల్సి ఉంది. ప్రస్తుతం ఒకటిన్నర సంవత్సరం దాటిపోయింది. ఇప్పటికి అతిగతి లేదు.. బ్యాంకులు మాత్రం తమకు ఎంత బకాయిలు తిరిగి వస్తాయో రావో అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నాయి. భారీ అప్పుల్లో కూరుకుపోయిన భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్, జ్యోతి లేబరేటరీస్‌తో పాటు బోలెడన్ని కంపెనీలు ఇలాంటి లిటిగేషన్‌లో ఇరుక్కుపోయాయి.

బ్యాంక్‌రప్టసీ కోడ్ సరైందే

కానీ దాని పటిష్టంగా అమలు చేయడంలోనే వస్తోంది అసలు సమస్య. బ్యాంకులతో పాటు ఇన్వెస్టర్లు చెప్పేదేమిటంటే సుమారు రూ.14.5 లక్షల కోట్ల ఆస్తులు మొండిబకాయిలుగా మారిపోయాయనని చెబుతున్నారు. వాటిలో కేవలం రూ.73వేల కోట్లు లేదా 5 శాతం మాత్రమే పరిష్కారం అయ్యాయి. అయితే ఈ రూ.73వేల కోట్లలో సగం మాత్రం చేతికందాయి. మిగిలిన సగం మళ్లీ ఈ తీర్పులను సవాలు చేస్తూ కొన్ని కంపెనీలు మళ్లీ కోర్టుకు వెళ్లిన కేసులున్నాయి. చట్టంలోని లొసుగులను కట్టుదిట్టం చేసి కేసులను వేగంగా పరిష్కరిస్తేనే ఖాయిలా పడ్డ పరిశ్రమలను కొనుగోలు చేయడానికి ముందుకొస్తారని కొటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అలోక్‌వర్మ అభిప్రాయపడ్డారు. దివాలా కంపెనీలను కొనుగోలు చేయడానికి క్లయింట్లు కొటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకును సంప్రదిస్తుంటారు.

ఇదిలా ఉండగా ఇప్పటి వరకు 1,198 కేసులను ఐబీసీ కోర్టు ఇన్సాల్వెన్సీ ప్రాసెస్‌కు స్వీకరించింది. వాటిలో 52 కేసులపై తీర్మానాలు కూడా జరిగిపోయాయి. అయితే వాటిలో ఇప్పటి వరకు బ్యాంకులకు రావాల్సిన బకాయిలు చాలా కంపెనీల నుంచి అందలేదు. ఎస్సార్‌స్టీల్ కేసును వీలైనంత త్వరగా పూర్తి చేస్తే.. మిగిలిన పెద్ద ఖాతాలు కూడా త్వరగా పరిష్కారం అవుతాయని బ్యాంకర్లు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా బ్యాంకర్లు కొన్ని మొండిబకాయిలను భారీ డిస్కౌంట్‌తో విక్రయించి తమ బకాయిలను రాబట్టుకోవాలని చూస్తున్నాయి. ఎస్‌బీఐ విషయానికి వస్తే ఎస్సార్‌స్టీల్ నుంచి రూ.15,040 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. ఎస్‌బీఐ కాకుండా ఇతర బ్యాంకులు కూడా ఎస్సార్‌స్టీల్‌కు రుణాలుఇచ్చి ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఈ నష్టాల కోసం బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్లలో మొండిబకాయిలకు కేటాయింపులు చూపించుకోవాల్సి వస్తోంది. దీంతో పాటు బ్యాంకులకు వచ్చే వడ్డీ ఆదాయం నష్టం.. చివరకు బ్యాంకులు పెద్దమొత్తంలో వడ్డీతో పాటు అసలు తోసేసి చేతికందిన కాడికి వసూలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే బ్యాంకుల వద్ద మూలధనం లేక కొత్తగా రుణాలు ఇవ్వడానికి ఇబ్బందులు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జీడీపీ వృద్ధిరేటు పెంచుకోవాలంటే ఇబ్బందే.. ఎన్నికల సంవత్సరం కాబట్టి ఇది మోడీ ప్రభుత్వానికి కూడా చేటే!

ఎగుమతుల రెట్టింపుపై ఫోకస్

- గోవాను ఎగుమతులకు హబ్‌గా చేస్తాం:సురేశ్ ప్రభు



పానాజీ : కేంద్ర ప్రభుత్వం ఎగుమతులు రెట్టింపు చేసేందుకు కొత్త విధానాలను తీసుకురానుంది. రాబోయే కొన్ని సంవత్సరాల్లో ప్రస్తుతం ఉన్న ఎగుమతులు 321 బిలియన్ డాలర్లకు రెట్టింపు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర మంత్రి సరేశ్‌ప్రభు అన్నారు. దక్షిణ గోవాలోని మార్గోవాలో ఎక్స్‌పోర్ట్ ఇన్స్‌ఫెక్షన్ లేబరేటరీ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం తర్వాత మాట్లాడుతూ ఆయన ఈ విషయం ప్రస్తావించారు. రాబోయే కొన్ని సంవత్సరాల్లో ఎగుమతులు ప్రస్తుతం ఉన్న వాటికి రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రధానంగా చేపల ఎగుమతులపై దృష్టిపెడతామని, దీనికి గాను వ్యవసాయరంగంలో కొత్త విధానాలు తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. కొత్త విధానాల గురించి ప్రస్తావిస్తూ ముఖ్యంగా కీలకమైన ఐదు విభాగాలు.. వ్యవసాయం, ఉద్యాన వనాలు, తోటల పెంపకం, చేపలు, మాంసంపై దృష్టి పెడతామన్నారు. ప్రస్తుతం ఈ రంగాలపై 30 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరుగుతున్నాయని.. వాటికి 100 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా చేసుకున్నామన్నారు. ముఖ్యంగా చేపల రంగం లో లక్షలాది ఉద్యోగాలు సృష్టించవచ్చునని ఆయన వివరించారు. ఈ నెల 15వ తేదీన ఎయిర్ కార్గ్ విధానాలను ప్రకటించినందున చేపల ఎగుమతులు పుంజుకుం టయన్నారు. కేంద్రం, గోవా ప్రభుత్వం కలిసి ఎగుమతులు ప్రోత్సహించడానికి తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటుందన్నారు. కూరగాయలు, పండ్లు, జీడీపప్పు, చేపలు, గోవా నుంచి ఎగుమతి చేసుకోవచ్చునన్నారు. కేంద్రపౌరవిమానాయన శాఖ మంత్రి కూడా ఉన్న ప్రభు... ఇక్కడి గ్రీన్‌ఫీల్డ్ మోపా విమానాశ్రయం 2020 నాటికి అందుబాటులోకి వస్తుందన్నారు. గోవాను ఎగుమతులకు హబ్‌గా తీర్చి దిద్దుతామన్నారు.

ఇప్పట్లో రిటైర్మెంట్ లేదు



- వేదాంత చీఫ్ అనిల్ అగర్వాల్
- తన సేవలు కంపెనీలకవసరం
- రిస్కు తీసుకోవడానికి సై
- కుటుంబ సభ్యులకు బాధ్యతలు అప్పగించను



న్యూఢిల్లీ : మైనింగ్ మొగల్ అనిల్ అగర్వాల్ ఇప్పటి కిప్పుడే రిటైర్మెంట్ తీసుకొనే ఆలోచనలేదని స్పష్టం చేశారు. నాన్ ఎగ్జిక్యూటివ్ పాత్ర కూడా పోషించనని తేల్చి చెప్పారు. 1,800 కోట్ల డాలర్ల వేదాంతగ్రూపును ప్రపంచస్థాయి కంపెనీగా తీర్చిదిద్దే వరకు నిద్రపోనని, శరవేగంగా అభివృద్ధి పథంలో తీసుకుపోవడానికి వేదాంతకు తన అవసరం ఎంతో కీలకమని ఆయన అన్నారు. తాను ఎలాంటి రిస్కు తీసుకోవడానికైనా సిద్ధంగా ఉన్నానన్నారు.

64 ఏళ్ల అగర్వాల్ ఒకప్పుడు స్క్రాప్ మెటల్ (తుక్కు ఇనుము)వ్యాపారంతో తన కేరీర్‌ను ప్రారంభించి నాలుగు దశాబ్దాల కాలంలో దేశంలోని అత్యంత సంపన్నుల్లో ఒకరిగా నిలిచారు. గనులు, పెట్రోలియం రంగాల్లో అతి పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. తన కుమారుడు, అగ్నివేశ్ కానీ.. కూతురు ప్రియాకానీ గ్రూపునకు నాయకత్వం వహించరని, కంపెనీ చాలా పెద్దది కాబట్టి తన కుటుంబసభ్యులు వీటిని సమర్థవంతంగా నిర్వహించడం కష్టమని ఆయన స్పష్టం చేశారు.

వేదాంత రీసోర్సెస్ లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎల్ఎస్ఈ) నుంచి డీలిస్ట్(లిస్టింగ్) నుంచి తప్పించారు. ప్రస్తుతం ఆయన విదేశాల్లో మినరల్ మైనింగ్, చమురు సహజ వాయువు వ్యాపారాలపై ఫోకస్ పెడుతున్నట్లు పీటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. తనకు వేదాంత లిమిటెడ్‌లో 50 శాతం వాటాలున్నాయి. వాటిలో 75 శాతం దానధర్మాలకు ఇస్తానని హామీ ఇచ్చానని ఆయన వివరించారు.

వారసుడు బయటి వ్యక్తే

తన వారసుడిగా కుటుంబసభ్యులకు బాధ్యతలను అప్పగించనని.. అతి పెద్ద కంపెనీని కుటుంబసభ్యుడికి అప్పగించడం సబబుకాదు. కుమారు అగ్నివేశ్, ప్రియాలు వారికి ఇష్టం వచ్చిన రంగాల్లో సంతోషంగా ఉన్నారు. కుమారుడు దుబాయిలో ఉన్నారు. ఆయన గురించి బయటి ప్రపంచానికి పెద్దగా తెలియదు. అయితే ఆయను కుమార్తె ప్రియా మాత్రం కొన్ని కంపెనీల బోర్డులో సభ్యులుగా ఉన్నారు. ఉదాహరణకు కెయిర్న్ ఇండియా బోర్డులో ఆమె సభ్యురాలు. తన పిల్లల్ని వారికి ఇష్టం వచ్చిన రంగాలను ఎంచుకొమన్నానని, ఆయా రంగాల్లో వారు సంతృప్తిగా ఉన్నారని, అయితే తన గ్రూపును నడపడానికి అత్యుత్తమ సీఈవోను తీసుకొస్తానన్నారు.

వాటాదారుడిగా కొనసాగుతాను

భవిష్యత్తులో వాటాదారుడిగా కొనసాగుతానని, తన కంపెనీని ఒక వ్యవస్థగా నడిపేవారి చేతిలో పెడతానన్నారు. ప్రస్తుతానికి ముందు చూపు కలిగిన వ్యక్తి కావాలని, ఎవరికి ఆలోచనరాని విధంగా స్వల్ప కాలంలో రోజుకు ఐదు లక్షల బ్యారెల్ల చమురు ఉత్పత్తిచేసే విధంగా ఆలోచించే వ్యక్తి కావాలన్నారు. ధైర్యంగా దూసుకుపోయి.. రిస్కు తీసుకొనే సత్తా తనకు ఉందన్నారు. అయితే తర్వాలో మీరు రిటైర్మెంట్ తీసుకుని నాన్ ఎగ్జిక్యూటివ్ పాత్ర పోషిస్తారా అనిప్రశ్నించగా.. ప్రస్తుతానికి అలాంటి ఆలోచన లేదన్నారు. అయితే 2012లో అగర్వాల్ వచ్చే 3-4 సంవత్సరాల తర్వాత డ్రైవింగ్‌సీట్ నుంచి తప్పుకొని వెరొకరికి అప్పగించి నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పాత్రలోకంపెనీ వ్యవహారాలను గమనిస్తానన్నారు.


దేశీయ సంపన్నుల్లో 37వ స్థానం : భారతీయ సంపన్నుల్లో అనిల్ అగర్వాల్ 37వ స్థానంలో ఉన్నారని.. ఫోర్బ్స్ మేగజైన్ ప్రకటించింది. ఆయన వ్యక్తిగత సంపద 390 కోట్ల డాలర్లని వెల్లడించింది. నష్టాల్లో ఉన్న ప్రభుత్వరంగానికి చెందినకంపెనీలను టేకోవర్ చేసి వాటిని లాభాల బాట పట్టించడంతో ఆయన దిట్ట. ఉదాహరణకు బాల్కో, హిందుస్తాన్ జింక్‌లను టేకోవర్ చేసి లాభాలబాట పట్టించారు. 2011లో ఆయన కెయిర్న్ ఇండియాను టేకోవర్ చేసి చమురు సహజ వాయువు రంగాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. కాపర్, అల్యూమీనియం, ముడి ఇనుము తదితరాల్లో వ్యాపారాలు చేస్తున్నారు. తన కల మాత్రం వేదాంతను ప్రపంచంలోని అతి పెద్ద రీసోర్సెస్ కంపెనీగా తీర్చిదిద్దాలని ఆయన మనసులోని మాట చెప్పారు.

బడ్జెట్... క్యూ3 ఫలితాలు కీలకం



ముంబై : ఈ వారం స్టాక్‌మార్కెట్లకు కీలకం కానున్న అంశాల విషయానికి వస్తే .. 2019-20 ఆర్థిక సంవత్సరానికి తాత్కాలిక బడ్జెట్.. దీంతో పాటు గురువారం నాడు జనవరి నెల డెరివేటివ్ కాంట్రాక్టు ముగియనుంది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం ఫలితాలు, యుఎస్ పెడ్‌రిజర్వు వడ్డీరేట్లపై నిర్ణయం, గ్లోబల్ మార్కెట్లో జరిగే పరిణామాలు కీలకం కానున్నాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఈ వారంలో కంపెనీల ఫలితాల విషయానికి వస్తే యాక్సిస్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, బజాజ్ ఫైనాన్స్, ఐఓసీ, హెచ్‌సీఎల్, బ్యాంకు ఆఫ్ ఇండియా, కెనెరా బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడీ, హెచ్‌ఈఎఫ్‌సీ, బజాజ్‌ఆటో, ఐసీఐసీఐ బ్యాంకు, హీరోమోటో, డాక్టర్ రెడ్డీస్, ఎస్‌బీఐలున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీన 2019-20 ఆర్థిక సంవత్సరానికి తాత్కాలిక బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. మార్కెట్లకు కీలకం కానున్న అంశాలవిషయానికి వస్తే విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్లో ఎంత మొత్తం పెట్టుబడులు పెట్టే అంశం... అమెరికా - చైనాల మధ్య వాణిజ్య యుద్ధం, తదితర అంశాలపై ఇన్వెస్టర్లు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇదిలా ఉండగా గత శుక్రవారం నాడు విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు రూ.689.28 కోట్ల షేర్లు కొనుగోలు చేస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులురూ.147.35 కోట్ల షేర్లు విక్రయించారు. శుక్రవారం నాడు తయారీరంగానికి చెందిన పీఎంఐ, గణాంకాలు విడుదల కానున్నాయి. దీని ప్రభావం మార్కెట్ సెంటిమెంట్‌పై పనిచేస్తుందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నిత్యాంక్‌తో సంబంధాల్లేవు



- ఎస్సెల్ గ్రూప్ మనీలాండరింగ్ ఆరోపణలు ఖండన

న్యూఢిల్లీ : సుభాష్‌చంద్ర ప్రమోట్ చేసిన రెండు ఎస్సెల్ గ్రూపు కంపెనీలు జీ ఎంటర్‌టెయిన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్, డిష్ టీవీలు నిత్యాంక్ ఇన్‌ఫ్రాపవర్‌తో పాటు మల్టీవెంచర్ లిమిటెడ్‌తో ఎలాంటి సంబంధాలు లేవని ఆదివారం నాడు ఖండిచింది. పెద్దనోట్ల రద్దు తర్వాత ఈ కంపెనీలు పెద్దమొత్తంలో బ్యాంకుల్లో డిపాజిట్లు చేశాయని.. దీనిపై ఎస్‌ఎఫ్‌వో దర్యాప్తు చేస్తోందని వార్తలు రావడంతో శుక్రవారం నాడు సుభాష్‌చంద్రకు చెందిన కంపెనీ షేర్లు భారీగా కుప్పకూలాయి.

జీ ఎంటర్‌టెయిన్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జీఈఈఎల్) బీఎస్ఈకి సమాచారం అందిస్తూ.. నిత్యాంక్ ఇన్‌ఫ్రాపవర్, మల్టీవెంచర్స్ లిమిటెడ్‌లు రెండు స్వతంత్ర కంపెనీలని ఎస్సెల్ గ్రూపునకు ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పింది.

నిత్యాంక్‌పై ఎస్‌ఎఫ్ఐవో విచారణ జరుపుతూ.. అదే సమయంలో ఎస్సెల్ గ్రూపునకు వీటితో సంబంధం ఉందనే కోణంలో విచారణ జరుపుతోందన్న వార్తలు అవాస్తవమని, కావాలని కొందరు దురుద్దేశంతో ప్రచారం చేస్తున్నారని.. వారిపై చట్టం ప్రకారం చర్చలు తీసుకుంటామని జీఈఈఎల్ ప్రకటనలో తెలిపింది. తమకు అంటే జీ ఎంటర్‌టెయిన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు వెబ్‌సైట్‌లో ప్రచురించిన విధంగా ఫలానా కంపెనీతో లావాదేవీలు వచ్చిన వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది.

మీడియాలో పేర్కొన్న విధంగా ఎస్సెల్ గ్రూపుపై వచ్చిన ఆరోపణలు.. పెద్దనోట్ల రద్దు తర్వాత వచ్చినవన్నీ నేరుగా నిత్యాంక్‌వైపునకు వెళుతున్నాయని పేర్కొంది. ఎస్‌ఎఫ్ఐఓ అడిగిన సమాచారం అందించామని వారి నుంచి మరంత సమాచారం కావాలని తమకు ఎలాంటి వర్తమానం రాలేదని ఎస్సెల్ పేర్కొంది. ప్రస్తుతం ఎస్సెల్ గ్రూపు కంపెనీలకు ఎస్‌ఎఫ్ఐఓతో ఎలాంటి సంబంధాలు లేవని.. ఇది ముగిసిన అధ్యాయమని జీఈఈఎల్ పేర్కొంది. డిటిహెచ్ అనుబంధ సంస్థ డిష్ టీవీకి కూడా నిత్యాంక్‌తో ఎలాంటి లావాదేవీలు జరపలేదని స్పష్టం చేసింది. వీడియోకాన్ డీ2హెచ్ కంపెనీని డిష్ టీవీతో విలీనం జరపడం లేదని కూడా వివరణ ఇచ్చింది.

ఇదిలా ఉండగా జులై 2018న ఎస్‌ఎఫ్ఐఓ నుంచి కంపెనీకి నిత్యాంక్ ఇన్‌ఫ్రా పవర్, మల్టీవెంచర్ లిమిటెడ్ (నిత్యాంక్)సంబంధాల గురించి వివరణ కోరింది. ఎస్‌ఎఫ్ఐఓ అడిగిన సమాచారం అందించింది. దీంతో పాటు వీడియోకాన్ డీ2హెచ్ లిమిటెడ్‌ను డిష్ టీవీ ఇండియా లిమిటెడ్‌లో విలీనం గురించి కూడా కూడా వివరణ ఇచ్చింది. విలీనం చేసుకోవడం లేదని, దీంతో పాటు నిత్యాంక్‌తో ఎలాంటి లావాదేవీలు కూడా లేవని జీఈఈఎల్ ఎస్‌ఎఫ్ఐఓకు వివరణ ఇచ్చింది.

ఇదిలా ఉండగా జనవరి 25వ తేదీన జీ గ్రూపునకు చెందిన కంపెనీ షేర్లుఅమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఏకంగా 33 శాతం క్షీణించాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏకంగా రూ.13,352 కోట్లు హరించుకుపోయింది. అటు తర్వాత పరిస్థితిని గమనించిన ఎస్సెల్ గ్రూపు చైర్మన్ సుభాష్‌చంద్ర బ్యాంకర్లకు క్షమాపణ చెప్పారు. తమ కంపెనీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, దీనికి కారణం ఇన్‌ఫ్రా లో పెద్దమొత్తం లో పెట్టు బడులు పెట్టామని, ఐఎల్అండ్‌ఎఫ్ఎస్ సంక్షోభం తర్వాత పరిస్థితులు తమ అదుపులో లేకుండా పోయాయని, దీంతో పాటు వీడియోకాన్ డీ2హెచ్ వ్యాపారం టేకోవర్ వల్ల చిక్కుల్లో పడ్డామని వివరించారు. దీంతో పాటు చంద్ర కంపెనీ చెందిన కీలకమై జీ ఎంటర్‌టెయిన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్‌లో వ్యూహాత్మంగా కొన్ని వాటాలు విక్రయించాలనుకున్న కొన్ని అదృశ్యశక్తులు అడ్డుకుంటూ తమ ప్రయత్నాలకు గండికొడుతున్నాయని వివరణ ఇచ్చారు.



వనపర్తిలో డిజిటల్ విద్యకు టీటా శ్రీకారం

హైదరాబాద్ : తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) టెక్నాలజీని సంక్షేమ కార్యకలాపాల కోసం వినియోగించాలని తాజాగా నిర్ణయం తీసుకుంది. శనివారం నాడు కామన్ సర్వీస్ సెంటర్స్ (సీఎస్‌సీ)తో టీటా భాగస్వామ్యం చేపట్టింది. డిజిటల్ గావ్ అనే కార్యక్రమాన్ని వనపర్తి జిల్లాలోని రాజానగరం జిల్లాలో ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమాన్ని ఎంఎల్ఏ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డీ, వనపర్తి జిల్లా కలెక్టర్ శ్వేతా మొహంతిలో ప్రారంభించారు. వనపర్తి జిల్లాలోని పాఠశాలల్లో డిజిటల్ విద్యను నేర్పించాలని, జిల్లా కలెక్టర్ తెలంగణా ఐటి ప్రిన్సిపల్ కార్యదర్శి జయేష్‌రంజన్‌ను కోరడంతో ..రంజన్ టీటాను సంప్రదించి వనపర్తి జిల్లాలో డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టించారు.

సాయం చేసే గుణమే మన ఆభరణం

- రెడ్డిజనసంఘ్ సన్మానకార్యక్రమంలో స్పీకర్ పోచారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పేరు చివరన రెడ్డి అని పెట్టుకోవడానికి రెడ్లు గర్వపడాలని, సాయం చేసే గుణమే రెడ్లకు ఆభరణమని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. పోచారం స్పీకర్‌గా ఎన్నికైన నేపథ్యంలో హైదరాబాద్‌లో రెడ్డిజనసంఘ్ సన్మాన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించి అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. పేరు చివరన రెడ్డి అని పెట్టుకోవడానికి సిగ్గుపడాల్సిన పనిలేదని, రెడ్లు ఒకరికి ఇచ్చేవారే తప్ప చేయిచాపే వారు కాదన్నారు. మన చేయి ఎపుడూ పైనే ఉంటుంది తప్ప కింద ఉండదన్నారు. కొడుకు పేరు రెడ్డి అని పెడితే, మనవడి పేరు రెడ్డి అని పెడితే ఏమవుతుందోనని కొందరు అనుకుంటున్నారని, ఏమీ కాదని తలెత్తుకుని గర్వంగా బతకగలుగుతామన్నారు. సాధారణంగా రెడ్ల జనాభా తక్కువగా ఉన్నా రాజకీయాల్లో ఎపుడూ రెడ్లే ముందుంటారన్నారు. ప్రజాప్రతినిధులుగా ప్రస్తుత అసెంబ్లీలోనూ రెడ్లే అధికంగా ఉన్నారని, ఇతరులకు సాయం చేసే గుణమే రెడ్లకు ఆ అవకాశం కల్పిస్తున్నదన్నారు. ఎంతోమంది విద్యార్థులకు సాయమందిస్తున్న రెడ్డి జనసంఘం గర్వించదగ్గదన్నారు. లక్షా 25వేల కోట్ల ఆహారధాన్యాన్ని తెలంగాణలో రైతులు పండిస్తున్నారని, తెలంగాణలోని ఇతరులు ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తయితే గ్రామీణప్రాంతాల్లో మరింత ఆదాయం పెరుగుతుందన్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయిలో స్థిరపడిన తర్వాత సాయం చేసే గుణం ఉండాలన్నారు. ప్రజాప్రతినిధులు పేదవారి కోసం పాటుపడాలన్నారు. భూపాలపల్లిలో రైతు దగ్గర భూమి పట్టాకోసం లంచం అడిగితే ఆ పేదరైతులు అడుకున్నారని, అలాంటి వారిని క్షమించకూడదన్నారు.


'డిజిటల్ గావ్'తో వినూత్న కార్యక్రమాలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో డిజిటల్ విలేజ్ ద్వారా వినూత్న కార్యాచరణ అమలు కానుందని ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. అదివారం వనపర్తి జిల్లా రాజానగరం నుంచి డిజిటల్ గావ్ సేవలకు నిరంజన్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిటాతో తనకు ఇదివరకటి నుంచే సంబంధం ఉందన్నారు. వినూత్న ఆర్థిక అవగాహన కార్యక్రమం డిజిధాన్‌ను తానే ప్రారంభించినట్టు తెలిపారు. టిటాతో డిజిధన్ మేళాలో కూడా పాల్గొన్నట్టు తెలిపారు. డిజిటల్ గావ్ కార్యక్రమాన్ని ప్రారంబించటం సంతోషంగా ఉందన్నారు. వనపర్తిని డిజిటల్ గావ్‌లో ముందంజలో నిలపనున్నట్టు ప్రకటించారు. టిటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ కుమార్ మాట్లాడుతూ డిజిటల్ గావ్ రూపంలో సీఎస్‌సీతో పొత్తు పెట్టుకోవడం ప్రతిష్టాత్మకం అన్నారు. డిజిటల్ లిటరసితోపాటుగా మరిన్ని కార్యక్రమాలు చేయడానికి ఈ ఒప్పందం ద్వారా సాధ్యమవుతుందన్నారు. డిజిటల్ విలేజ్‌లలో డిజిటల్ సెంటర్‌లను తెలంగాణ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దత్తత గ్రామాలను మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ ఉపాధ్యక్షుడు రాజ్ కిశోర్ ,టిటా ప్రధాన కార్యదర్శి ఆశ్విన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : చాడ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా ఇప్పటికే వేలాది ఎకరాల్లోని మొక్కజొన్న, వేరుశెనగ వంటి పంటలకు తీవ్రనష్టం జరిగిందని ఆయన తెలిపారు. వేరుశెనగ పంటకు మొలకలు వచ్చే పరిస్థితి ఉందని, మరోవైపు మామిడి పూత రాలిపోవడంతో రైతులు పంటలను నష్టపోయారని ఆయన పేర్కొన్నారు. పంటల నష్టాన్ని అంచనా వేయడానికి రెవిన్యూ, వ్యవసాయాధికారులను క్షేత్రస్థాయికి పంపాలని ఆయన కోరారు. అలాగే నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరానికి రూ.20 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

సోషల్ మీడియాకు విశ్వసనీయతే గొంతుక



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సత్యం, విశ్వసనీయతే సామాజిక మాధ్యమాల గొంతుక అని భారతి వెబ్ సీఈవో మిలింద్ ఓక్ అన్నారు. భారత వ్యతిరేక శక్తులు మన సాంస్కృతిక విలువలను, చిహ్నాలను ధ్వంసం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు సోషల్ మీడియాను వేదికగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. సమాచార భారతి ఆధ్వర్యంలో విశ్వసంవాద కేంద్ర తెలంగాణ శాఖ నిర్వహించిన సోషల్ మీడియా సంగమం కార్యక్రమంలో మిలింద్ ఓక్ ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మీడియాలో మార్పులు వస్తున్నాయన్నారు. ఆడియో, వీడియో రూపంలో వ్యాప్తి చెందే సమాచారామే నేటి మీడియాకు ప్రధాన వనరుగా మారిందని చెప్పారు.సోషల్ మీడియాలో వార్తలు, సమాచారానికి సత్యం, విశ్వసనీయతతోనే ఆదరణ పెరుగుతోందని మిలింద్ తెలిపారు. సోషల్ మీడియా ద్వారా అందించే సమాచారం పరిశోధనాత్మకంగా ఉండాలని ప్రముఖ డేటా సైన్స్ నిపుణుడు గౌరవ్ ప్రధాన్ తెలిపారు. ఇతరులకు ఇబ్బంది కలిగించేలా సమాచార వ్యాప్తి మంచిదికాదని.. ఇందుకోసం నిర్వాహకులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

మార్పు కోసం... మీకోసం
సీఎం నవుతా

అమరావతి, ఆంధ్రప్రభ: వ్యవస్థలో మార్పుకోసం, మీకోసం, అవినీతి రాజకీయ ప్రక్షాళన కోసం ముఖ్యమంత్రినవుతా... రాజధాని లో జనసేన జెండా ఎగురవేస్తా,.. అమరావతిని స్వాధీనం చేసుకోవడానికి రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. గుంటూరు నుండి ఆయన ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఆదివారం సాయంత్రం గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డులోని జనసేన కార్యాలయం ప్రారంభించిన అనంతరం ర్యాలీగా లాడ్జి సెంటర్‌లో ఎల్ఈఎం హైస్కూలు మైదానంలో ఏర్పాటు చేసిన శంఖారావ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. అధికార టీడీపీ, విపక్ష వైకాపా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలపై పవర్ ఫుల్ పంచ్ డైలాగులతో ఆద్యంతం అభిమానులను ఉత్తేజ పరిచేలా ప్రసంగించారు. సుమారు గంట సేపు జరిగిన పవన్ కల్యాణ్ ప్రసంగంలో తానురాజకీయాల్లోకి ఎందుకు వచ్చానో, ప్రస్తుత రాజకీయ వ్యవస్థ, అధికార, ప్రతిపక్ష నేతల అవినీతి, వారసత్వం, కేంద్రంలో బీజేపీ విస్మరించిన విభజన హామీలు తదితర అంశాలపై విపులంగా ప్రసంగించారు. అంతేకాకుండా ఇప్పటి వరకూ జనసేన పోటీపై ప్రజల్లో నెలకొన్న సంధిగ్ధతకు స్పష్టతనిచ్చారు. జనసేన రాష్ట్రంలో ఎన్నికల బరిలోనిలుస్తుందని, త్రిముఖ పోటీ జరుగుతుందని తెలిపారు. గుంటూరు సభ నుండే తొలిసారిగా అభ్యర్థులను ప్రకటించడం విశేషం. అవినీతి రాజకీయాల్లో విసిగిపోయామని వారసత్వ రాజకీయాలతో అలసిపోయామని పేర్కొన్నారు.రాజకీయ వ్యవస్థ ప్రక్షాళన జరగాలన్నారు. డబ్బున్నవారికే రాజకీయాలు అనే విధానానికి చరమ గీతం పాడాలన్నారు. జగన్ 30 సంవత్సరాలు సీఎంగా ఉంటానని, చంద్రబాబు మళ్లీ తనే రావాలని, ఆ తరువాత మా బాబు రావాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల కలలను కల్లలు చేసిన నేతలను సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ ఎన్నికల్లో వారికి ప్రతికూల పరిస్థితులు తప్పవన్నారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో ఆ పార్టీలకు తెలియడం లేదన్నారు. పార్టీని నడిపేందుకు లక్షలాది కోట్లు అవసరం లేదని, ప్రజాభిమానం ఉంటే చాలన్నారు. ఈ వ్యవస్థను సంపూర్ణంగా మార్చడానికి యువత, మేధావులు ముందుకు రావాలన్నారు. తుది శ్వాస వరకు మీ అభిమానం కోసం, సమాజం కోసం, దేశం కోసం పనిచేయాలనే రాజకీయాల్లోకి వచ్చాన న్నారు. ప్రజలకోసం బలమైన పోరాటం చేస్తానన్నారు.

చంద్రబాబు... ఓ గజనీ

పీఎం అంటే జగన్‌కు భయం..బాబు గజనీ..అంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా గురించి మర్చిపోయిందని, చంద్రబాబుకు ఆ విషయం ఆర్నెళ్ళకు ఒకసారి గుర్తుకొస్తుందని ఎద్దేవా చేశారు. ఆయన్ను గజనితో పోల్చారు. వైకాపా అధినేత జగన్‌కు మోడీ అంటే భయమన్నారు. ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తామని పిలిస్తే వైకాపా నాయకులు కలిసి రావడం లేదన్నారు. హోదా కోసం ఉండవల్లి లో ఏర్పాటు చేసిన సభకు వైకాపా దూరంగా ఉండటాన్ని ఆయన తప్పుబట్టారు. ఉత్తరాది నాయకులు విభజన సమయంలో లోక్ సభలో వ్యవహరించిన తీరుపై పవన్ మండి పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌ను విభజించి సంతోషించిన ఉత్తరాది నాయకులకు తగిన శాస్తి జరగక తప్పదన్నారు. ఉత్తర ప్రదేశ్ నాలుగు ముక్కలు కాబోతుందని ఈ సందర్భంగా జోస్యం చెప్పారు. హోదా కోసం తెలుగువారి ఆత్మ గౌరవం ఢిల్లీలో దద్దరిల్లేలా జనసేన పోరాటం చేస్తుందని ప్రకటించారు. ఢిల్లీ నాయకుల వెన్నులో వణుకు పుట్టేలా కలిసి పోరాడదామంటూ పిలుపునిచ్చారు.

మాజీ ఐఏఎస్‌కు గుంటూరు ఎంపీ సీటు

గుంటూరు శంఖారావం సభలో పవన్ కల్యాణ్ పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించడం విశేషం. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం నుండి మాజీ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర రావు పోటీ చేస్తారని తెలిపారు. అలాగే తెనాలి అసెంబ్లీ నుండి మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ జనసేన నుండి బరిలో ఉంటారని ప్రకటించారు. అయితే, ఇటీవల టీడీపీ నుండి జనసేనలో చేరిన మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు ఎక్కడి నుండి పోటీ చేస్తారన్న అంశంపై మాత్రం స్పష్టత నివ్వలేదు. అయితే, ఆయన సతీమణి గతంలో పీఆర్పీ అభ్యర్థిగా తాడికొండ నుండి పోటీచేసినట్లు పవన్ పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి తోట చంద్రశేఖర్ పీఆర్పీ అభ్యర్థిగా గుంటూరు నుండి ఓటమి చెందారని, ఏలూరులో వైకాపా అభ్యర్థిగా ఓటమిపాల య్యారని, ఆయన ఓటమికి తానే కారణమని పవన్ చెప్పుకొచ్చారు. ఎక్కడైతే ఓటమి చెందారో అదే నియోజక వర్గం నుండే చంద్రశేఖర్ విజయం సాధించాలనే లక్ష్యంతోనే ఆయన్ను గుంటూరు జనసేన అభ్యర్థిగా బరిలోకి దింపుతున్నట్లు పేర్కొన్నారు. సభానంతరం ఎన్నికలకు సిద్ధమౌతున్నందుకు సంకేతంగా అభిమానులు అందజేసిన కత్తిని దూసి సభికులకు చూపించారు. సభ ఆసాంతం అభిమానుల హర్షధ్వానాలతో దద్దరిల్లింది.

విడిగా పోటీ పడదాం... హోదాపై కలిసి పోరాడదాం

- తెదేపా, వైకాపాలకు జనసేనాని పిలుపు
- కేంద్రాన్ని నిలదీద్దాం
- ఎన్ని పోరాటాలైనా చేద్దాం
- అమరావతిలో జనసేన జెండా ఎగరేస్తాం
- యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- తెనాలిలో నాదెండ్ల, గుంటూరు బరిలో తోట
- గుంటూరులో జనసేనాని పవన్ శంఖారావం



జనసేన కార్యాలయం ప్రారంభం

గుంటూరులో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జిల్లా కార్యాలయాన్ని పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ఆదివారం ప్రారంభించారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పార్టీ కార్యాలయానికి చేరుకున్న పవన్‌కల్యాణ్ కు పండితులు వేద మంత్రొచ్చారణలతో స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలో పూజలు నిర్వహించి, లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించి, పవన్‌కల్యాణ్‌ను ఆశీర్వదించారు. అనంతరం అధునాతన శైలిలో తీర్చిదిద్దిన నాలుగంతస్తుల నూతన కార్యాలయంలో ప్రతి అంతస్తును పవన్‌కల్యాణ్ పరిశీలించారు. గుంటూరు జిల్లా సమస్యల పరిష్కారాని కి ఈ నూతన కార్యాలయం వేదిక కావాలని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన ముఖ్య నేతలు నాదెండ్ల మనోహర్, తోట చంద్రశేఖర్, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, మాదాసు గంగాధరం తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

జోరు వానలోనూ బ్రహ్మరథం

అంతకముందు విజయవాడ నుంచి గుంటూరు పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి బయలు దేరిన పవన్‌కల్యాణ్ కాన్వాయ్ వెంట అభిమానులు పెద్ద సంఖ్యలో బైకులతో తరలివచ్చారు. జోరువానలో దారి పొడవునా కేరింతలు కొడుతూ జనసేనానికి స్వాగతం పలికారు. గుంటూరు నూతన కార్యాలయం వద్ద తమ అభిమాన నాయకుడిపై పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ కార్యకర్తలు,అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.కార్యకర్తలు , అభిమానులు భారీ ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఒక వైపు జోరున వర్షం కురుస్తున్నా అభిమానులు భారీ ఎత్తున జనసేనాని కాన్వాయ్ వెంట కదం తొక్కి, బ్రహ్మరథం పట్టారు.జనసేనాని కూడా దారిపొడవునా వాహనంలో నిలబడి అభిమానులకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. మహిళలు సైతం ఆయనకు ఘనస్వాగతం పలికారు. విద్యార్థులు, యువత సైతం పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో భాగస్వాములైంది.ఒక దిశలో వారిని కట్టడి చేయడం పోలీసులకు సైతం కష్టమనిపించింది. జోరున వర్షం వస్తున్నా కూడా జనసేనాని కార్యక్రమంలో పాల్గొని,అభిమానులకు భరోసా ఇస్తూ ముందుకు కదిలారు.

బీసీలకు బాబు వరాలు

- యాదవులకు ప్రత్యేక కార్పొరేషన్
- వాల్మీకి, బోయలకు ఎస్టీ హోదా
- అమరావతిలో రూ. 100కోట్లతో బీసీ భవన్
- జయహో బీసీ సభలో ఏపీ సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం, ప్రభన్యూస్: రాష్ట్రంలో బీసీలకు సబ్‌ప్లాన్ తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. తమది బి సిల ప్రభుత్వమని పేర్కొన్నారు. బిసిల్నుంచి తమనెవరూ వేరు చేయలేరన్నారు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి బిసి వర్గాలు తమ వెంటే ఉన్నాయన్నారు. ఆదివారం రాజమండ్రిలో తెలుగుదేశం నిర్వహించిన జయహో బిసి సదస్సులో ఆయన ముఖ్యఅతిధిగా ప్రసంగించారు. వెనుకబడ్డ వర్గాలకు న్యాయం చేసిన పార్టీ తెలుగుదేశం మాత్రమేనని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. బిసి నాయకులకు సముచిత స్థానం కల్పించింది కూడా తామేనన్నారు. ఉపముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి, ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, కింజరపు అచ్చన్నా యుడు వంటి పార్టీలో, ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరి స్తున్న వారంతా బిసిల వారేనన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా పార్టీ శాఖల అధ్యక్షులు కూడా బిసిలేనన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ పదవిని కూడా బిసిలకే ఇచ్చామన్నారు. 1987లోనే స్వర్గీయ ఎన్‌టిఆర్ స్థానిక సంస్థల్లో బిసిలకు 20శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టారన్నారు. 1997లో తాను దీన్ని 33శాతానికి పెంచానన్నారు. రాష్ట్రంలో, దేశంలో రాజ్యాధికారాన్ని నిర్ణయించే బిసిలు వెనుకబాటుకు



గురికావడాన్ని ముందుగా గుర్తించింది తెలుగుదేశం పార్టీయేనన్నారు. అందుకే వారికి తామధిక ప్రాధాన్యతనిచ్చామన్నారు. అందుకే మిగిలిన వారు పార్టీ మారినా బిసిలెప్పుడూ తెలుగుదేశం వెంటే ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 113కార్పొరేషన్లుంటే ఇందులో 91 ఛైర్మన్ పదవుల్ని బిసిలకే కేటాయించామన్నారు. అలాగే ఉపముఖ్యమంత్రి పదవితో పాటు 8మంది బిసిలకు మంత్రి పదవులిచ్చామన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా బిసిల ప్రాధాన్యత తగ్గించింద న్నారు. వైఎస్ అయితే వార్ని అణగదొక్కేశారన్నారు. తిరిగి తామధికారంలోకి రాగానే బిసిలకు ప్రాధాన్యత పెంచామన్నారు. ప్రస్తుతం హైకోర్టు లో బీసీ వర్గాలకు చెందిన 9మంది న్యాయమూర్తులుగా నియామకం కావడానికి తమ సిఫార్సులే కారణమన్నారు. అలాగే మరో 9మంది బిసి సామాజికవర్గీయులకు కీలకమైన పదవులప్పగించామన్నారు. బిసిలు ఆర్థికంగా మెరుగుపడ్డమే తమ ధ్యేయమన్నారు.

పోలీస్ శాఖలో కాగిత రహిత సేవలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రవ్యాప్తంగా పోలీసు శాఖలో కాగిత రహిత (పేపర్ లెస్) సేవలు అందుబాటులోకి రానున్నాయి. శాఖలో నిత్యం జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలు ఇకపై పేపర్‌లెస్ విధానంలో జరగనున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌గా యావత్ పోలీసు శాఖను ఆధునీకరిస్తున్న అధికారులు తాజాగా ఈ-ఆఫీస్ విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా పలు జిల్లాలు, కమిషనరేట్లలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఈ-ఆఫీస్ విధానం విజయవంతం కావడంతో అన్ని జిల్లాలు, కమిషనరేట్లలో దీనిని అమలులోకి తీసుకురావాలని అడ్మిన్ విభాగాల బాధ్యులకు రాష్ట్ర పోలీసు ముఖ్య కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఇక ఎలాంటి పేపర్‌లు వినియోగించాల్సిన పని లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి ట్యాబ్‌ల ద్వారా ఆయా సర్కిల్, సబ్ డివిజనల్, జిల్లా ఎస్పీ, డీఐజీ, ఐజీ, డీజీపీ వరకు ఆన్‌లైన్‌లో ఈ-ఆఫీస్ టూల్స్ ద్వారా క్షణాల్లో సమాచారం చేరే సౌలభ్యం ఉంది. డైలీ సిట్యూయేషన్ రిపోర్ట్ నుంచి బడ్జెట్ ప్రతిపాదనల వరకు ఇకపై పేపర్‌ని వినియోగించకుండానే ఈ-ఆఫీస్ టూల్స్ ద్వారా పంపుతారు. అదే విధంగా క్రైం డైరీ, కీలక కేసుల వివరాలు, ఫైల్స్, చార్జిషీట్లు తదితరాలను సైతం ఈ-ఆఫీసు ద్వారానే పంపేందుకు పోలీసు శాఖ యత్నిస్తోంది. పైలట్ ప్రాజెక్టుగా సిద్దిపేట, హైదరాబాద్ కమిషనరేట్లతో పాటు కామారెడ్, నాగర్ కర్నూల్, తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్, గ్రేహౌండ్స్ విభాగాల్లో ప్రారంభించారు. అది సక్సెస్ కావడంతో ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఈ-ఆఫీసు విధానం అమలుపర్చే విధంగా చర్యలు తీసుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు శాఖలో పలు సంస్కరణలను అమల్లోకి తెచ్చిన డీజీపీ మహేందర్‌రెడ్డి పోలీసు సేవలు మరింత వేగంగా ప్రజలకు చేరువయ్యేందుకు ఈ-ఆఫీస్ విధానం ఎంతగానో ఉపకరిస్తుంది. ఇప్పటివరకు డైలీ సిట్యూయేషన్ రిపోర్ట్స్ ఆయా ప్రాంతాల్లో కేవలం పేపర్లపై ప్రింట్ రూపంలో ఉన్నతాధికారులకు చేరేవి. ఇప్పుడు ఆ విధానం పోయి డైరెక్ట్‌గా ఈ-ఆఫీస్ టూల్స్ ద్వారా ఉన్నతాధికారులు ప్రతి సమాచారం చేరనుంది. ఈ విధానం ఇటు సిబ్బందికి ఉపయుక్తం కావడంతో పాటు క్షణాల వ్యవధిలో సమాచారం ఉన్నతాధికారులకు చేరనుండటంతో మరింత ప్రయోజనం ఒనగూరుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



వామపక్ష సైద్ధాంతిక గ్రూపుల సైబర్‌వార్


- టెక్నాలజీతోపాటే మారుతున్న వ్యూహం
- గత పదేళ్లలో తగ్గిన భౌతిక దాడులు..
- హ్యాకింగ్, డేటా చోరీతో వినూత్న ఎటాక్
- పాస్‌వర్డ్‌ల తస్కరణతో ప్రభుత్వ సంస్థలపై దాడి
- 2000-15 మధ్య కాలంలో మారిన పంథా
- అమెరికా, బ్రిటన్, కెనడా దేశాల్లో ఎక్కువ ప్రభావం

వాషింగ్టన్: లక్ష్యం విధంసమే.. కాకుంటే కార్యాచరణ విధానం మారింది.. సాంకేతికత విస్తృతి నేపథ్యమే ఇందుకు కారణం. ముల్లును ముల్లుతోనే తీయాలన్న సిద్ధాంతాన్ని వామపక్ష భావజాల గ్రూపులు అనుసరిస్తున్నాయి. సంప్రదాయ దాడుల వ్యూహాలను ప్రభుత్వాలు, నిఘా వర్గాలు ముందుగానే పసిగట్టి, దెబ్బతీస్తున్నందున, సైబర్ వ్యూహాలను ఆశ్రయిస్తున్నాయి. ఇటీవల కాలంలో భౌతికదాడుల కంటే సైబర్‌తీవ్రవాదం ఎక్కువైందని, జంతు హక్కులు, పర్యావరణ కార్యకర్తలు సైతం ప్రత్యర్థులపై ప్రత్యక్ష దాడులకు బదులు సైబర్‌దాడులకే మొగ్గు చూపుతున్నారని అమెరికాకు చెందిన ఓ పరిశోధనా సంస్థ అభిప్రాయపడింది. ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష భావజాల గ్రూపులు ఇదే తరహా ఆలోచనతో ముందుకెళ్తున్నట్లు తెలిపింది.

మిచిగాన్ యూనివర్సిటీ పరిశోధన ప్రకారం, తరచూ జరుగుతున్న సైబర్‌దాడులు అమెరికాలో భౌతిక దాడుల కంటే ఎక్కువ విధ్వంసాన్ని కలిగిస్తున్నాయి. దాడులకు అంతర్జాలం వేదికవుతున్నది అని మిచిగాన్ వర్సిటీ క్రిమినల్ జస్టిస్ ప్రొఫెసర్ థామస్ హోల్ట్ వెల్లడించారు. సైబర్ దాడుల క్రమాన్ని ఇప్పటికైనా అర్థంచేసుకునే ప్రయత్నం జరగాలి. ముప్పును పూర్తిస్థాయిలో ఇప్పుడే అర్థంచేసుకోలేకుంటే, భవిష్యత్తులో ఎదురయ్యే భారీ విధ్వంసాలను నివారిచడం సాధ్యంకాదు. తీవ్రవాదం, రాజకీయ హింస జర్నల్‌లో ప్రచురించబడిన విశ్లేషణ ప్రకారం, సైద్ధాంతిక తీవ్రవాద దాడులు వామపక్ష భావజాల సంస్థల భౌతిక దాడులను అధిగమించినట్లు తెలుస్తోంది. ఈతరహా దాడులను అర్థంచేసుకునేందుకు పరిశోధకులు ఎనిమల్ లిబరేషన్ ఫ్రంట్, ఎర్త్ లిబరేషన్ ఫ్రంట్, హ్యాకింగ్ సమ్మేళన సమూహాల సైద్ధాంతిక వ్యతిరేక సంఘటనల యొక్క పరిధిని, పెరుగుదలను, ప్రభావాన్ని విశ్లేషించారు. ఈ గ్రూపులు నేరుగా మానవాళికి హాని చేయాలని భావించడం లేదు. దీనికి బదులుగా జంతు, పర్యావరణ కార్యాచరణకు ప్రేరేపితులై తమ విశ్వాసాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ సంస్థలు, కంపెనీలపై పరోక్ష దాడికి మక్కువ చూపుతున్నారు. ఈ క్రమంలో దురదృష్టవశాత్తు, ప్రతిరోజు వినియోగదారుడు డేటా చౌర్యం, సమారదోపిడీలో చిక్కుకుంటున్నట్లు పరిశోధకులు నిర్ధారణకు వచ్చారు.

వ్యక్తిగత సమాచార దోపిడీతో విధ్వంసం

ఈవిధమైన సైద్ధాంతిక ప్రేరేపిత దాడులు వారి నమ్మకానికి వ్యతిరేకులైన వారిపట్ల భావోద్వేగ, ఆర్థిక సంబంధమైన ప్రభావాన్ని కలిగివుంటున్నాయి. అంతేకాకుండా అరెస్టులకు తక్కువ అవకాశం ఉండటం కూడా ఒక కారణం. ఉదాహరణకు ఏదైనా అంశానికి సంబంధించి మీరొక వెబ్‌సైట్‌ను సందర్శిస్తే, ఈ గ్రూపులు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి, వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని పోస్ట్ చేస్తున్నాయి. దీనివల్ల ఇటు కంపెనీలకు, వినియోగదారులకు భారీ నష్టం వాటిల్లుతుంది. హోల్ట్ అధ్యయనంలో భాగమైన ఈ తరహా వెబ్‌సైట్లలో డౌ కెమికల్స్ నుంచి అమెరికా ప్రభుత్వ సైట్ల దాకా, మాసం ఉత్పత్తి సంస్థల నుంచి ఫ్యాషన్ కంపెనీల దాకా బాధితులుగా ఉన్నాయి. హైప్రొఫైల్ ఇంటర్నెట్ సంస్కృతిలో ఈ సైద్ధాంతిక గ్రూపులు కృత్రిమ ట్రాఫిక్ సృష్టించి, దాడులకు పాల్పడుతుంటాయి. మీరొక వినియోగదారుడైతే, బాధిత కంపెనీ ఉత్పత్తిని కొనుగోలు చేసినట్లయితే హ్యాకర్లు మీ సమాచారాన్ని చౌర్యం చేస్తారు. వారి సైద్ధాంతిక నమ్మకాలకు వ్యతిరేకంగా వెళ్లే వారికి నష్టంవాటిల్లేలా చేస్తారు. మరొక విధానంలో ఈ గ్రూపులు ప్రభుత్వ సంస్థల పాస్‌వర్డ్‌లను బహిర్గతం చేయడం ద్వారా పెను విపత్తుకు కారణమవుతుంటాయి. ఈవిధమైన గ్రూపులు 2000-2015 మధ్య కాలంలో అమెరికా, బ్రిటన్, కెనడా దేశాల్లో భౌతిక, సైబర్ తీవ్రవాద దాడులకు పాల్పడిన ఉదంతాలు ఎక్కువగా ఉన్నాయి. తమ పరిశోధన ప్రారంభంలో కొన్నేళ్లు భౌతిక దాడుల సంఖ్య స్థిరంగా ఉండేది. కాలక్రమంలో వీటి సంఖ్య క్షీణిస్తూ వచ్చింది.



మా ఊరు - మా రాజ్యం

మాట తప్పితే ఆస్తి తీసుకోండి

సర్పంచ్ అభ్యర్థి వీలునామా హామీ



జఫర్‌గడ్, ప్రభన్యూస్ : వరంగల్ జిల్లా, జఫర్‌గఢ్ మండలంలోని తిడుగు గ్రామ పంచాయతీకి పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి జెట్టి రజిత ఆదివారం విలేఖరులు, గ్రామస్థుల సమక్షంలో ఎన్నికలలో ఇచ్చిన హామీని నెరవేర్చకుంటే తన ఆస్తిని గ్రామపంచాయతీ కార్యాలయానికి చెందే విధంగా స్టాంప్ పేపరుపై వీలునామాలు రాసిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులు తనను ఎన్నికల్లో గెలిపించినట్లయితే జనగామ జిల్లా కేంద్రం నుంచి వరంగల్ జిల్లా కేంద్రం నుంచి గ్రామానికి బస్సు సౌకర్యం, గెలిచిన మూడునెలల్లో ఆకేరు వాగుపై మంజూరైన బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని, అలాగే రైతుల కోసం దోస చెరువుల మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఒక పోస్టుమెన్, ఒక లైన్‌మెన్, ఒక గ్రంథాలయ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. అంతేకాకుండా ప్రతీరోజు ప్రతీ ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు చేపడుతూ గ్రామంలోని ప్రధాన సెంటర్లలో లైటింగ్ సిస్టం ఏర్పాటుతోపాటు ఎస్సీ కాలనీ వద్ద అంబేద్కర్ విగ్రహం, బొడ్రాయి వద్ద బీసీల ఆరాధ్యదైవమైన జ్యోతిరావు పూలే విగ్రహం, హనుమాన్ గుడి వద్ద తెలంగాణ తల్లి విగ్రహం, గ్రామపంచాయతీ ఆఫీసు వద్ద జాతిపిత మహాత్మగాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అన్నిచోట్ల గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయడానికి సైడ్ కాలువలు నిర్మాణాన్ని చేస్తానని తెలిపారు. గ్రామపంచాయతీ వినియోగించి ప్రతీ కాలనీలో సీసీరోడ్లు పూర్తి చేస్తానని పేర్కొన్నారు. తనను కత్తెర గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఆఖరి దశలో అమీతుమీ



• మూడోదశ పంచాయతీల్లో హోరాహోరీ • 3,529 పంచాయతీలు, 27,583 వార్డులకు ఎన్నిక

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో గత మూడు వారాలుగా సాగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. మూడు దశలుగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఇప్పటికే రెండుదశల ఎన్నికలు ముగిసిపోగా ఈనెల 30న మూడో దశలో4116 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ప్రకటించగా అందులో మంచిర్యాల్ జిల్లాలో మూడు పంచాయతీలకు , నిజామాబాద్ జిల్లాలో రెండు పంచాయతీలకు, కొమురంభీ ఆసీఫాబాద్, రాజన్న సిరిసిల్ల, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి, జనగాం జిల్లాల్లో ఒక్కొక్క గ్రామ పంచాయతీకీ నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో మొత్తం పది పంచాయతీల్లో సర్పంచ్ పదవులతోపాటు వార్డు స్థానాలకు ఎన్నికలను నిర్వహించటం లేదు. మిగిలిన వాటిలో 573 పంచాయతీల్లో సర్పంచ్ పదవులతోపాటు, వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఈనెల 30న చివరివిడత 3529 గ్రామ పంచాయతీల్లోనే ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్ పదవులకు మొత్తం 11,667మంది అభ్యర్థులు భరిలో నిలిచారు. చివరిదశలో మొత్తం 36,729 వార్డు స్థానాలకు ఎన్నికలు ప్రకటించగా అందులో 185 వార్డు స్థానాలకు ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదు. మిగిలిన వాటిలో 8956 వార్డు స్థానాలకు సింగిల్ నామినేషన్లతో ఎన్నికలు ఇక్కడ ఏకగ్రీవం అయ్యాయి. బుధవారం 27,583 వార్డులకు ఎన్నికలు జరగునుండగా 67,316మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

హోరాహోరీ పోరు

ఈనెల 30న పోలింగ్ జరగనున్న గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులతోపాటు వార్డు స్థానాలకు పోటీ పడుతున్న అభ్యర్థులు గెలుపే లక్ష్యగా పోరాడుతున్నారు. ప్రధాన పోటీదారులు ఎన్నికల్లో డబ్బును మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో ఓటుకు వెయ్యినుంచి రెండు వేల రూపాయలు క ూడా ముట్టచెప్పేందుకు వెనకాడటంలేదు. కొన్ని పంచాయతీల్లో కుల సంఘాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ టోకున మద్దతు పొందే ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలను ముందేసుకుని జాబితాలో పేర్లు ఉండి గ్రామం విడిచి విద్య ఉద్యోగ ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో ఉన్న ఉన్న వారిని ఓటు వేసేందుక ు రప్పించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. రానుపోను బస్ చార్జీలు కూడా భరించి వారికి అన్ని వసతులు సమకూరుస్తున్నారు. ఐదారు ఓట్లున్న కుటుంబాల వారికి పోటీలో ఉన్న అభ్యర్థులే ఏకంగా ప్రత్యేక వాహనాలు కూడా సమకూరుస్తున్నారు. గ్రామాల్లో చీకటి పడీ పడకముందే వర్గాల వారీగా డిన్నర్లు ఏర్పాటు చేసి ఓటర్లను ఖుషీ చేస్తున్నారు.

నేటితో ప్రచారాలు సమాప్తం

చివరి విడుత పంచాయతీల్లో అభ్యర్థుల ఎన్నికల ప్రచారాలు సోమవారం సాయంత్రానికి ముగియ నున్నాయి. పోలింగ్‌కు 48గంటల ముందే ఎన్నికల ప్రచారాలను ముగించాలన్న ఎన్నికల నిబంధనల అమలుపై అధికారులు గట్టి నిఘా పెట్టారు. బుధవారం ఉదయం ఏడుగంటలనుంచి పోలింగ్ ప్రారంబం కానుంది. మద్యాహ్నాం ఒంటి గంటకు పోలింగ్ ముగియనుంది. మద్యాహ్నాం రెండు గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి వెనువెంటనే ఫలితాలు ప్రకటించనున్నారు. ఉప సర్పంచ్ ఎన్నికలు కూడా అదే రోజు నిర్వహించనున్నారు.



ఓరుగల్లులో.. 446 పంచాయతీలకు పోలింగ్

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : పంచాయతీ ఎన్నికలు తుది దశకు చేరుకున్నాయి. నేటి సాయంత్రంతో ప్రచారానికి తెరప డనుంది. తొలి, మలి విడత ఎన్నికలలో టీఆర్ ఎస్ మద్దతుదారులే పైచేయి సాధించారు. మూడో విడతలో కూడా అవే ఫలితాలను సాధి స్తామనే దీమాతో గులాబీ శ్రేణులు ఉన్నారు. మూడో విడత పోలింగ్ బుధవారం జరగ నుంది. 558 పంచా యతీలకుగాను 112 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 446 పంచాయతీలకు ఎన్నికలను నిర్వహిస్తున్నారు.

ఏర్పాట్లు వేగవంతం..

అధికార యంత్రాంగం పోలింగ్ ఏర్పాట్లలో నిమగ్నమైంది. పోలింగ్ సిబ్బందిని విధిగా ఎన్నికల విధులలో పాల్గొనాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మంగళవారం పోలింగ్ సిబ్బందికి ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు, వాటికి సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లను అప్పగించనున్నారు. రేపు సాయంత్రానికి ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

తుద విడత ఎన్నికలు జరిగే 558 గ్రామ పంచాయతీల పరిధిలో పోలీసులు 144 సెక్షన్‌ను ప్రకటించారు. సోమవారం సాయంత్రం 5గంటల నుంచి గురువారం సాయంత్రం 6గంటల వరకు 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు.

సమస్యాత్మక గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టన లు జరుగ కుండా ముందస్తుగా అన్ని విధా లైన రక్షణపరమైన చర్యలను తీసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మావో యిస్టు ప్రాబల్యం కలిగిన పంచాయతీల పరిధిలో ముందుగానే కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఏరియా డామినేషన్ పార్టీలను ఏర్పాటు చేసి గ్రామాలను పూర్తిగా తమ ఆదీనంలోకి తెచ్చుకున్నారు. అలాగే సమ స్యాత్మక గ్రామాలలో గట్టి భద్రతా ఏర్పాట్లను చేస్తున్నారు.

ఆంధ్రా ఎడ్యుకేషన్ సొసైటీలో అవకతవకలు

ఢిల్లీలో తెలుగు ప్రజల ఆరోపణలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: దేశ రాజధానిలో నివసించేతెలుగువారి కోసం ఏర్పాటు చేసిన ఆంధ్రా ఎడ్యుకేషన్ సొసైటీ స్కూళ్లలో అవకతవకలు జరుగుతున్నాయంటూ తెలుగు ప్రజలు ఆరోపిస్తున్నారు. సొసైటీ నిర్వహిస్తున్న 7 పాఠశాలల్లో విద్యను పూర్తిగా వ్యాపారమయం చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం ఉదయం ఐటీవోలని ఆంధ్రా ఎడ్యుకేషన్ సొసైటీ ప్రధాన కార్యాలయం వద్ద తెలుగువారంతా ఆందోళన చేపట్టారు. తెలుగు రాష్ట్రాల నుంచి బదిలీపై ఢిల్లీ వచ్చేవారి పిల్లలతో పాటు, ఢిల్లీలో స్థిరపడిన తెలుగువారి పిల్లలకు మాతృభాష మర్చిపోకుండా విద్యాబోధన చేయడానికి ఉద్దేశించిన ఈ స్కూళ్లను వ్యాపార సంస్థలుగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోధనా సిబ్బంది నియామకాల్లోనూ తెలుగువారికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని, అన్ని అర్హతలున్నప్పటికీ తెలుగువారికి బదులు స్థానిక హిందీవారినే నియమించుకుంటున్నారని ఆందోళన చేస్తున్న వారిలో ఒకరైన మెండు చక్రపాణి ఆరోపించారు. సొసైటీలో పారదర్శకత రావాలంటే తెలుగువారికి సభ్యత్వం ఇవ్వాలని తాము చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ, తమ అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతో ప్రస్తుత యాజమాన్యం సభ్యత్వం ఇవ్వకుండా నిరాకరిస్తోందని ఆయనన్నారు. ఆంధ్రా స్కూళ్లలో చదవడం తెలుగువారి హక్కు అని, అలాంటి స్కూళ్లలో అడ్మిషన్ ఇవ్వకుండా ఎక్కువ డొనేషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వసూలు చేస్తున్న డొనేషన్లకు కూడా లెక్కాపత్రం లేదని విమర్శించారు. గతంలో ఈ అక్రమాలపై తాము ఢిల్లీ విద్యాశాఖ మంత్రి మనీష్ సిసోడియాకు ఫిర్యాదు కూడా చేశామని ఆయన తెలిపారు. సొసైటీకి వస్తున్న విరాళాలను పాఠశాలల అభివృద్ధికి వినియోగించాలని, అక్రమంగా జేబులు నింపు కోడానికి కాదని వ్యాఖ్యానించారు. స్వలాభం కోసం సొసైటీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్ తెలుగువారికి సభ్యత్వం ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

ఎర్రకోటలో ఆంధ్రా జానపదం

ఆకట్టుకున్న గరగల నృత్యం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారత్ పర్వ్ ఉత్సవాల్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వివిధ జానపద, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకుంది. జనవరి 26 నుంచి 31 వరకు జరిగుతున్న కార్యక్రమాల్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పీవీఎస్వీ కుమార్ బృందం ప్రదర్శించిన గరగలు జానపద నృత్యరూపకం కట్టిపడేసింది. కళాకారులు ప్రదర్శించిన వివిధ విన్యాసాలను తిలకించిన ప్రేక్షకులు చప్పట్లతో హర్షాతిరేకాలను వ్యక్తపరిచారు. ముఖ్య అతిధి గా హాజరైన ఢిల్లీ పోలీసు అదనపు కమిషనర్ చైతన్య కళాకారులను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఎన్నో రకాల జానపద కళలకు, లలిత కళలకు నెలవు అన్నారు. ఆ రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం పర్యాటక శాఖ చేస్తున్న కృషి ప్రశం సనీయమని కితాబిచ్చారు. ఢిల్లీలోని రాష్ట్ర పర్యాటకశాఖ నిర్వా హకులు రామ కోటయ్య ముఖ అతిథిని జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సమాచార కేంద్రం ప్రత్యేక అధికారి జయరావు, ఏపీ భవన్ ఓఎస్డీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై కపట ప్రేమ

చంద్రబాబుపై వైసీపీ నేత మార్గాని భరత్ విమర్శ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఎన్నికలు దగ్గర పడుతుండటంతో బీసీల ఓట్లకోసం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చూపుతున్న కపటప్రేమను బీసీలు నమ్మే పరిస్థితిలో లేరని రాజమండ్రి వైపీసీ సమన్వయకర్త మార్గాని భరత్ అన్నారు. ఆదివారం పార్టీ కేంద్రకార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో భరత్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబు బీసీలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి క ూడా నెరవేర్చలేదన్నారు . బీసీల ఓట్లు కావాలి కాని సీట్లు మాత్రం ఇవ్వరన్నారు. జన్మభూమి కమిటీలతో అట్టడుగు వర్గాలు నలిగిపోతున్నాయన్నారు. నవరత్నాలను కాపీ కొడుతున్న చంద్రబాబు గొప్పలు చెబుతున్నారని వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు బీసీలంతా ఓటుతోనే బుద్ధి చెబుతారని భరత్ హెచ్చరించారు.

జగన్‌తో దగ్గుబాటి భేటీ

•వైసీపీలో హితేశ్ చేరికకు లైన్ క్లియర్ • బీజేపీలోనే పురంధేశ్వరి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఎన్నికలు దగ్గర పడుతున్నకొలదీ ఏపీలో రాజకీయాలు చక చక మారిపోతున్నాయి. ఎన్టీఆర్ పెద్దల్లుడు మాజీ మంత్రి డా.దగ్గుబాటి వెంకటేశ్వరరావు తనయుడు హితేశ్ చెంచురాంను వెంటబెట్టుకుని ఆదివారం వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని లోటస్ పాండ్‌లోని ఆయన నివాసంలో కలిశారు. వారిని జగన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తాము వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలపగా జగన్ అందుకు ఆమోదం తెలిపారు . జగన్ ప్రకాశం జిల్లా పర్యటన సందర్భంగా భారీ ఎత్తున కార్యక్రమం ఏర్పాటు చేసి పార్టీలో అధికారికంగా ఎప్పుడు చేరేది త్వరలోనే వెల్లడించాలని సమావేశంలో నిర్ణయించారు. గతంలో తాను రాసిన పుస్తకాలను వెంకటేశ్వరావు ఈ సందర్భంగా జగన్‌కు అందచేశారు. సమావేశంలో ఎంపీ విజయసాయి రెడ్డి తోపాటు , ఒంగోలు మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురంధేశ్వరి బీజేపీలోనే..

రాజకీయాల్లో ఎవరి అభిప్రాయాలు వారికుంటాయని దగ్గుబాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. జగన్‌తో సమావేశం అనంతరం వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీతో కలిసి పయనించటానికే వచ్చామని , జగన్ కూడా సంతోషాన్ని వ్యక్తం చేశారన్నారు. అసెంబ్లీ టిక్కెట్టు కోసమే వచ్చారా అన్న ప్రశ్నకు పార్టీలో విధివిధానాల ప్రకారం టెక్కెట్ల కేటాయింపు ఉంటుందన్నారు .తాము పార్టీ ఆదేశాల ప్రకారం నడుచుకుంటామన్నారు. తన భార్య దగ్గుబాటి పురంధేశ్వరరి బీజేపీలో ఉన్న మాట వాస్తవమే అని, అయితే ఒకే కుటుంబంలో ఉన్నప్పటికీ ఎవరి అభిప్రాయాలు ,ఎవరి ఇష్టాలు వారివే అన్నారు. పురంధేశ్వరి పార్టీ మారరని , ఒకవేళ అవసరమైతే రాజకీయాలనుంచి సైలెంట్ అవటానికి ఆమె నిర్ణయించుకున్నారని తెలిపారు. రాజకీయాల్లో బిడ్డల అభిప్రాయం ప్రకారమే ఉండాలని ఏమీ లేదన్నారు. బీజేపీలోని పెద్దలు కూడా రాజకీయాల్లో కొనసాగాలని పురంధేశ్వరికి సూచించారని , అమె కూడా అదే నిర్ణయంతో ఉన్నారని లేనిపక్షంలో రాజకీయాల్లోంచి విరమించుకుంటారని ఇది తాము కుటుంబ పరంగా తీసుకున్న నిర్ణయం అని దగ్గుబాటి వెల్లడించారు. జగన్ మీడియా ఇంటర్వ్యూలు, ఆయన సుదీర్ఘ పాదయాత్రలు గమనిస్తున్నానని ,ఒక పార్టీని నడపడం ఎంత కష్టమో తనకు తెలియనిది కాదన్నారు.జగన్ కష్టానికి దేవుడు ఫలితాన్ని చూపిస్తారన్నారు. జగన్‌పై సృష్టిస్తున్న పుకార్లన్నీ ఒక పథకం ప్రకారం ప్రత్యర్థులు చేస్తున్నవే అన్నారు. అధికారంలోకి వస్తే జగన్ ప్రజలకు ఉపయోగపడే మంచిపనులు చేస్తారన్న విశ్వాసం ఉందన్నారు. ఏపీలో పాలన గాడి తప్పిందన్నారు. ప్రభుత్వ డబ్బుతో సీఎం చంద్రబాబు దీక్షలు చేయటం సరికాదన్నారు. ప్రభుత్వం వద్ద డబ్బులేదంటూనే కోట్లకు కోట్లు దీక్షలకు , జిల్లాల్లో మీటింగ్‌లకు ఖర్చు చేస్తున్నారన్నారు. బస్సుల్లో జనాన్ని సభలకు తెస్తూ ,టెంట్లు వేయిస్తూ కలెక్టర్లను ,ఎస్పీలను మీటింగ్‌లకోసమే పనిచేయిస్తున్నారన్నారు. అధికారులు తమ విధులు వదిలేసి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలకోసమే నెలలో పదిరోజులు పనిచేయాల్సి వస్తోందన్నారు. ఇప్పటిదాక రైతురుణమాఫీకి 4,5వ విడతల డబ్బులే ఇవ్వలేదని ఇక డ్వాక్రా మహిళలకు పోస్ట్ డేడ్ చెక్కులు ఇస్తామంటున్నారని ఇంతకంటే విచిత్రపాలన మరొకటి ఉండదని దగ్గుబాటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

పౌరసత్వ బిల్లుపై రాహుల్, హిమంత్ వాగ్యుద్ధం



గువహటి: పౌరసత్వ బిల్లు, ఈశాన్యంలో ఆందోళనలపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఈశాన్య బీజేపీ వ్యూహకర్త హిమంత్ బిశ్వా శర్మ మధ్య ట్విట్టర్ వేదికగా మాటలయుద్ధం జరిగింది. ఈశాన్య ప్రాంతంలో ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని రాహుల్ ఆరోపించారు. పౌరసత్వ సవరణ బిల్లుపై ట్విట్టర్‌లో ఆయన స్పందించారు. మతం, జాతిని ఆయుధాలుగా ఉపయోగించి బీజేపీ ఈశాన్యంలో హింస, అశాంతిని సృష్టించిందన్నారు. ఈశాన్యంలో పరిస్థితులపట్ల తాను కలత చెందానన్నారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు బీజేపీ ఈ ప్రయత్నాలు చేస్తోందని రాహుల్ ఆరోపించారు. ఇలాంటి రాజకీయాలు సరికాదన్నారు. ఈ రాజకీయాలను మానుకోవాలన్నాని శుక్రవారం ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కు హిమంత్ బిశ్వా శర్మ బదులిచ్చారు. రాహుల్ ఆత్రుత చూసి గాబరా పడ్డానన్నారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా ఈశాన్యం గొంతునొక్కుతున్న సంగతి తెలియదా అని ప్రశ్నించారు. తీర్పులు ఇవ్వొద్దని రాహుల్‌ను ఎద్దేవా చేశారు. ఆందోళనపట్ల ప్రజలతో తాము మాట్లా డుతున్నామన్నారు. ఎలాంటి మద్ధతులేకుండా కొంతమంది నకిలీ ఆందో ళనకారులు అల్లర్లు చేస్తున్నారన్నారు. ఈశాన్యం సురక్షితంగా ఉందని బదు లిచ్చారు. ఇదేవిషయమై ఓ బహిరంగ సభలో కూడా శర్మ మాట్లాడారు. తాను లౌకి కవాదినని నిరూపించుకునేందుకు ఎలాంటి సర్టిఫికెట్ అవసరం లేదన్నారు. హింద ువుల మధ్య గొడవపెడుతున్నారన్నారు. బంగ్లాదేశీ హిందువులను వ్యతిరేకిస్తున్న వారు అస్సాంలో అధికారాన్ని కోల్పోయారనే విషయం తెలియదా అని విమర్శించారు.

భాషా సంస్కృతులను కాపాడుకోవాలి

ఆంధ్రా అసోసియేషన్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్య పిలుపు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రపంచంలో ఎక్కడున్నా సరే మన మాతృభాషను, సంస్కృతి సాంప్రదాయాలను పట్టుదలతో కాపాడుకోవాలని భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో సేవా సంస్థలు ముందుకురావాలని ఉద్బోధించారు. ఢిల్లీ ఆంధ్రా అసోసియేషన్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యూఢిల్లీలోని లోఢిరోడ్‌లో ఉన్న అసోసియేషన్ భవనంలో కొత్తగా నిర్మించిన గోదావరి ఆడిటోరియంను వెంకయ్య నాయుడు ప్రారంభించారు. అనంతరం సభికులనుద్దేశించి మాట్లాడుతూ సేవలో దొరికే సంతృప్తి ఎందులోనూ దొరకదన్న వెంకయ్య నాయుడు, ఇదే మార్గంలో 84 సంవత్సరాలుగా ఢిల్లీలోని తెలుగు వారికి, స్థానికులకు సేవలు అందిస్తున్న ఆంధ్రా అసోసియేషన్‌ను మెచ్చుకున్నారు. ఢిల్లీలో తెలుగు ప్రజలకు సేవలు అందించేందుకు ఆంధ్రా అసోసియేషన్‌ను ప్రారంభించిన ప్రొ.ఎన్జీ రంగా, భారత మాజీ రాష్ట్రపతి డా.వరాహగిరి వేంకటగిరి, డా. అనంత శయనమ్ అయ్యంగార్, కొత్త రఘురామయ్య మరియు లక్ష్మి రఘురామయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు వంటి మహనీయుల ముందుచూపు చిరస్మరణీయమని గుర్తు చేసుకున్నారు. తెలుగు వారికి మాత్రమే కాకుండా, స్థానికులకు కూడా సేవలు అందిస్తున్న ఆంధ్రా అసోషియేషన్ వర్కింగ్ కమిటీ సభ్యులను అభినందించారు.


ఏ సంస్థ అయినా లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానికి అనుగుణంగా ముందుకు వెళ్ళడం, దశాబ్ధాల తరబడి కొనసాగించడం ప్రశంసించదగిన విషయమన్నారు. భాషనాగరికతను, సంస్కృతిని, ప్రజాజీవనాన్ని ప్రతిబింబిస్తుందని, భావాలను ఏకం చేసి భిన్నత్వంలో ఏకత్వం సాధించడానికి భాష దోహదం చేస్తుందని తెలిపారు. దేశ రాజధానిలో సేవలు అందిస్తున్న ఆంధ్రా అసోసియేషన్ లాంటి సంస్థలు ఈ విషయంలో చొరవ తీసుకోవాలన్న ఉపరాష్ట్రపతి నిజమైన భావ ప్రేరేపణ, ప్రగతి మాతృభాష ద్వారానే సాధ్యమౌతుందన్న గాంధీ మాటలను, మాతృభాషలో విద్యాబోధన వల్ల మనసులు చురుకుగా పని చేస్తాయన్న విశ్వకవి రవీంద్రుని మాటలను గుర్తు చేశారు.



విలువలతో విద్య

విద్యకు విలువల్ని జోడించాలని భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. న్యూఢిల్లీలోని పన్నాలాల్ గిరిధర్ లాల్ దయానంద్ ఆంగ్లో వేదిక్ కాలేజ్(పీజీడీఏవీ)వజ్రోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరైన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యాలయాలు విజ్ఞానం వివేకాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలని, విద్యాసంస్థలు శాంతి, సామరస్యం, వికాసాలకు కేంద్రబిందువులు కావాలని ఆకాంక్షించారు. ప్రతి వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, ఈ సమయంలో విద్యార్థుల మనసుల్లో సానుకూల భావనలను నింపేందుకు ప్రయత్నం చేయాలని అభిలషించారు. విద్యకు, వికాసానికి సంబంధం లేని కార్యక్రమాలను విద్యాలయాల్లో నిర్వహించడం ద్వారా ప్రతికూల ప్రభావం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించేందుకు ప్రస్తుత విద్యా విధానాన్ని భారతీయ చరిత్ర, వారసత్వం, సంస్కృతి, సంప్రదాయం విలువలతో పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల జీవిత విశేషాలను పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఉందని, కేవలం విద్యను మాత్రమే కాకుండా సంపూర్ణ వ్యక్తిత్వాన్ని నిర్మించేలా విద్యాభోధన సాగాలని సూచించారు.



ఓటాన్ అకౌంట్ బడ్జెట్

ప్రజాకర్షక పథకాల ప్రకటన?

గీత పరిమితి దాటుతుందా?



- బీజేపీ గెలుపుపై మదుపర్ల భరోసా ఎంత?
- గోయల్ ప్రసంగానికే పరిమితి అవుతారా?
- రైతుల కోసం పథకాలు ప్రకటించే ఛాన్సుందా?
- 2004 బడ్జెట్ మార్గదర్శకం అవుతుందా?

న్యూఢిల్లీ: ఎన్నికల ముందు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ప్రజాకర్షక పథకాల ప్రకటనలో ఎలాంటి పరిమితులను పాటించాలని, ఏ హద్దులను దాటాలి అన్నదే కేంద్ర ఆర్థికమంత్రి ముందున్న పరీక్ష. ఒకవేళ ఆర్థికశాఖ బాధ్యతలు స్వీకరించిన గోయల్ కనుక వోటాన్ బడ్జెట్‌లో రాజకీయ ప్రకటన చేయాలనుకుంటే, వాజ్‌పేయి ప్రభుత్వ హయంలో ఆర్థికమంత్రిగా పని చేసిన జస్వంత్‌సింగ్ ఉపన్యాసం మార్గదర్శిగా ఉపయోగపడవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నాటి జస్వంత్‌సింగ్ బడ్జెట్ ఉపన్యాసంలో తిరిగి ఎన్డీయే కూటమి ప్రభుత్వంలోకి వస్తే ఏమేం చేస్తామో చెప్పుకొచ్చారు. పన్ను మినహాయింపులు, పన్ను రాయితీల పరంగా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి విధానాలను అమలు చేయనుందో తన ఉపన్యాసంలో పేర్కొన్నారు.

సార్వత్రిక ఎన్నికల ముందు బడ్జెట్ ప్రవేశపెట్టే ఆర్థికమంత్రుల చేతులను కట్టి వేసినట్లుగానే ఉంటుంది. ఓటాన్ బడ్జెట్‌లో మూడు, నాలుగు నెలలకుగాను వ్యయానికి సంబంధించిన బడ్జెట్ తప్ప, మరే ఇతర పథకాలకు నిధులు కేటాయించడం, ప్రత్యక్ష పన్నుల్లో మార్పులు, చేర్పులు చేయడం విత్తమంత్రులకు సాధ్యం కాదు. అయితే పరోక్ష పన్నుల విధానంలో మార్పులపైన నాటి ఆర్థికమంత్రి జస్వంత్ సింగ్ కొంత చొరవ తీసుకోగలిగారు. అయితే ఈ విషయంలో ఇప్పటికే జీఎస్టీ అమల్లో ఉండడంతో నేటి ఆర్థికమంత్రికి పరిమితులు ఎక్కువగా ఉంటాయి. పరోక్ష పన్నుల్లో మార్పులు జీఎస్టీలోనే ప్రతిఫలిస్తాయి. జీఎస్టీలో మార్పులు, చేర్పులను జీఎస్టీ కౌన్సిల్ ద్వారానే చేపట్టాలి కాబట్టి, ఈ విషయంలో గోయల్ బడ్జెట్‌లో పెద్దగా చేసేదేమీ ఉండదంటున్నారు.

కొత్త పథకాలపై ఓటింగు ఉంటుందా?

ఓటాన్ బడ్జెట్ ఉపన్యాసంలో ఆర్థికమంత్రి మెరుపులు మెరిపించడమో లేదంటే దిగిపోతున్న ప్రభుత్వానికి సంబంధించిన రాజకీయ సందేశాన్ని వినిపించడమో చేయాలా అనే ప్రశ్న ఎదురవుతుంది. ఇక ఓటాన్ బడ్జెట్ ప్రక్రియలో ఉన్న పరిమితులు ఏంటీ అన్నది కూడా ఇక్కడ కీలకం అవుతుంది. ఎన్నికల సంవత్సరంలో కూడా ఆర్థిక శాఖ రానున్న ఆర్థిక సంవత్సరం మొత్తానికి బడ్జెట్‌ని సిద్ధం చేస్తుందని, దీనికి వర్తమాన సంవత్సరం వ్యయాన్ని ఆధారంగా తీసుకుంటారని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలోని పాత తరం చెబుతోంది. అయితే కొత్త ఆర్థిక సంవత్సరంలోని తొలి మూడు లేదా నాలుగు నెలల కాలానికి అయ్యే వ్యయానికే పార్లమెంటు ఆమోదముద్ర వేస్తుంది. ఈ సమయంలో ఏ కొత్త పథకాలు ప్రవేశపెట్టినా, లేదా ప్రత్యక్ష పన్నుల్లో మార్పులు చేసినా వీటిపై ఓటు నిర్వహించరు. ఓటాన్ బడ్జెట్‌లో వీటిని ప్రస్తావించినా, అవి ప్రభుత్వ ఉద్దేశ్యాలుగా మాత్రమే చూస్తారు తప్ప, ఆర్థికపరమైన కేటాయింపులు జరపలేరు. ఫిబ్రవరి ఓటాన్ బడ్జెట్‌లో వివిధ గణాంకాలను ఆర్థికమంత్రి ప్రస్తావిస్తారు. ఆర్థికలోటు, ఇతర లోట్లు, మిగుల నిధులు వంటివన్నీ ముందస్తు అంచనాలుగానే ఉంటాయి.

బీజేపీపై సడలని నమ్మకం!

అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం ఎదురు కావడంతో ఎన్డీయే కూటమిపై ఒత్తిడి పెరిగింది. రైతు సంక్షోభమే బీజేపీ కొంప ముంచిందనే అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో రైతులకు ఉపశమనం కలిగించే పథకాలను ఎన్నికల ముందు ఎలా అయినా బీజేపీ ప్రభుత్వం ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఎంత వరకు ఈ ప్రజాకర్షక పథకాలను ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించగలదన్నది ఒక ప్రశ్న అయితే, అది ఎంత సాధ్యమవుతుందన్నది కూడా కీలక ప్రశ్నగా ఉంటుందని ఆర్థిక రంగ నిపుణులు అంటున్నారు.

ఇక్కడ మరో కీలక పరిణామాన్ని కూడా ఎన్డీయే ప్రభుత్వం గుర్తించాలని నిపుణులంటున్నారు. గత డిసెంబర్‌లో రెండు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉర్జిత్ పటేల్ రిజర్వు బ్యాంక్ గవర్నర్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. రెండోది.. అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు. ఈ రెండు పరిణామాలు కూడా స్టాక్ ఎక్స్చేంజీపై ఎలాంటి ప్రతికూల ప్రభావాలను కలిగించలేకపోయాయి. బీజేపీ పనితీరుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న భారతీయ మదుపరుదార్లకు ఆ పార్టీ ఓటమి కానీ, పటేల్ రాజీనామా కానీ ఏమాత్రం కదిలించ లేకపోయాయి. అంచానాలు తారుమారు అయ్యాయన్న బాధ కూడా ఆ వర్గాల్లో మచ్చుకు కూడా కనిపించలేదు. పటేల్ రాజీనామాతో వెంటనే శక్తికాంత్ దాస్‌ను నియమించడంతో ఆర్బీఐకి, ప్రభుత్వానికి మధ్య ఘర్షణ తగ్గిపోయిందని అంటున్నారు.

బీమా కంపెనీల విలీనం ఉంటుందా?

- రూ. 4వేల కోట్లు కేటాయిస్తారా?
- విలీనంతో ప్రభుత్వ బీమా బలపడుతుందా?
- 2018 బడ్జెట్ ప్రసంగంలో విలీన ప్రతిపాదన
- ఓటాన్ బడ్జెట్‌లో నిర్ణయం తీసుకుంటారా?

న్యూఢిల్లీ: 2018 కేంద్ర బడ్జెట్‌లో నేషనల్ ఇన్సరెన్స్ కంపెనీని, ఓరియంటల్ ఇన్సురెన్స్ కంపెనీని, యునైటెడ్ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీలను కలిపేసే ప్రతిపాదన ఉంచారు. అయితే ఆ ఏడాది ఆర్థిక సంవత్సరం ఈ మూడు బీమా కంపెనీలను మిళితం చేసే ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఈ ఏడాది అయినా మోక్షం ఉంటుందా అని ఆర్థిక నిపుణులు ఎదురు చూస్తున్నారు. ఈ మూడు బీమా కంపెనీలను మిళితం చేయానికి రూ.4 వేల కోట్లు అవసరమవుతాయని ఆర్థిక మంత్రిత్వశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టే ఓటాన్ బడ్జెట్‌లో మూడు బీమా కంపెనీల విలీనం, దానికి అవసరమైన నిధుల కేటాయింపు ప్రస్తావన ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ దిశగా బడ్జెట్‌లో ప్రతిపాదించే నిధుల ఆధారంగా బీమా కంపెనీలకు విడివిడిగా కేటాయింపులు ఉండవచ్చని ఆశిస్తున్నారు. బీమా కంపెనీల ఆర్థిక బలోపేతానికి ఈ నిధులు దోహదపడతాయంటున్నారు.

నష్టాల కారణంగా, అధిక మొత్తాల్లో బీమా చెల్లింపుల వల్లనూ ప్రభుత్వ రంగంలోని బీమా కంపెనీలతో పాటు సాధారణ బీమా కంపెనీలు లాభాలు లేక తీవ్ర ఒత్తిళ్లకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్‌లో నేషనల్ ఇన్సురెన్స్ కంపెనీని, ఓరియెంటల్ ఇన్సురెన్స్ కంపెనీని, యునైటెడ్ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీలను మిళితం చేయాలని ప్రతిపాదించారు. ఈ మూడు ప్రభుత్వ రంగ బీమా కంపెనీలను మిళితం చేయాలని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రభుత్వ రంగంలో ఒకే బీమా కంపెనీ ఉండేలా చూడాలని ప్రతిపాదించారు. అదే ఆర్థిక సంవత్సరంలో మూడు బీమా కంపెనీలను మిళితం చేసే ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

మూడు కలిస్తేనే బీమా భీముడు!

మార్చి, 31, 2017 నాటికి ప్రభుత్వ రంగంలోని మూడు బీమా కంపెనీలకు కలిపి రెండు వందలకు పైగా బీమా ఉత్పత్తులున్నాయి. వీటి ప్రీమియం రూ.41,461 కోట్లుగా ఉంది. బీమా మార్కెట్‌లో వీటి వాటా అటుఇటుగా 35 శాతంగా నమోదైంది. ఇక ఈ మూడు బీమా కంపెనీల మొత్తం విలువ రూ.9,2 43 కోట్లుగా ఉండగా, ఉద్యోగులు 44 వేల మందితో దేశవ్యాప్తంగా ఆరు వేల కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. 2017లో ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ, జనరల్ ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీలు ఇంగ్లాండ్ మినహా మిగిలిన యూరోప్ దేశాల స్టాక్ఎక్స్చేం జీల్లో నమోదు అయ్యాయి. మూడు బీ మా కంపెనీలను మిళితం చేయ డం ద్వారా జీవిత బీమా కంనీ ఇన్సు రెన్స్ కంపెనీగా రూ.1.2 కోట్ల నుంచి 1.5 కోట్లతో అతి పెద్ద కంపెనీగా అవతరిస్తుం దని బీమా రంగ నిపు ణులు అ ం చ ్ నా వేస్తున్నారు.

ఆర్థిక లోటు తగ్గుతుందా?


- నిధుల మద్దతే మంచిదంటున్న బ్యాంక్ ఆఫ్ అమెరికా
- గ్రామీణ ప్రాంతాలపై దృష్టి పెడతారన్న విదేశీ బ్యాంకు
- జీడీపీలో 0.25 శాతం తేడా కూడా కీలకమేనా?
- రైతుల ఖాతాల్లో నిధుల జమ చేయనున్నారా?

ముంబై: 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఆర్థికలోటును 0.4 శాతం అధిగమించాలని లక్ష్యంగా పెట్టుకుంటే, దీన్ని రానున్న బడ్జెట్‌లో 3.5 శాతం లక్ష్యంగా నిర్దేశించుకొనే అవకాశముందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కీలకంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపైనే దృష్టి పెట్టే అవకాశమున్నట్లు విదేశీ స్టాక్ ఎక్స్చేంజ్ అంచనా వేస్తోంది. గత శుక్రవారం నాడు బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లించ్ విడుదల చేసిన నోట్‌లో ఇదే విషయాన్ని పేర్కొంది. ఒక్క 2015లో తప్ప మిగిలిన ఆర్థిక సంవత్సరాల్లో మోడీ ప్రభుత్వం ఆర్థిక లోటు అధిగమించడానికి పెట్టుకున్న లక్ష్యాలను ఛేదించలేకపోయిందని స్పష్టం చేసింది. గత ఏడాది నవంబర్ నాటికి జీఎస్టీ వసూళ్లు తగ్గడంతో, పెట్టుబడుల ఉపసంహరణ అనుకున్నస్థాయిలో జరగకపోవడంతో 115 శాతం రుణాలను మార్కెట్ నుంచి స్వీకరించిందని వెల్లడించింది. రూ. 80 వేల కోట్ల వరకు లోటు బడ్జెట్‌ను అధిగమించాలని లక్ష్యంగా పెట్టుకుంటే, ఇంత వరకు కేవలం రూ.15 వేల కోట్లే మాత్రమే సాధించింది. అయితే ఉన్న లోటును మొత్తానికి మొత్తంగా పూడ్చుకోవడానికి మార్కెట్ల నుంచి కేంద్ర ప్రభుత్వం రుణాలను స్వీకరించలేదని, ఆర్బీఐ వద్ద ప్రభుత్వ నిల్వలు మార్చి, 2018 నాటికి రూ.1.657 ట్రిలియన్లు మాత్రమే ఉన్నాయని పేర్కొంది.

చిన్న తేడా కూడా గండమే!

రాబోయే ప్రభుత్వం 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.5.,07 ట్రిలియన్లను రిజర్వుబ్యాంకు నుంచి తీసుకొనే అవకాశముందని బ్యాంక్ అమెరికా అంచనా వేస్తోంది. బడ్జెట్‌లో ఏర్పాటు చేసుకున్న లక్ష్యాన్ని మించి మార్కెట్ నుంచి రుణాలు తీసుకున్నప్పటికీ 2019 ఆర్థిక సంవత్సరంలో 3.3 శాతం లోటును పూడ్చుకోవాలని ప్రభుత్వం పదే పదే ప్రకటించడాన్ని బ్యాంక్ ఆఫ్ అమెరికా గుర్తు చేసింది. అయితే పెట్టుకున్న లక్ష్యం కన్నా 3.5 శాతం ఎక్కువే అయినప్పటికీ మధ్యకాలిక సగటు 4.3 శాతం కన్నా తక్కువేనని అభిప్రాయపడింది. జీడీపీలో 0.25-0.50 మధ్య తేడా కూడా ఆర్థిక వ్యవస్థ సామర్థ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందని పేర్కొంది. ఆర్థికలోటు పూడ్చుకొనే లక్ష్యాల కన్నా, ఈ పరిస్థితుల్లో సరిపడా నిధుల మద్దతు చాలా ముఖ్యమని బ్యాంక్ అమెరికా స్పష్టం చేసింది. 2020 ఆర్థికసంవత్సరంలో ఆర్బీఐ 26 బిలియన్ డాలర్ల ప్రభుత్వ బాండ్లను ఆర్బీఐ తిరిగి కొనడం అవసరమంది.

రైతే లక్ష్యంగా..!



సార్వత్రిక ఎన్నికల ముందు పార్లమెంటు ముందుకొస్తున్న బడ్జెట్‌లో గ్రామీణ సంక్షోభానికి పరిష్కారాలు ఇచ్చే దిశగా వడ్డీ తగ్గింపు లేదా మాఫీతో పాటు వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేయడం వంటి చర్యలు ఉంటాయని బ్యాంక్ ఆఫ్ అమెరికా జోస్యం చెప్పింది. ప్రత్యక్ష పన్నుల విధానంలో ఆర్థికమంత్రి ఎలాంటి మార్పులు, చేర్పులు చేయకపోవచ్చని, తీవ్రమైన ఆర్థిక సమస్యలతో బాధపడే రంగాలకు ఆసరా అందించాలని సూచించింది. సకాలంలో రుణాలు చెల్లించేరైతుల నాలుగు శాతం వడ్డీని మాఫీ చేయడానికి రూ.30 వేల కోట్లు అవసరమవుతుందని అంచనా వేసింది. రైతు ఆదాయానికి మద్దతుగా నేరుగా వారి ఖాతాల్లోనే డబ్బులు చేసే పథకానికి మరో రూ.70 వేల కోట్లు అవసరమవుతుందని బ్యాంక్ ఆఫ్ అమెరికా అంచనా వేస్తోంది.

విదేశీ వాహనాలపై డ్యూటీ పెంచాలి..

కేంద్ర ప్రభుత్వానికి సియామ్ విజ్ఞప్తి!

న్యూఢిల్లీ: విదేశాల్లోనే పూర్తిస్థాయిలో నిర్మితమైన వాణిజ్య వాహనాలపై కస్టమ్స్ డ్యూటీని నలభై శాతం పెంచాలని భారతీయ వాహనాల తయారీ సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. విదేశీ వాహనాలపై ప్రస్తుతం కేవలం 25 శాతమే కస్టమ్స్ డ్యూటీ ఉన్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో దేశీయ ఆటోమొబైల్ రంగం తన తరుపున కొన్ని కోర్కెలను ఆర్థిక మంత్రిత్వశాఖ ముందుంచింది. అయితే విదేశాల్లో పూర్తిగా తయారైన కార్లు, బైకుల విషయంలో కస్టమ్స్ డ్యూటీలో ఎలాంటి మార్పులు చేయవద్దని కోరింది. విదేశాల్లో పూర్తిస్థాయిలో తయారైన కార్లు, బైకులపై ప్రస్తుతం యాభై శాతం నుంచి వంద శాతం వరకు కస్టమ్స్ డ్యూటీ విధిస్తున్నారు. డబ్ల్యూటీఓలో భారత్ అంగీకరించినట్లుగా విదేశాల్లో పూర్తిగా తయారైన వాణిజ్య వాహనాలపై ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 40 శాతానికి పెంచాలని, అదే కార్లు, మోటార్ సైకిళ్ల విషయంలో యథాతథ స్థితి కొనసాగించాలని సియామ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సుగతో సేన్ ఒక ప్రకటనలో కోరారు.

అయితే పూర్తిగా నిర్మితం కాని వాహనాలపైనా, కొంత మేరకే నిర్మితమైన వాహనాలపైనా ఈ నలభై శాతం కస్టమ్స్ డ్యూటీ విధించరాదని సియామ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం పూర్తిగా నిర్మితం కానీ విదేశీ వాణిజ్య వాహనాలపై 15 శాతం నుంచి 30 శాతం కస్టమ్స్ డ్యూటీ వసూలు చేస్తున్నారు. ఆటో రంగంలో పరిశోధన, అభివృద్ధికి చేస్తున్న వ్యయంపై రెండు వందల శాతం తగ్గింపు ఉండాలని కోరింది. దేశంలో ఉద్గారాల విడుదల, సురక్షిత వ్యవస్థల అభివృద్ధిపై ఆటో రంగ పరిశ్రమ రానున్న సంవత్సరాల్లో గణనీయస్థాయిలో నిధులను వ్యయం చేయనున్న దృష్ట్యా పరిశోధన, అభివృద్ధికి కేటాయించే నిధుల విషయంలో ప్రభు త్వం ప్రోత్సా హకా లను ప్రకటిం చడం చాలా అవస రమని సేన్ అభిప్రాయపడ్డారు.



వైద్యానికి ప్రోత్సాహం...

ఓటాన్ బడ్జెట్ ముందు విజ్ఞప్తులు

న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగంలో స్టార్టప్ కంపెనీ లెట్స్‌ఎమ్‌డి ప్రోత్సాహాలను ప్రకటించాలని కేంద్ర ఆర్థికమంత్రిత్వశాఖను కోరింది. చిన్న పట్టణాలు, నగరాల్లో హాస్పిటల్స్ నెలకొల్పడానికి ఇన్సెంటివ్‌లను ఇవ్వాలని కోరింది. దీంతో పాటు వైద్య రంగంలో వైద్య బీమాను మరింతగా పెంచాలని విజ్ఞప్తి చేసింది. వైద్య సేవల వ్యయం పెరుగుతున్నా బీమా సదుపాయాలు వాటికి తగినస్థాయిలో లేవని పేర్కొంది. ఈ ఏడాది బడ్జెట్‌లో పట్టణాలు, నగరాల్లో హాస్పిటల్స్ నెలకొల్పడానికి ప్రోత్సాహకాలను ప్రకటించాలని లెట్స్‌ఎమ్‌డీ కంపెనీ కోరింది. ఈ రంగంలో వైద్యపరమైన మౌలిక సౌకర్యాల కల్పనకి తేలికపాటి రుణాలను అందించాలని కంపెనీ ఎండీ ఖండేవాల్ కోరారు. వైద్య సంరక్షణ పరిశ్రమకి ప్రాధాన్యత రంగ గుర్తింపు ఇవ్వాలన్నారు. ఆయుష్మాన్ భారత్, ఇతర ప్రభుత్వ వైద్య బీమా పథకాలను అమలు అయ్యే నాటికి వాటి ధరలను సహేతుంగా చేయకపోతే డిమాండ్, సప్లై మధ్య తేడా ఏర్పడుతుందని ఖండేవాల్ హెచ్చరించారు. దేశంలో మారుమూల ప్రాంతాలకు కూడా వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడానికి వీలుగా ఆర్థిక కేటాయింపులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ వైద్య బీమా పథకాల నుంచి చెల్లింపులు అలస్యం అవుతున్నందున రుణ గ్యారెంటీ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.



ట్రైన్ 18 ఇకపై... వందే భారత్ ఎక్స్‌ప్రెస్

న్యూఢిల్లీ: దేశంలో అత్యంత వేగవంతమైన రైలుగా గుర్తింపు పొందిన ట్రైన్-18ను వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌గా రైల్వేశాఖ నామకరణం చేసింది. మేకిన్ ఇండియాను ప్రస్ఫుటించేలా ఈ పేరు పెట్టినట్లు రైల్వే మంత్రి పీయూష్‌గోయల్ ఆదివారం ఒక ప్రకటనలో చెప్పారు. దేశ రాజధాని నగరం ఢిల్లీ నుంచి యూపీలోని వారణాసి మధ్య ఇది పరుగులు తీయనున్న ఈ రైలును ప్రధాని మోడీ త్వరలో జెండా ఊపి ప్రారంభించనున్నారు. 16 బోగీలు కలిగిన ఈ రైలు నిర్మాణ వ్యయం రూ. 97కోట్లు. 30 ఏళ్ల కిందటి శతాబ్ది ఎక్స్‌ప్రెస్ స్థానంలో స్పీడ్ ట్రైన్‌గా గుర్తింపు పొందిన ,వందే భారత్ ఎక్స్‌ప్రెస్ దేశంలోనే తొలి లోకోమోటివ్ రహిత రైలుగా నిలవనుంది. తొలుత దీనిని ట్రైన్-18గా పేర్కొన్నాం. ఇప్పుడు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌గా పిలవాలని నిర్ణయించామని గోయల్ చెప్పారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో దేశీయంగా అత్యుత్తమ రైలును నిర్మించొచ్చనేందుకు ఇదొక నమూనాగా నిస్తుందన్నారు. పూర్తి వాతానుకూలిత సౌకర్యంతో, కేవలం కాన్పూర్, అలహాబాద్ స్టేషన్లలోమాత్రమే ఆగుతూ ప్రయాణికులకు మరింత ఆహ్లాదకర అనుభూతిని ఇస్తుందని గోయల్ తెలిపారు.

మెట్రోకోచ్ టెక్నాలజీకి రూ. 150 కోట్ల టెండర్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మేకిన్ ఇండియా మెట్రో కోచ్‌ల నిర్మాణానికి మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీ (ఎంసీఎఫ్) కార్యాచరణ వేగవంతం చేసింది. 2021 నాటికి ఆధునిక కోచ్‌లను పట్టాలెక్కించాలని సంకల్పించింది. ఇందుకు అవసరమైన సాంకేతిక టెక్నాలజీ కోసం రూ. 150 కోట్ల విలువైన టెండర్లను ఆహ్వానించనుంది. డిజైన్, కోచ్‌ల నిర్మాణం, ట్రయల్ రన్, నిర్వహణ వంటి విభాగాల్లో సాంకేతిక బదలాయింపు ఈ టెండర్ ముఖ్య ఉద్దేశం. 28 ఫిబ్రవరి 2019 వరకు టెండర్లను ఆహ్వానిస్తామని, 2021 నాటికి తొలి కోచ్‌ను నిర్మిస్తామని రాయ్‌బరేలీలోని ఎంసీఎఫ్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఇలాంటి కోచ్‌లను రూ. 8-9 కోట్లకు దిగుమతి చేసుకుంటున్నామని, దేశీయంగా తయారుచేస్తే ఒక్కో కోచ్‌కు రూ కోటి వరకు ఆదా అవుతుందని అధికారులు తెలిపారు. ఎక్కువ సంఖ్యలో నిర్మిస్తే రూ. 4-6 కోట్ల రూపాయలకే అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ, బెంగళూరు, ముంబై, లక్నో, చెన్నై, నాగపూర్, పూణె, కొచ్చి, అహ్మదాబాద్, నొయిడా- గ్రేటర్ నొయిడా, హైదరాబాద్, జైపూర్, కోల్‌కతా, గురుగ్రామ్ తదితర నగరాల్లో దాదాపు 22 మెట్రో ప్రాజెక్టులు నిర్మాణదశలో ఉన్నాయి. ఏసీ, సీసీటీవీ, వైఫై వంటి ఆధునిక సౌకర్యాలతో దేశీయంగా తక్కువ వ్యయంతో నిర్మించొచ్చని ఎంసీఎఫ్ వర్గాలు తెలిపాయి. ప్రపంచంలో బాంబార్డియర్, ఆల్‌స్టామ్, కవాసకీ, మిత్సుబిషి వంటి కంపెనీలు ఈవిధమైన టెక్నాలజీలో ముందున్నాయి.





'యూరి' చిత్రాన్ని వీక్షించిన రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్

బెంగళూరు: యూరి..ది సర్జికల్ స్ట్రైక్ సినిమాను రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ యుద్ధవీరులతో కలిసి వీక్షించారు. బెంగళూరులోని బెల్లండూర్ సెంట్రల్ స్పిరిట్ మాల్‌లో ప్రత్యేక షోకు మాజీ సైనికులతో కలిసి రక్షణ మంత్రి హాజరయ్యారు. ఎట్టకేలకు యుద్ధవీరులతో కలిసి యూరి సినిమా చూశానంటూ సెంట్రల్ స్పిరిట్ మాల్‌లోకి వెళుతున్న ఓ వీడియోను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ట్విట్టర్ ద్వారా షేర్ చేశారు. ఆమె సినిమాహాల్‌లోకి వెళుతుండగా స్థానికంగా ఉన్నవారు భారత్‌మాతాకీ జై, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. ఈ దృశ్యాన్ని కూడా నిర్మాలా సీతారామన్ షేర్ చేశారు. సినిమాలో పాపులర్ లైన్ హౌస్ ది జోష్ అంటూ ఆమె ట్విట్‌లో పేర్కొన్నారు. అనంతరం మరో ట్వీట్‌లో హై జోష్ అంటూ ట్వీట్ చేశారు. యూరీ చిత్రాన్ని వీక్షించేందుకు వచ్చిన రక్షణ మంత్రి మాల్ దగ్గరున్న ప్రజలు, పిల్లలు సెల్ఫీలు తీసుకునేందుకు కూడా ఆమె అనుమతించారు. సినిమా పూర్తయిన తరువాత సినిమాలోని నటీనటుల అభినయాన్ని ప్రశంసిస్తూ మరో ట్విట్ చేశారు. 2016లో జమ్ము కాశ్మీర్ యూరి సెక్టార్లో సైనిక శిబిరంపై టెర్రరిస్టుల దాడికి ప్రతీకారంగా ఇండియన్ ఆర్మీ సెప్టెంబర్ 29న జరిపిన సర్జికల్ స్ట్రైక్ నిర్వహించింది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ దర్శకుడు ఆదిత్య దార్ యూరి చిత్రాన్ని తీశారు. కాగా యూరి చిత్రంలో విక్కీ కౌశల్, యామీ గౌతమ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు.

ఫిలిప్పీన్స్‌లో ఉగ్రదాడి 27 మంది మృతి

మనీలా: ఫిలిప్పీన్స్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. రోమన్ కేథలిక్ కేథడ్రల్ చర్చిని లక్ష్యంగా చేసుకుని ఆదివారం బాంబుపేలుళ్లకు పాల్పడ్డారు. ఈ ఉగ్రదాడిలో 27 మంది ప్రాణాలు కోల్పోగా మరో77మంది గాయపడ్డారు. పేలుళ్లలో మరణించిన 27మందిలో 20మంది పౌరులు, ఏడుగురు భద్రతా సిబ్బంది ఉన్నారు. గాయపడిన 77మందిలో 14మంది భద్రతాదళ సభ్యులు, ఇద్దరు పోలీసులు, 61మంది పౌరులు ఉన్నారని పోలీసులు వెల్లడించారు. జోలో ప్రాంతానికి చెందిన కేథడ్రిల్ చర్చి సమీపంలో రెండు బాంబుపేలుళ్లు జరిగాయి. ముస్లిం మిలిటెంట్లు ప్రభావం ఎక్కువగా ఉన్న జోలో ప్రాంతంలో ఉన్న కేథడ్రిల్ చర్చికి సమీపంలో మొదటి బాంబు పేలుడు జరిగింది. అనంతరం చర్చి ఆవరణలో మరో పేలుడు జరిగింది. వెంటనే ఘటనస్థలానికి చేరుకున్న భద్రతాబలగాలు దర్యాప్తు ప్రారంభించాయి. భద్రతాదళాలు క్షతగాత్రులను హెలికాప్టర్లలో జాంబోంగా నగరానికి వైద్యచికిత్స కోసం తరలించారు. ఉగ్రదాడిపై ఆ దేశ రక్షణశాఖ కార్య దర్శి డెల్ఫిన్ లోరెన్జా మాట్లాడుతూ ప్రజలు ప్రార్థన స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ ఘటనకు బాధ్యులమని ఏ ఉగ్రసంస్థ ప్రకటించలేదు.




నీతి ఆయోగ్ 2.0

- విజయ్ కేల్కర్ సారథ్యంలో ఏర్పాటుకు సన్నాహాలు
- రాష్ట్రాలకు నిధుల పంపిణీలో జవాబుదారీ లక్ష్యం
- ఆర్థిక అసమానతల నిర్మూలన కీలక బాధ్యత

న్యూఢిల్లీ: రాష్ట్రాలకు మూలధనం, రెవెన్యూ గ్రాంట్లు కేటాయింపు , జవాబుదారీతనం బాధ్యతల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం నీతిఆయోగ్ 2.0ని ఏర్పాటు చేయనుంది. ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ విజయ్‌కేల్కర్ కొత్తనీతిఅయోగ్ ఏర్పాటుకు సారథ్యం వహించనున్నారు. భారత నూతన ఆర్థిక ఫెడరలిజం దిశగా అనే పేరుతో కేల్కర్ విధివిధానాలు రూపొందిస్తారు. ప్రాంతీయ ఆర్థిక అసమానతల తొలగింపు సహా, పలు నిర్మాణాత్మక బృహత్తర లక్ష్యాల సాధనకు ఇది దోహదం చేస్తుంది. పాత ప్లానింగ్ కమిషన్ తరహాలోనే నూతన నీతి అయోగ్ ఉండాలని సూచించడం లేదని ప్రముఖ ఆర్థికవేత్త అయిన కేల్కర్ స్పష్టం చేశారు. ప్రాంతీయ అభివృద్ధి సమతుల్యత కోసం ప్లానింగ్ కమిషన్ స్థానంలో ఏర్పాటైన నీతిఅయోగ్ ఆశించిన లక్ష్యాలను చేరుకోలేక పోయిందన్నారు. రాష్ట్రాలకు అభివృద్ధి, పరివర్తన మూలధనం లేదా రెవెన్యూ గ్రాంట్ల కేటాయింపు అంశంలో నీతిఅయోగ్ 2.0 మరింత బాధ్యతగా, జవాబుదారీగా ఉంటుందని కేల్కర్ చెప్పారు. ప్రభుత్వంలో ఉన్నత నిర్ణాయక కమిటీ మాదిరిగా ఇది మరింత ప్రభావ వంతంగా ఉంటుంది. నూతన నీతిఅయోగ్ తొలి చైర్మన్ ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ శాశ్వత ఆహ్వానితుడై ఉండాలని కేల్కర్ సూచించారు. రాష్ట్రాల వార్షిక ఖర్చుల పద్దు ఆమోదం విషయంలో కొత్త నీతి అయోగ్ జోక్యం ఉండదని ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి కూడా అయిన కేల్కర్ చెప్పారు. రాష్ట్రాల మధ్య అభివృద్ధి అసమానతలను తొలగించేందుకు జీడీపీలో 1.5 నుంచి 2శాతం సుస్థిర గ్రాంట్లు కేటాయించాల్సిన అవసరం ఉంటుందని అభిప్రాయపడ్డారు. భారతదేశ ఆర్థికవ్యవస్థ ఇప్పుడు వృద్ధిబాటలో ఉంది. గత దశాబ్దాల్లో చైనా వంటి ఆసియా దిగ్గజదేశాలు సాధించిన అద్భుత వృద్ధికి ఇదేమంత భిన్నమైంది కాదు. గత మూడు దశాబ్దాల నుంచి ఇండియా నిలకడగా వృద్ధిరేటును సాధిస్తోంది. కీలక ఆర్థిక విధానాలను సమర్థవంతంగా రూపొందించేందుకు, అంతే సమర్థవంతంగా నిర్వహించేందుకు భారత ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనంగా లేదని ఇప్పటికే పలువార్లు నిరూపితమైందని కేల్కర్ అభిప్రాయపడ్డారు.






పెండింగ్ కేసులు 3.38 కోట్లు

- హైకోర్టులో 47.68 అపరిష్కృత వ్యాజ్యాలు
- ఒక్కో న్యాయమూర్తి ఎదుట 4500 కేసులు

న్యూఢిల్లీ: మౌలిక సదుపాయాల లేమి.. న్యాయమూర్తుల కొరత.. కారణమేదైనప్పటికీ న్యాయస్థానా ల్లో పెండింగ్ కేసులు అనకొండను తలపిస్తున్నాయి. కిందిస్థాయి కోర్టుల నుంచి హైకోర్టుల దాకా ఇదే పరిస్థితి. పర్యవసానం గా బాధితులు లేదా కక్షిదారులు న్యాయం కోసం ఏళ్లకుఏళ్లు నిరీక్షించాల్సి వస్తోంది. జాతీయ న్యాయశాఖ డేటా గ్రిడ్ గణాం కాలను బట్టి హైకోర్టుల నుంచి కిందికోర్టుల దాకా అపరిష్కృత కేసుల సంఖ్య 3కోట్ల పై చిలుకే. గతేడాది చివరి నాటికి జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 2.91 కోట్ల కేసులు, దేశంలోని 24 హైకోర్టు ల్లో 47.68 లక్షల కేసులు పరిష్కారం కోసం వేచివున్నాయి. ఈ యేడాది జనవరి నుంచి తెలంగాణ హైకోర్టుతో కలిపి మొత్తం హైకోర్టుల సంఖ్య 25కి చేరింది. ఇటీవల కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సుప్రీం చీఫ్ జస్టిస్‌కు లేఖ రాశారు. కింది కోర్టుల్లో న్యాయమూర్తుల నియామకాల ను భర్తీ చేయాలని కోరారు. అదే సమయం లో జ్యుడీషియరీ సిబ్బంది నియామకాన్ని వేగవంతం చేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేశారు.

- సగటున ఒక్కో హైకోర్టు జడ్జి ఎదుట 4419 కేసులు పెం డింగ్‌లో ఉన్నాయి. కింది కోర్టుల్లో ఈ సంఖ్య 1288గా ఉంది. కోర్టుల వారీగా మంజూరైన జడ్జీల సంఖ్య ఆధారం గా సగటు కేసులను లెక్కగట్టారు.
- కిందిస్థాయి కోర్టుల్లో మొత్తం జడ్జీల సంఖ్య 22,644. కానీ ప్రస్తుతం ఉన్నది 17, 509 మాత్రమే. ఇంకా 5135 మంది జడ్జీల నియామకం చేపట్టాల్సి వుంది.
- హైకోర్టు విషయానికొస్తే, కేటాయించిన జడ్జీల సంఖ్య 1079గా ఉండగా, ప్రస్తుతం విధుల్లో ఉన్నది 695 మంది మాత్రమే. మరో 384 ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది.

ప్రియాంకకు బైపోలార్ డిజార్డర్



న్యూఢిల్లీ: బీజేపీ నాయకుడు సుబ్రమణ్య స్వామి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీ నియామకమైన నేపథ్యంలో ఆమెపై ఘాటు విమర్శలు చేశారు. ప్రియాంక బైపోలార్ డిజార్డర్ వ్యాధితో బాధపడుతున్నారని.. ఈ వ్యాధి సోకిన వారు సంతోషంగా ఉన్నప్పుడు అతిగా స్పందిస్తూ.. బాధతో ఉన్నప్పుడు కుంగిపోతుంటారని మండిపడ్డారు. ప్రియాంక గాంధీ వ్యాధిని ప్రజలకు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని సుబ్రమణ్య స్వామి ఆరోపించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామకమైన ప్రియాంక గాంధీపై బీజేపీ విమర్శల దాడి చేస్తోంది. అవినీతిలో కూరుకుపోయిన రాబర్ట్ వాద్రా భార్యకు కాంగ్రెస్ కీలక బాధ్యతలప్పగించడం బీజేపీకే మేలని బీహార్ డిప్యూటీ సీఎం సుశీల్ కుమార్ విమర్శించారు. ప్రియాంక అందమైన ముఖం వచ్చే ఎన్నికల్లో ఓట్లు రాల్చబోదు అని బీహార్ మంత్రి వినోద్ నారాయణ్ విమర్శించారు.

ఓటేయకుంటే చింతించాలి

- ఓటు వేయడం పవిత్రమైన విధిగా భావించాలి
- ఎలక్షన్ కమిషన్ పనితీరు భేష్
- మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోడీ



న్యూఢిల్లీ: ఓటు వేయడాన్ని పవిత్రమైన విధిగా భావించాలని ప్రధాని నరేంద్ర మోడీ యువతకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోకపోతే చింతించాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మన్‌కీబాత్‌లో యువతకు సందేశమిచ్చారు. 21వ శతాబ్దంలో జన్మించిన వారు లోక్‌సభ ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు వేయబోతున్నారన్నారు. దేశానికి సంబంధించిన బాధ్యత యువత భుజాలపై ఉందన్నారు. దేశాభివృద్ధిలో యువత భాగం కావాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత, దేశం కలలను నెరవేర్చుకునే సమయం వచ్చిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటరుగా ఓటు వేయడం జీవితంలో భాగమని యువత తెలుసుకోవాలన్నారు. ఓటు వేయడం పవిత్రమైన విధిగా భావించాలని, ఈ భావం సహజంగానే రావాలన్నారు. ఓటువేయకపోతే దేశంలో చెడుకు కారణమవుతున్నామని భావించాలన్నారు. ఓటు వేయడం ఒక స్వభావంగా, ధోరణిగా, సంస్కృతిగా మారాలన్నారు. ఓటర్ల నమోదు అవగాహన తీసుకురావాలని సమాజంలోని ప్రముఖులను ఆయన కోరారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు యువత ఓటు నమోదు చేయించుకుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడికి తన హక్కులు, అవకాశాలను రక్షించుకునేందుకు దేశం ఓటు హక్కు ఇచ్చిందని తెలుసుకోవాలన్నారు.

మహనీయులను స్మరించుకుందాం

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న భారత ఎలక్షన్ కమిషన్‌ను ప్రధాని మోడీ ప్రశంసించారు. భారత గణతంత్ర దినోత్సవానికి ఒక్క రోజు ముందు జనవరి 25, 1950న ఎలక్షన్ కమిషన్ ఏర్పాటయిందిన గుర్తుచేశారు. భారత్‌లో జరుగుతున్న ఎన్నికలు ప్రపంచంలోనే గొప్పవని అన్నారు. ఎలక్షన్ కమిషన్ సామర్థ్యం, ఎన్నికలు నిర్వహిస్తున్న తీరు ప్రతి పౌరుడికి గర్వ కారణమన్నారు. ఎలక్షన్ కమిషన్ అధికారులు విధిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని, మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్లి విధులు కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నారని ప్రశంసించారు. స్త్రీ, పురుషుడు అనే వ్యత్యాసం లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోగలుగుతున్నారని, ప్రజాస్వామ్యం గొప్పతనమే దీనికి కారణమన్నారు. ఎన్నికలు సజావుగా సాగడానికి సహకరిస్తున్న అన్నీ రాష్ట్రాల ఎలక్షన్ కమిషన్, భద్రత, ఇతర సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు. ఖేలో ఇండియా గేమ్స్‌ను మోడీ ప్రస్తావించారు. ఆటలకు స్థానిక వసతులు సరిగా ఉన్నప్పుడే యువత ఉత్తమంగా రాణించగలుగుతుందన్నారు. నూతన భారత నిర్మాణం కేవలం పట్టణ వాసులపైనే ఆధారపడలేదన్నారు. ఒడిశా యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించిన సౌండింగ్ రాకెట్లు రికార్డులు సృష్టించాయన్నారు. జనవరి 30న మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా అమరులకు నివాళులు అర్పించాలని ప్రజలను ప్రధాని మోడీ కోరారు. ఫిబ్రవరి 19న రవిదాస్ జయంతి అని ఆయన గుర్తు చేశారు. మనిషి కులాలుగా విడిపోయాడని, మనిషిలోని మానవత్వం కనిపించకుండా పోయిందని రవిదాస్ పలికారని ప్రధాని గుర్తుచేశారు.

31 నుంచి బడ్జెట్ సమావేశాలు



న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. ఈనెల 31 వ తేదీ నుంచివచ్చేనెల13 వరకు బడ్జెట్ సమావేశాలు జరుగుతాయి. తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ఫిబ్రవరి 1న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో 30వ తేదీన లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహజన్, 31 తేదీన ఉదయం రాజ్యసభ చైర్మన్ వెంకయ్యానాయుడు ఆల్ పార్టీ సమావేశం నిర్వహించనున్నారు. మోడీ ప్రభుత్వానికి ఇవే చివరి బడ్జెట్ సమావేశాలు కావడంతో ఓటు బ్యాంక్ లక్ష్యంగా భారీ తాయిలాలు ప్రకటించే అవకాశముంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌గా చెప్పుకునే మధ్యంతర బడ్జెట్ ద్వారానే అన్నదాతకు మేలు కలిగించే ప్రకటన ఉండొచ్చని ఆర్థిక వేత్తలు విశ్లేషిస్తున్నారు.ఈ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రభుత్వం, ప్రతిపక్షాలు అస్త్ర, శస్త్రాలతో సిద్ధమౌతున్నాయి.లోక్‌సభలో గట్టెక్కి...రాజ్యసభలో అవాంతారాలు ఎదుర్కొంటున్న ట్రిపుల్ తలాక్ బిల్లుకు ఈ సమావేశాల్లోనే మోక్షం లభించేలా కేంద్రం కసరత్తు చేస్తోంది.

పోర్టబుల్ సెట్ టాప్ బాక్స్ వచ్చేస్తోంది..!



- సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి ట్రాయ్ కృషి
- ఈ ఏడాది చివరిలోగా అందుబాటులోకి..
- తీరనున్న వినియోగదారుల కష్టాలు..

న్యూఢిల్లీ: కేబుల్ ఆపరేటర్లు,డీటీహెచ్ కంపెనీలతో విసిగిపోతున్న ప్రజలకు శుభవార్త. మొబైల్ నెంబర్ పోర్టబిలిటీ లాగే సెట్ టాప్ బాక్స్ పోర్టబిలిటీ చేసుకునేలా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) చర్యలు ప్రారంభించింది. ఈ ఏడాది చివరలోగా సెట్ టాప్ బాక్స్ పోర్టబిలిటీని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ట్రాయ్ చైర్మన్ ఆర్‌ఎస్ శర్మ స్పష్టం చేశారు. టీవీ వీక్షకుల ప్రయోజనాల దృష్ట్యా ఈ విధానాన్ని అమలు చేసేందుకు కసరత్తును ప్రారంభించామన్నారు. టీవీ ఛానళ్లను ఎంపిక చేసుకునే వెసలుబాటు కల్పించిన ట్రాయ్.. సెట్ టాప్ బాక్స్ ల ఎంపికలోనూ ప్రజల అభిప్రాయానికి విలువనిచ్చే ఉద్దేశంతో ఈ చర్యలను ప్రారంభించింది. సెట్‌టాప్ బాక్స్‌ల పోర్టబిలిటీపై పనిచేస్తున్నా.. త్వరలోనే అది కార్యరూపం దాలుస్తుంది.అని ట్రాయ్ చైర్మన్ తెలిపారు.

ఇంటర్ ఆపరేటబిలిటీ సెట్ టాప్ బాక్స్‌ల ద్వారా పోర్టబిలిటీ సులువౌతుందన్నారు. డీటీహెచ్ ఆపరేటర్లు అందించేసెట్ టాప్ బాక్స్‌లు, కేబుల్ ఆపరేటర్లు అందించే సెట్ టాప్ బాక్స్ లు వేర్వేరుగా ఉండటంతో కొన్ని సమస్యలు ఎదురౌతున్నా.. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అలాంటి సెట్ టాప్ బాక్స్‌ల రూపకల్పనలో ఎన్నో సమస్యలు తలెత్తుతాయని ఫలితంగా వినియోగదారులకు ఛానళ్ల ప్రసారంలో అవాంతరాలు ఏర్పడవచ్చనే ప్రశ్నలను దేశంలోని అతిపెద్ద డీటీహెచ్ ప్రొవైడర్లు డిష్ టీవీ, టాటా స్కై ట్రాయ్ ముందుంచాయి. సెట్ టాప్ బాక్స్ తయారీదారులు కూడా పోర్టబుల్ బాక్స్‌లు అంత సులువుకావంటున్నారు. ప్రతీ కంపెనీ తమ సెట్ టాప్ బాక్స్ తయారీలో తమకు అనుకూలమైన సాఫ్ట్ వేర్‌ను ఇన్ స్టాల్ చేయిస్తుందని.... అలాంటి సెట్ టాప్ బాక్స్‌లను మార్చకుండా పోర్టబిలిటీ సాధ్యంకాకపోవచ్చని చెబుతున్నారు. ఇలాంటి అనుమానాలపై శర్మ స్పందిస్తూ.. మీరు మార్కెట్‌లో కొనే ఏ సెట్ టాప్ బాక్స్ అయినా కేబుల్ కంపెనీలతో సంబంధం లేకుండా ఉంటాయి కాబట్టి.. ఏ నెట్ వర్క్ ఎంచుకుంటే ..ఆ నెట్ వర్క్ సాఫ్ట్ వేర్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

భారంగా భరిస్తున్న వినియోగదారులు

హైదరాబాద్ లాంటి మహానగరాల్లో ఇల్లు మారడం ఓ ఎత్తయితే.. కేబుల్ కనెక్షన్ మార్చుకోవడం మరో ఎత్తౌతోంది. గతంలో ఉన్న ప్రాంతంలో అందించే సెట్ టాప్ బాక్స్ మారిన ప్రాంతంలో వర్కౌట్ కావడం లేదు. ఇదేంటంటే.. మీరుంటున్న ప్రాంతాల్లో ఈ నెట్ వర్క్ లేదని సమాధానం వస్తోంది. పాతసెట్ టాప్ బాక్స్‌తో పాటు రూ.1000 ఇస్తేగానీ కొత్త కనెక్షన్ ఇవ్వబోమని కేబుల్ ఆపరేటర్లు తెగేసి చెబుతున్నారు.

దీంతో చేసేదేం లేక.. వినియోగదారులు అదనపు డబ్బులు కట్టేస్తున్నారు. కేబుల్ ఆపరేటర్లతో విసిగిపోయి.. డీటీహెచ్ వైపు వెళ్లాలనుకుంటే.. హెచ్ డీ పేరుతో డీటీహెచ్ కంపెనీలు డబ్బులు దండుకుంటున్నాయి.. డిజిటలైజేషన్ పుణ్యమా అని డీటీహెచ్ సర్వీస్ కంపెనీలు ఇష్టమొచ్చిన రీతిలో రేట్లు పెంచేయడంతో రెన్యువల్ టైంలో చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రారంభంలో ఆఫర్ పేరుతో కనెక్షన్ ఇచ్చేసి.. ప్యాక్ రెన్యువల్ సమయంలో నిలువుదోపిడి చేస్తున్నారు.ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 160 మిలియన్ల టీవీ ఛానళ్ల సబ్‌స్క్రైబర్లు ఉండగా.. వారిలో చాలా మంది వారి సమీప కేబుల్ ఆపరేటర్ అందించే సర్వీస్‌తో లాక్ అయిపోయారు. ఇతర సర్వీసుల వైపు వెళ్లాలంటే వారికి డీటీహెచ్ మాత్రమే ఆల్టర్ నేటివ్ గా మారింది.

నేరపూరిత కేసుల్లో ఆధార్ చెల్లదు

న్యూఢిల్లీ: నేరపూరిత కేసుల్లో ఆధార్ కార్డులోని వివరాలను ఆధారంగా పరిగణించలేమని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. ఆధార్ కార్డు లోని పేరు, చిరునామా, పుట్టినతేదీ, జెండర్ వంటి వివరాలను కేవలం సందేహాల నివృత్తి పరిశీలనకే ఉపయోగించుకోవాలని పేర్కొంది. ప్రేమ పెళ్లి చేసుకున్న ఓ జంట తాము మేజర్‌లమని నిరూపించుకునేందుకు ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని చూపించారు. అయితే ఇద్దరి కార్డుల్లో సంవత్సరాలు వేర్వేరుగా..తేదీ మాత్రం జనవరి 1గా ఉంది. దీంతో యూఐడీఏఐని కోర్టుపూర్తి వివరాలివ్వాలని ఆదేశించింది. యూఐడీఏఐ ప్రాంతీయ అధికారి కోర్టు సమాధానమిస్తూ.. ఆధార్ సంఖ్య నమోదు సమయంలో వ్యక్తుల పూర్తి వివరాలు అందుబాటులో లేకుంటే.. వయస్సును సుమారుగా లెక్కకట్టి వేస్తారని తెలిపారు. పుట్టిన తేదీని మాత్రం డిఫాల్ట్‌గా జనవరి 1 అనే ఇస్తారని తెలియజేశారు. ఈ వివరాల నేపథ్యంలో ఆధార్ కార్డులోని వివరాలు నేరపూరిత కేసుల్లో సాక్ష్యాలుగా పనికిరావని ధర్మాసనం తీర్పునిచ్చింది.



ఒక్కటైన హార్దిక్-పారిఖ్

అహ్మదాబాద్: పటీదార్ ఉద్యమనేత హార్దిక్ పటేల్, తన చిన్ననాటి స్నేహితురాలు కింజల్ పారిఖ్‌ను వివాహం చేసుకున్నాడు. గుజరాత్ రాష్ట్రం సురేంద్రనగర్ జిల్లా ములి తాలుకాలోని దిగ్సర్ గ్రామంలో వీరి వివాహం ఘనంగా జరిగింది. హార్దిక్ కుటుంబ కులదైవమైన బహుచార్-మెల్డి మాతా ఆలయంలో జరిగిన ఈ వేడుకకు కేవలం 100 మంది అతిథులను మాత్రమే ఆహ్వానించారు. ఎటువంటి ఆర్భాటాలు లేకుండా చాలా సాదాసీదాగా వీరి వివాహ కార్యక్రమం జరిగింది. వివాహ అనంతరం దంపతులు హార్దిక్ స్వస్థలం విరంగ్రంకు వెళతారని సన్నిహితులు తెలిపారు. అహ్మదాబాద్ జిల్లా విరంగ్రం తాలుకా చందన్నగిరి గ్రామంలోని ఒకే ప్రదేశంలో చిన్ననాటి నుంచి హార్దిక్, కింజర్ కలిసి పెరిగారు. పెళ్లికూతురు కింజల్ పారిఖ్ కుటుంబం స్వస్థలం అహ్మదాబాద్ జిల్లాలోని విరంగ్రం. అయితే కొన్నాళ్ల కిందట సూరత్‌లో స్థిరపడ్డారు. విరంగ్రం పట్టణానికి కొద్దిదూరంలోని చందన్ నగరినికి చెందినవాడు హార్దిక్. ప్రస్తుతం గాంధీనగర్‌లో ఎల్‌ఎల్‌బీ చదువుతోంది పారిఖ్. చిన్ననాటి నుంచి వీరిద్దరు మంచి స్నేహితులు, ఒకరినొకరు ఇష్టపడటంతో పెళ్లికి ఇరు కుటుంబాల పెద్దలు ఓకే చెప్పారు.



తొలి షాట్‌కు క్లాప్ నివ్వగా...దర్శకులు సుకువూర్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకులు వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. వాల్మీకి సినిమాలో నటించే నటీనటులు, ఇతర వివరాలను త్వరలో చిత్ర యూనిట్ వెల్లడించనున్నారు.

ఈ చిత్రానికి సంగీతం - దేవీ శ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ - అయనంకా బోస్, కథ - కార్తీక్ సుబ్బరాజ్, స్క్రీన్ ప్లే - మధు, చైతన్య, ఆర్ట్ - అవినాష్ కొల్ల, ఎడిటింగ్ - ఛోటా కె ప్రసాద్, ఫైట్స్ - రామ్ లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - హరీష్ కట్టా, మాటలు, దర్శకత్వం - హరీష్ శంకర్.

వరుణ్‌తేజ్ వాల్మీకి

యువ కథానాయకుడు వరుణ్ తేజ్ హీరోగా దర్శకుడు హరీష్ శంకర్ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు వాల్మీకి అనే పేరును ఖరారు చేశారు. 14 రీల్స్ ఫ్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వాల్మీకి షూటింగ్ ప్రారంభోత్సవం హైదరాబాద్ రావూనాయుడు స్టూడియోలో ఘనంగా జరిగింది. నిహారికా కొణిదెల





కృతిసనన్



బెల్లంకొండ సాయిశ్రీనివాస్
కాజల్

తేజ సినిమా పేరు సీత

దర్శకుడు తేజ మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఒకప్పుడు చిన్న చిత్రాలతో సంచలన విజయాలను సాధించిన ఆయనకు చాలా ఏళ్లు హిట్స్ లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో మంచి హిట్ కోసం ఎదురుచూస్తూ వచ్చిన ఆయనకు నేనే రాజు...నేనే మంత్రి చిత్రం రూపంలో అది సాకారమైంది. ఆ తర్వాత వెంకటేష్ కాంబినేషన్‌లో చిత్రం సెట్స్‌పైకి రాకపోగా ఎన్టీఆర్ బయోపిక్ చిత్రం నుంచి తానే తప్పుకున్నారు. ప్రస్తుతం బెల్లంకొండ సాయిశ్రీనివాస్, కాజల్ జంటగా తేజ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలియంది కాదు. దీంతో మళ్లీ విజయాన్ని అందుకోవాలని అన్ని విషయాల్లో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు బెల్లంకొండ సాయిశ్రీనివాస్‌కు కూడా విజయం ఆవశ్యకమైంది. కథతో పాటు తేజపై నమ్మకంతో ఆయన ఈ చిత్రం చేస్తున్నారు. కాగా చిత్రీకరణ చివరిదశలో ఉన్న ఈ చిత్రానికి 'సీత' అనే పేరు పెట్టడంతో పాటు ఫస్ట్‌లుక్‌ను విడుదలచేశారు. సోనూసూద్, మన్నారా చోప్రా ఇతర ముఖ్యపాత్రధారులు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. ఛాయాగ్రహణం శీర్షసాయి. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కిషోర్ గరికపాటి, నిర్మాత రామబ్రహ్మం సుంకర, దర్శకత్వం తేజ.

మజ్ను అందరికీ నచ్చాడు

- దర్శకుడు వెంకీ అట్లూరి

అఖిల్ హీరోగా నటించిన కొత్త చిత్రం మిస్టర్ మజ్ను. యువత మెచ్చే ప్రేమ కథతో దర్శకుడు వెంకీ అట్లూరి ఈ సినిమాను తెరకెక్కించారు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన మిస్టర్ మజ్ను ప్రేక్షకాదరణ పొందుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ



అట్లూరి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. మజ్ను అందరికీ నచ్చాడని ఆయన చెబుతున్నారు. వెంకీ అట్లూరి మాట్లాడుతూ...నా రెండో చిత్రం కూడా విజయం సాధించడం సంతోషంగా ఉంది. అన్ని చోట్ల నుంచి మంచి స్పందన వస్తోంది. ద్వితీయార్థంలో హాస్య సన్నివేశాలకు నవ్వుతున్నారు. పరిశ్రమ నుంచి బాగుందని చెబుతున్నారు. బయట నుంచి కొంతమంది కాస్త విమర్శలు చేశారు. కొన్ని సమీక్షలు అక్కడక్కడా బాగా లేదని చెప్పాయి. ప్రేక్షకుల్లో మాత్రం అదేమీ కనిపించడం లేదు. తొలి ప్రేమకు నన్ను దర్శకుడిగా పొడిగిన సమీక్షలకు సంతోషించాను. ఈసారి వీటినీ మనస్ఫూర్తిగా తీసుకుంటున్నాను. నేను ఆలోచించిన పాత్రకు అఖిల్ పూర్తి న్యాయం చేశాడు. అనుకున్న దానికంటే బాగా నటించాడు. నాయిక నిధి అగర్వాల్‌కు తెలుగు రాకున్నా పాత్రను అర్థం చేసుకుని నటించింది. అఖిల్‌తో మరో సినిమా చేయాల్సి ఉంది. నాగచైతన్యతోనూ సినిమా చేస్తాను. ఎన్టీఆర్ చిత్రానికి దర్శకత్వం వహించాలనే ఆశ ఉంది. అయితే దానికి ఇంకా అనుభవం సంపాదించాలి. మంచి కథ సిద్ధం చేయాలి. మజ్ను కథకు ఏఎన్నార్ నటించిన ప్రేమ్‌నగర్ స్ఫూర్తినిచ్చింది. అందులోని కొన్ని అంశాలు తీసుకుని కథ సిద్ధం చేశాను. మైత్రీ మూవీస్‌కు ఓ సినిమా చేయాల్సి ఉంది. అయితే అది విజయ్ దేవరకొండతో ఉంటుందా అనేది చూడాలి. ఆయన్ను నేనింకా కలవలేదు. విజయం సాధించగానే అడ్వాన్సులు తీసేసుకుంటారు. నాకది ఇష్టం ఉండదు. వేరే వాళ్ల డబ్బు మన దగ్గర ఉండటం ఒత్తిడిగా భావిస్తుంటాను. అలా వాళ్లను వేచి చూసేలా చేయడం నచ్చదు. ఇక్కడ ప్రతి సినిమాతో కొత్తగా నిరూపించుకోవాల్సి ఉంటుంది. నేనా ప్రయత్నంలోనే ఉన్నాను. అందరు హీరోలతో మంచి చిత్రాలు చేయాలనుకుంటున్నాను. అన్నారు.

చిత్ర నిర్మాణం కష్టమే

నిర్మాతగా వ్యవహరించడం అన్నింటికన్నా కష్టమైన పనిగా చెబుతున్నారు అనిల్ కపూర్. ఈ బాలీవుడ్ నటుడు పన్నెండేళ్ల కిందట నిర్మాతగా మారారు. బదాయి హో బదాయి, మై వైఫ్ మర్డర్, గాంధీ, మై ఫాదర్ లాంటి ప్రేక్షకులు మెచ్చిన, పురస్కారాలు వరించిన చిత్రాలను నిర్మించారు. ఇటీవల వీరె దె వెడ్డింగ్, ఐషా, ఫానే ఖాన్, ఖుబ్ సూరత్ లాంటి చిత్రాలకు నిర్మాణ బాధ్యతలు వహించారు. ఇందులో తన కూతురు నాయికగా నటించిన చిత్రాలూ ఉన్నాయి. నటుడిగా కొనసాగుతూనే విభిన్నమైన కథలను నిర్మించే బాధ్యతలు తీసుకుంటున్నారు అనిల్ కపూర్. అయితే నటుడిగా కొనసాగడం కంటే చిత్ర నిర్మాణమే భారమైన పనిగా చెబుతున్నారాయన. అనిల్ కపూర్ మాట్లాడుతూ...నటన కంటే నిర్మాతగా ఎక్కువ కష్టపడుతుంటాను. మంచి కథను వెతకడం చాలా కష్టం. తర్వాత ఆ కథకు తగిన నటీనటులను ఎంపిక చేయాలి. ఒక్కోసారి నేను నిర్మించే చిత్రాల్లోనూ నటుడిగా తిరస్కరణకు గురవుతుంటాను. నిర్ణయాన్ని నేనైనా ఒప్పుకుని తీరాలి. మంచి కథకు సరిపోయే అన్ని హంగులు ఒక్కొక్కటిగా చేర్చుతుంటాం. అలా ఓ మంచి సినిమాకు నిర్మాణ క్రమం కొనసాగుతుంటుంది. అని చెప్పారు.



అనిల్ కపూర్

వైవిధ్యంగా చూపించాలి...!

హాస్య చిత్రాల్లో నాయికలు పేరు తెచ్చుకోవడం కష్టం. కానీ తాను ప్రయత్నించి చూస్తానంటోంది బాలీవుడ్ సుందరి కృతి సనన్. ఆమె ప్రస్తుతం వరుసగా మూడు హాస్య చిత్రాల్లో నాయికగా నటిస్తోంది. వీటిలో మొదటిది ఆయుష్మాన్ ఖురానా సరసన నటిస్తున్న లూకా చుప్పి కాగా...మిగతా రెండింటిలో అర్జున్ పాటియాలా, హౌస్‌ఫుల్ 4 చిత్రాలున్నాయి. మార్చి ఒకటిన లూకా చుప్పి విడుదలకు సిద్ధమవుతోంది. కృతి సనన్ నాయికగా నటించిన చిత్రాలేవీ ఈ ఏడాది విడుదల కాలేదు. స్త్రీ అనే చిత్రంలో మాత్రం ఆవో కభీ హవేలీ పే అనే ప్రత్యేక గీతంలో ఆడిపాడింది. ఏడాదంతా ఒక్క సినిమాలో లేదంటే ఆమెకు అవకాశాలు లేవని కాదు. కలంక్ అనే ప్రతిష్టాత్మక చిత్రంతో పాటు ఆమెవి ఐదు సినిమాలు ప్రస్తుతం చిత్రీకరణలో ఉండటం విశేషం. ఎక్కువగా హాస్య చిత్రాల్లో అవకాశాలు వస్తున్నాయని, అయితే తాను ఒక తరహా చిత్రాలకు పరిమితం కావాలనుకోవడం లేదని చెప్పిందీ భామ. కృతి సనన్ మాట్లాడుతూ...ఒక తరహా చిత్రాలే నాకు బాగుంటాయని ఎప్పుడూ అనుకోలేదు. నేను వరుసగా వినోదాత్మక చిత్రాల్లో నటిస్తున్నానని ఒప్పుకుంటాను. నా గత చిత్రం బరేలీ కి బర్ఫీ హాస్య చిత్రమే. అది విజయం సాధించడంతో నాకన్నీ అలాంటి చిత్రాలే వస్తున్నాయి. అయితే ఇవన్నీ వినోదాత్మక చిత్రాలైనా ఒకే తరహా కథలు కాదు. వేటికవి భిన్నమైనవి. నటిగా నేనూ ప్రతి చిత్రానికీ వైవిధ్యం చూపించాలి అనుకుంటున్నాను. ఈ సినిమాల్లో నటిస్తున్నప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను. పాత్రలూ అలాంటివే. కాబట్టి మరింత సహజంగా ఆ కథల్లో కనిపిస్తాను. అని చెప్పింది.

నార్త్‌లో నిల్ సౌత్‌లో ఫుల్




సన్నీలియోన్

నేటి ఆర్టిస్టులు ఎక్కడ అవకాశాలొస్తే అక్కడకు పరుగులు తీస్తున్నారు. కేవలం ఒక భాషకు చెందిన సినీరంగానికే పరిమితం కాకుండా దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందాన ముందుకు సాగుతున్నారు. తొలుత బాలీవుడ్‌లో పరిచయమై...అక్కడ పలు చిత్రాలలో నటించడంతో పాటు ఐటమ్ సాంగ్‌లలో కూడా ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్న సన్నీలియోన్ ఎప్పుడో దక్షిణాది సినిమాలలో నటించడం ఆరంభించిన విషయం తెలిసిందే. తెలుగులో కరెంట్‌తీగ చిత్రంలో ప్రత్యేక అతిథి పాత్రలో తళుక్కుమన్న ఆమె ఆ తర్వాత రాజశేఖర్ నటించిన గరుడవేగ చిత్రంలో ఓ పాటలో మెరిసింది. ఇప్పుడేమో తమిళ, మలయాళ చిత్రాల్లో నటించేందుకు అమితాసక్తిని కనబరుస్తోంది. ఇప్పటికే తమిళంలో వీరమాదేవి చారిత్రక కథాంశ చిత్రం టైటిల్ పాత్రలో నటిస్తూ....తన నట విశ్వరూపాన్ని ఆ పాత్రలో చూపిస్తానని చెబుతోంది. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న ఈ చిత్రాన్ని తెలుగు, మలయాళ, హిందీ భాషలలో కూడా విడుదల చేయబోతున్నారు. ఇక తమిళంలోనే విశాల్, రాశీఖన్నా నాయకానాయికలుగా రూపొందుతున్న అయోగ్య అనే చిత్రంలో ఐటమ్ సాంగ్‌లో నర్తించేందుకు ఆమె అంగీకరించినట్లు తెలిసింది. మరోవైపు మలయాళంలో కూడా ఆమె రెండు సినిమాలు చేస్తోంది. ఆ మధ్య కేరళకు వెళ్లినపుడు అక్కడి ప్రజలు తనపై చూసిన అభిమానానికి ఆమె ముగ్ధరాలైంది. మలయాళంలో అవకాశాలు వస్తే నటించడానికి తాను సంసిద్ధమేనని అప్పట్లో ప్రకటించింది కూడా. దాంతో మలయాళ చిత్రాలలో ఇప్పుడిప్పుడే ఆమెకు అవకాశాలు తలుపు తడుతున్నాయి. రంగీలా అనే చిత్రం ద్వారా తొలిసారి మలయాళ సినీరంగంలోకి ఎంట్రీ ఇస్తోంది. సంతోష్ నాయర్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం ఫిబ్రవరిలో ప్రారంభం కాబోతోంది. దీంతో పాటు మమ్ముట్టి కథానాయకుడిగా రూపొందనున్న మధుర రాజా అనే వేరొక చిత్రంలో ఐటమ్ సాంగ్‌లో నర్తించబోతోంది.

ఫన్నీ దొంగ ఏం చేశాడు?

ఫన్నీ దొంగ అయిన గోవిందుకు ఓ లక్ష్యం ఉంటుంది. దాని సాకారం కోసం అతను ఏం చేశాడు? అన్నది తెలుసుకోవాలంటే వజ్ర కవచధర గోవింద సినిమా చూడాల్సిందే అంటున్నారు సప్తగిరి. ఫన్నీ దొంగగా ఆయన నటిస్తున్న సినిమా వజ్ర కవచరధర గోవింద. అరుణ్‌పవార్ దర్శకత్వం వహిస్తు న్నారు. శివ శివమ్ ఫిలిమ్స్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు అరుణ్‌పవార్ మాట్లాడుతూ, లోగడ సప్తగిరితో నేను రూపొం దించిన సప్తగిరి ఎక్స్‌ప్రెస్ చిత్రం ఎంత మంచి విజయం సాధిం చిందో అందరికీ తెలిసిందే. ఈ చిత్రం అంతకుమించి సక్సెస్ కావాలని కోరుకుంటున్నాం. సినిమా చాలాబాగా వస్తోంది. సప్తగిరి నుంచి ప్రేక్షకులు ఏం ఆశిస్తారో ఆ అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి. సప్తగిరి వ్యవహారిక శైలికి అన్నివిధాల సరిపోయే కథ ఇది. దీనికి అనుగుణంగానే టైటిల్‌ను పెట్టాం. కడుపుబ్బా నవ్వించే అంశాలతో పాటు ఆకట్టుకునే యాక్షన్, ఎమోషన్, ఇతర వాణిజ్య అంశాలు ఈ చిత్రంలో మెండుగా ఉంటాయి అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ, చిత్రం షూటింగ్ 80 శాతం పూర్తయింది. మిగిలిన సన్నివేశాలను కర్ణాటకలోని ఒక గుడిలో తెరకెక్కిస్తాం. మా చిత్రానికి చాలా కీలకమైన ఎపిసోడ్స్‌ను పదిరోజుల పాటు ఆ దేవాలయంలో చిత్రీకరిస్తాం అని చెప్పారు.

వైభవీ జోషీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో అర్చనా వేద, టెంపర్ వంశీ, అప్పారావు, అవినాష్, రాజేంద్ర జాన్ కొట్టోలి, వీరేన్ తంబిదొరై తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కథ: జి.టి.ఆర్‌మహేంద్ర, సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: ప్రవీణ్ వనమాలి, ఎడిటింగ్: కిషోర్ మద్దాలి.



సప్తగిరి

ఈ మధ్య వచ్చిన ప్రేమకథలకు భిన్నంగా




రవిచంద్ర, సుమయ కథానాయకులుగా పరిచయమవుతున్న చిత్రం ఈ2 మనసులు. ఆది పినిశెట్టి దర్శకుడు. శేఖర్ మూవీస్ పతాకంపై చంద్రశేఖర్ ఎస్. నిర్మించిన ఈ చిత్రం చిత్రీకరణ 70 శాతం పూర్తయింది. చివరి షెడ్యూల్ ఫిబ్రవరిలో జరుపుకోనున్న ఈ చిత్రం సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ చిత్రం టీజర్, సాంగ్‌ను విడుదలచేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, తమ్ముడు సత్య నాకెంతో సహకారాన్ని అందించారు. ఇది ఓ ప్రేమకథ. అందరికీ నచ్చేలా ఉంటుంది అని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ, నటీనటులు, సాంకేతిక నిపుణులు కొత్తవాళ్లయినా సినిమాను తీర్చిదిద్దుతున్న విధానం ఎంతో బావుంది. కథ సిద్ధం అయ్యాక మేం చాలామంది పెద్ద హీరోల వద్దకు వెళ్లి అడిగితే...ఎవరూ మాకు డేట్స్ ఇవ్వలేదు. దాంతో అందర్నీ కొత్తవాళ్లను ఎంపిక చేసుకున్నాం మంచి అభిరుచితో మేము సినిమాలను తీయాలని నిర్ణయించుకున్నాం అని చెప్పారు. హీరో రవిచంద్ర మాట్లాడు,తూ, ఈ మధ్య వచ్చిన ప్రేమకథలకు చాలా భిన్నంగా ఉంటుందీ చిత్రం. నాతో పాటు మా అందరి నుంచి కావాల్సిన నటనను దర్శకుడు రాబట్టుకున్నారు అని చెప్పారు.

ఇంకా ఈ చిత్రంలో రంగి, మహేష్, కాదంబరి కిరణ్, తిరుపతి, జావెద్, సతీష్, కిరణ్, మౌనిక, జనతాసురేష్, పూజానాయుడు తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కెమెరా: నందన్‌కృష్ణ, సంగీతం: వి.ఎం.గౌతమ్, ఎడిటింగ్: ఎన్.మల్లేష్‌బాబు, ఆర్ట్:రామ్‌రమేష్,

క్రీడాప్రభ

ఇదేనా గౌరవం..?

- హాకీని పరిచయం చేసింది మా నాన్నే..
- మూడు సార్లు భారతరత్నకు తిరస్కరణ
- ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు
- మేజర్ ధ్యాన్‌చంద్ కుమారుడు అశోక్ కుమార్



న్యూఢిల్లీ: యూపీఏ ప్రభుత్వం, ప్రస్తుతం ఎన్‌డీఏ సర్కార్ తన తండ్రి మేజర్ ధ్యాన్‌చంద్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, భారత రత్న ఇవ్వాలని కోరుతున్నా మూడో సారి కూడా తిరస్కరించడం బాధాకరమని అశోక్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. 2013, క్రీడా విభాగంలో సచిన్ టెండూల్కర్‌కే భారత్ రత్న ఇచ్చారని, ఇప్పటి వరకు ఎవరినీ గుర్తించలేదని అన్నారు. ఈ ఏడాది మాజీ రాష్ట్రపతి, జన్ సంఘ్ నేత ప్రణబ్ ముఖర్జీ, సామాజిక కార్యకర్త నానాజీ దేశ్‌ముఖ్, భుపెన్ హజారికాకు భారత రత్న ప్రకటించిన విషయం తెలిసిందే. యావత్ ప్రపంచం హాకీ రంగంలో తన తండ్రికి మంచి గుర్తింపు ఉందని, భారత్‌తో పాటు యూకే, నెదర్లాండ్‌లో కూడా విగ్రహాలు పెట్టారని గుర్తు చేశారు. బీజేపీ అయినా కాంగ్రెస్ అయినా తన తండ్రి చేసిన సేవలను గుర్తు పెట్టుకోవడం లేదన్నారు. తన జీవితం దేశ క్రీడల కోసం అంకితం చేశాడని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులందరూ ధ్యాన్ చంద్‌కు భారత రత్న ఇవ్వాలని కోరుకుంటున్నారని, కానీ ఏ ప్రభుత్వం దీన్ని గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రత్న కేటాయించడం అంతా రాజకీయం అయ్యిందని, 1928, 1932, 1936 ఒలింపిక్స్‌లో హాకీలో బంగారు పతకాలు సాధించి పెట్టారని అన్నారు. ధ్యాన్ చంద్‌కు భారత రత్న ఇవ్వాలంటూ మాజీ మంత్రులు అజయ్ మాకెన్, జితేంద్ర సింగ్, విజయ్ గోయల్‌లు ప్రతిపాదించారు. 2016లో దీనిపై మాజీ ఒలింపిక్ విజేతలు పెద్ద ఎత్తు ఆందోళనలు కూడా చేశారని, 2011లో 80 మందికిపైగా ఎంపీ లు డిమాండ్ చేశారని అన్నారు. ధ్యాన్‌చందకు ఎప్పుడో భారత రత్న ఇవ్వాల్సింది అని ఒలింపియన్ క్రీడాకారుడు షేర్‌ఖాన్ అన్నారు.

సర్ఫరాజ్‌పై ఐసీసీ వేటు

- నాలుగు మ్యాచ్‌ల నిషేధం



దుబాయ్ : దక్షిణాఫ్రికా క్రికెటర్ ఆండిలె ఫెలుక్వాయోపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేసిన పాకిస్థాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ సర్ఫరాజ్‌కు ఐసీసీ షాక్ ఇచ్చింది. దీన్ని తీవ్రంగా పరిగణిస్తూ నాలుగు మ్యాచులు నిషేధించింది. అయితే దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ ఇంకా రెండు మ్యాచులు ఆడాల్సి ఉంది. ఇందులో సర్ఫరాజ్‌ను పక్కనపెట్టారు. ఫిబ్రవరి 1 నుంచి ఆరంభమయ్యే టీ20 సిరీస్‌లోని రెండు మ్యాచులు ఆడలేడు. రెండు వన్డేలు, రెండు టీ20 మ్యాచులకు సీనియర్ క్రికెటర్ షోయబ్ మాలిక్ జట్టుకు సారథ్యం వహిస్తాడు. సర్ఫరాజ్ ఉద్దేశపూర్వకంగానే ఆండిలెపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడని, ఇది నిబంధనలకు విరుద్ధం అని, ఆటగాడు, సిబ్బంది, అంపైర్, రిఫరీ, ప్రేక్షకులపై జాతి, మతం, సంస్కృతి, రంగు, భాష ఆధారంగా అభ్యంతకర వ్యాఖ్యలు చేయడం నిబంధనలు ఉల్లంఘిచడమే అని ఐసీసీ చెప్పుకొచ్చింది. కెప్టెన్ బాధ్యతలు అప్పగించినందుకు ఎంతో బాధ్యతాయుతంగా ఆడాల్సి ఉంటుందని, సర్ఫరాజ్ చేసిన వ్యాఖ్యల గురించి మాట్లాడదల్చుకోలేదని తాత్కాలిక కెప్టెన్ షోయబ్ మాలిక్ చెప్పుకొచ్చాడు.

విండీస్ రికార్డు విజయం

- 381 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై గెలుపు
- టెస్టు సిరీస్‌లో 1-0 ఆధిక్యం

బ్రిడ్జ్‌టౌన్ : వెస్టిండీస్ క్రికెట్ జట్టు ఇంగ్లండ్‌పై చారిత్రాత్మక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. మూడు టెస్టుల సిరీస్‌లో 1-0 తేడాతో విండీస్ ముందంజలో ఉంది. తొలి టెస్టులో ఇంగ్లండ్‌పై విండీస్ జట్టు 381 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. సొంత గడ్డపై పరుగుల పరంగా చూస్తే ఇంతటి భారీ స్కోరు తేడాతో గెలుపొందడం ఇదే మొదటిసారి. అయితే టెస్టు క్రికెట్ పరంగా ఓవరాల్‌గా చూస్తే విండీస్‌కు ఇది మూడో అతిపెద్ద విజయంగా నమోదైంది. విండీస్ మొదటి ఇన్నింగ్‌లో 289 పరుగులు చేసి ఆలౌటైంది. ఇంగ్లండ్ కేవలం 77 పరుగులు మాత్రమే చేసి 10 వికెట్లు కోల్పోయింది. రోచ్ 5 వికెట్లతో చెలరేగాడు. విండీస్ రెండో ఇన్నింగ్స్‌ను 415-6 వద్ద డిక్లేర్ చేసి ఇంగ్లండ్‌కు 628 పరుగుల భారీ లక్ష్యాన్ని ముందు ఉంచింది. నాలుగో రోజు ఆటలో మొత్తం 10 వికెట్లు కోల్పోయి ఘోర ఓటమి పాలైంది. విండీస్ ఆఫ్ బ్రేక్ బౌలర్ రోస్టన్ చేజ్ 8 వికెట్లు తీసి ఇంగ్లండ్ నడ్డి విరిచాడు. విండీస్ కెప్టెన్ జాసన్ హోల్డర్ డబుల్ సెంచరీ సాధించడంతో ఇంగ్లండ్ ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. హోల్డర్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.



ఇండోనేసియా మాస్టర్స్..

విజేత సైనా



- గాయంతో నిష్క్రమించిన ప్రత్యర్థి మారిన్
- కన్నీళ్లతో కోర్టు వదిలిన కరోలినా
- సైనాను విజేతగా ప్రకటించిన నిర్వాహకులు
- 10-4తో ముందంజలో నిలిచిన కరోలినా

అంతర్జాతీయ టైటిల్‌తో 2019 బోణి

అటు చూస్తే.. మూడు సార్లు ప్రపంచ ఛాంపియన్, ఒలింపిక్ ఛాంపియన్ కరోలినా మారిన్. ఇటు చూస్తే.. కొన్ని రోజుల క్రితం మలేషియా మాస్టర్స్ సెమీ ఫైనల్‌లో మారిన్ చేతిలోనే ఓడిపోయిన తెలుగు తేజం సైనా నెహ్వాల్. ఆదివారం జకార్తా వేదికగా జరిగిన ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ సూపర్ - 500 ఫైనల్ హోరాహోరీగా సాగింది. మ్యాచ్ ప్రారంభమైంది.. గతంలో మారిన్ చేతిలో ఓడిన సైనాకు ఈ ఫైనల్‌లో కూడా మంచి ఆరంభం లభించలేదు. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మారిన్ 10-4తో ముందంజలో ఉన్నప్పటికీ రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగింది. దీంతో ఇండోనేసియా మాస్టర్స్ ఛాంపియన్‌ను సైనా సొంతం చేసుకుంది. ఈ ఏడాది తొలి టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుని శుభారంభం చేసింది.

జకార్తా : జకార్తా వేదికగా జరిగిన ఇండోనేసియా మాస్టర్స్ ఫైనల్‌లో హైదరాబాదీ షట్లర్ సైనా నెహ్వాల్ గెలిచింది. స్పెయిన్ షట్లర్ కరోలినా మారిన్‌తో ఆది వారం జరిగిన తుది పోరులో తలపడిన సైనా నెహ్వాల్... ఆట ముగియకుండానే టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. మ్యాచ్ ప్రారంభమైన కొద్ది సేపటికే మోకాలి గాయం కారణంగా కుప్పకూలిపోయిన మారిన్ కనీసం నిల్చోలేక పోవడంతో టోర్నీ నిర్వాహకులు సైనా నెహ్వాల్‌ను విజేతగా ప్రకటించారు.

గత ఏడాది రన్నర ప్‌గా నిలిచిన సైనా రెండో సారి ఫైనల్లోకి ప్రవేశించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ ఏడాది సైనాకి ఇదే తొలి టైటిల్ కాగా, ఇండోనేసియా మాస్టర్స్ చేజిక్కించుకోవడం కూడా మొదటి సారే..

తొలి సెట్‌లోనే 10-4తో మారిన్ ముందుకు దూసుకెళ్లింది. ఈ దశలో గాల్లో ఎగిరిన మారిన్ అదుపుతప్పి శరీరం బరువంతా కుడికాలిపై మోప డంతో మోకాలు బెణికింది. దీంతో స్పెయిన్ షట్లర్ కనీసం నిలబడలేక పోయింది. కొంత విశ్రాంతి తీసుకుని మళ్లీ మ్యాచ్ కొనసాగించేందుకు ప్రయత్నించింది. ఆ సమయంలో రెండు పాయింట్లు కూడా సాధించింది. మరోసారి నొప్పి తీవ్రం కావడంతో ఫలితం లేకుండా పోయింది. మొత్తం కెరీర్‌లో ఇప్పటి వరకు మారిన్‌తో సైనా నెహ్వాల్ 11 మ్యాచుల్లో తలపడింది. అయితే కేవలం ఐదు మ్యాచుల్లోనే విజయం సాధించింది. రెండేళ్ల తరువాత హైదరాబాదీ షట్లర్ సైనా నెహ్వాల్ మొదటి బీడబ్ల్యూఎఫ్ టైటిల్‌ను చేజిక్కించుకుంది.

సంతోషంగా ఉన్నా.. కొద్దిగా బాధేసింది

ఏడాది అందరికీ ఎంతో ముఖ్యమైందని, చాలా మంది గాయాలతో బాధపడ్డారని, గత కొన్నేళ్లలో తాను కూడా గాయాలపాలయ్యానని, ఈ రోజు జరిగిన ఘటన కూడా ఎంతో కలిచి వేసిందని సైనా నెహ్వాల్ చెప్పుకొచ్చింది. అందుకే అందరూ జాగ్రత్తలు పాటించాలని సూచించింది. 2016 రియో ఒలిపిక్స్‌లో మోకాలి గాయంతో బాధపడిన విషయాన్ని గుర్తు చేసింది. మానసికంగా ఎంత ఇబ్బందికి గురి చేస్తుందో తెలుసని, ఒలింపిక్స్ సమయంలో కూడా బాధ పడి ఏడ్చిన సందర్భం కూడా ఉందని వివరించింది. ఇలాంటి అవరోధాలు క్రీడాకారులకు సర్వ సాధారణం అని, దానికి ఎదురెళ్లి ప్రతిభ చాటాలని సూచించింది. డిసెంబర్ మొత్తం విశ్రాంతి తీసుకుని కోలుకున్న తరువాత పీబీఎల్‌లో భాగంగా జనవరి 1న సింధుతో తలపడ్డానని అన్నారు. డాక్టర్లు నిరాకరించడంతో అప్పుడు ఎలాంటి శిక్షణ తీసుకోలేదని వివరించింది. మారిన్ గాయపడటం బాధగా ఉందని, టైటిల్ సాధించాననే ఆనందం కూడా ఉందని తెలిపింది. ఎంతో ప్రతిభ గల క్రీడాకారులను ఓడించి ఫైనల్‌కు చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.



జైకోవిచ్

ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ కైవసం

- తుదిపోరులో నాదల్‌పై గెలుపు
- నొవాక్ ఖాతాలో 15వ గ్రాండ్ స్లామ్
- పీట్ సంప్రాస్ (14)ను అధిగమించిన జొకోవిచ్
- ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా రికార్డు



మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భాగంగా ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్స్‌లో సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ సంచలన విజయం సాధించాడు. ప్రపంచ నెంబర్ 1 క్రీడా ప్రపంచానికి తన సత్తా ఏంటో గుర్తు చేశాడు. ఏకంగా ఏడో సారి ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచి సరికొత్త అధ్యయాన్ని లిఖించాడు. మాజీ ఛాంపియన్ రాఫెల్ నాదల్‌ను జొకోవిచ్ 6-3, 6-2, 6-3 పాయింట్ల తేడాతో వరుస సెట్లలో మట్టి కరిపించి టైటిల్ సొంతం చేసుకున్నాడు. 2 గంటల 4 నిమిషాల్లో ఆటను పూర్తి చేశాడు. జొకోవిచ్ తన ఖాతాలో 15వ గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను వేసుకున్నాడు. దీంతో గ్రాండ్ స్లామ్ టైటిళ్లలో పీట్ సంప్రాస్ (14)ను నొవాక్ అధిగమించాడు. 15 గ్రాండ్ స్లామ్ టైటిళ్లతో జొకోవిచ్ మూడో స్థానంలో ఉన్నాడు. 17 గ్రాండ్ స్లామ్ టైటిళ్లతో నాదల్ రెండో స్థానంలో, 20 టైటిళ్లతో ఫెదరర్ మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు. గ్రాండ్ స్లామ్స్ గెలిచిన రికార్డులో జొకోవిచ్ నాలుగు నుంచి మూడో స్థానానికి చేరుకున్నాడు. మ్యాచ్ ఆరంభం నుంచి ఏ దశలోనూ నాదల్‌కు జొకోవిచ్ అవకాశం ఇవ్వలే దు. మ్యాచ్ ఆసాంతం ఎలాంటి అనవసర తప్పిదాలు చేయని జకోవిచ్, ప్రత్యర్థికి ఎలాంటి అవకాశాలివ్వలేదు. సెర్బియా స్టార్ దూకుడు ముందు నాదల్ చేతులెత్తేశాడు. తొలి రెండు సెట్ల ను ఈజీగా గెలిచిన జొకోవిచ్, నిర్ణయాత్మక మూడో సెట్‌లో జొకోవిచ్‌కు నాదల్ గట్టి పోటీ ఇచ్చాడు. కానీ సెర్బియన్ జోరు ముందు నిలబడకలేకపోయాడు. ఫలితంగా వరుసగా మూడు సెట్లను సునాయాసంగా కైవసం చేసుకున్నాడు.

ఎంతో ఆనందంగా ఉంది : జొకోవిచ్



సరిగ్గా ఏడాది క్రితం మోచేతికి ఆపరేషన్ అయ్యింది. గడిచిన 12 నెలల గురించి ఆలోచిస్తున్నాను. ఇప్పుడు ఇలా మీ ముందు టైటిల్‌తో నిల్చున్నా ను. నాలుగు స్లామ్స్‌లో మూడు గెలిచా ను. మాటలు రావడం లేదు. 2012, ఆస్ట్రేలియాలో జరిగిన తుది పోరులో 5 గంటల 53 నిమిషాల పాటు ఆట సాగింది. ఇది గ్రాండ్ స్లామ్ చరిత్రలో తొలిసారి. కానీ ఈ ఫైనల్ మాత్రం కొంత సునాయాసంగా గెలిచాను అనిపిస్తోంది. వేగవంతంగా ప్రారంభించడ మే నా గెలుపు రహస్యం. అదే తుది పోరులో పాటించాను. ఫైనల్ కంటే ముందు ఇద్దరం ఎంతో బాగా ఆటను ప్రదర్శించాం. నాదల్ కూడా అద్భుతమైన ఆటగాడు.

ఎంతో నేర్చుకున్నాను : రఫెల్ నాదల్

గాయం నుంచి కోలుకున్న తరువాత ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ నుంచి చాలా నేర్చుకున్నాను. ఇదే అత్యుత్తమ ప్రదర్శనగా భావిస్తున్నా ను. ఒక్క సెట్‌లో కూడా ఓడిపోకుండా ఫైనల్‌కు వచ్చాను. అదే నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. జొకోవిచ్ ఆడిన తీరు అద్భుతంగా ఉంది. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ గతంలో నేను శారీరకంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఐదు నెలలు ఎలాంటి మ్యాచ్ ఆడకుండా ఉన్నాను. అప్పుడే నేను దీన్ని పెద్ద చాలెంజ్‌గా తీసుకున్నాను. గతేడాది కూడా కొన్ని మ్యాచుల్లో గట్టి పోటీ ఇచ్చాను. యూఎస్ ఓపెన్ కంటే ముందు 9 ఈవెంట్లు ఆడాను. ఆ తరువాత నేరుగా ఆస్ట్రేలియా ఓపెన్ మొదటి మ్యాచ్‌కొచ్చాను.

వాళ్లతో జాగ్రత్త..!

కివీస్ పోలీసులు

మౌంట్ మాంగనుయ్ : విజయాలతో దూకుడు మీద ఉన్న టీమిండియా నుంచి జాగ్రత్త అంటూ కివీస్ పోలీసులు ఓ ఫన్నీ పోస్టును సోషల్ మీడియాలో పెట్టారు. న్యూజి లాండ్ లో పర్యటించడానికి ఓ ప్రమాదకరమైన జట్టు వచ్చిందని, దాని నుంచి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అమాయకులైన న్యూజిలాండ్ జట్టుపై నేపియర్‌లో, మౌంట్ మాంగనుయ్‌లో దాడి చేసిందని వివరించారు. క్రికెట్ బంతి, బ్యాట్ బయటకు తీసుకెళ్లే ముందు జాగ్రత్త వహించాలని సూచించింది.

జొకోవిచ్‌కు రూ.29 కోట్లు

టైటిల్ గెలిచిన జొకోవిచ్‌కు 4.1 మిలియన్ డాలర్లు (రూ.29 కోట్లకు పైగా) ప్రైజ్‌మనీ రూపంలో దక్కింది. రన్నరప్‌గా నిలిచిన రఫెల్ నాదల్‌కు 2.05 మిలియన్ డాలర్లు (రూ.14.5 కోట్లకు పైగా) నగదు లభించింది. రాయ్ ఎమర్సన్, ఫెదరర్ (ఆరు సార్లు విజేతలుగా నిలిచారు)ల పేరిట ఉన్న రికార్డును చెరిపివేశాడు. వరుసగా వింబుల్డన్, యూఎస్ ఓపెన్, ఆస్ట్రేలియా ఓపెన్ టైటిళ్లను సొంతం చేసుకుని ఔరా అనిపించాడు. గతంలో ఆరుసార్లు ఫైనల్‌కు చేరిన జొకోవిచ్ (2008, 2011, 2012, 2013, 2015, 2016) ఆరు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. మహిళల సింగిల్స్‌ను జపాన్ క్రీడాకారిణి నొవామీ ఒసాకా కైవసం చేసుకున్న విషయం తెలిసిందే..

సిరీస్‌పై గురి

- నేడు నిర్ణయాత్మక మూడో మ్యాచ్
- 2-0 ఆధిక్యంలో టీమిండియా
- హార్దిక్ పాండ్యాకు చోటు..!
- విరాట్‌కు చివరి వన్డే.. ఆ తరువాత విశ్రాంతి

ఉదయం 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



మౌంట్ మాంగనుయ్ : న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న టీమిండియా సిరీస్‌పై కన్నేసింది. 5 మ్యాచుల వన్డే సిరీస్‌ను ఇప్పటికే 2-0తో ఇండియా ముందంజలో ఉంది. సోమవారం (నేడు) సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్ ఆడనుంది. సిరీస్‌ను చేజిక్కించుకోవాలని టీమిండియా, విజయాన్ని ఆపాలని కివీస్ కసిగా ఉన్నాయి. విశ్రాంతి తీసుకోనున్న విరాట్‌కు టెస్టు సిరీస్‌ను బహుమతిగా ఇవ్వాలని టీమిండియా భావిస్తోంది. 2014లో జరిగిన వన్డే సిరీస్‌ను కివీస్ 4-0తో కైవసం చేసుకుంది. ప్రతీకారం తీర్చుకోవాలన్న ఆలోచనలో టీమిండియా ఉంది. హార్దిక్ పాండ్యాకు కూడా చోటు దక్కడంతో టీమిండియా విజయం ఖాయమని అందరూ భావిస్తున్నారు. పాండ్యా 6వ స్థానంలో బ్యాటింగ్‌కొచ్చే అవకాశాలు ఉన్నాయి. కుల్దీప్ యాదవ్, చాహల్ గత రెండు వన్డేల్లో 20 వికెట్లలో 12 వికెట్లు తీసుకున్నారు. దీంతో వీరితో కివీస్‌కు తలనొప్పి ఉంటుంది. అత్యంత కీలకమైన వికెట్లు వీరిద్దరూ తీసుకున్నారు. షమీ, భువీ కూడా పేసర్‌లుగా బాగానే రాణిస్తున్నారు. శిఖర్ కూడా మొదటి వన్డేలో 75, రెండో వన్డేలో 66 బాదడంతో ఫామ్‌లోకి రావడం కలిసి వస్తోంది. మొదటి వన్డేలో ఫెయిల్ అయిన రోహిత్, రెండో వన్డేలో 87 రన్స్ చేశాడు. రాయుడు కూడా 47 పరుగులు చేసి రాణించా డు. కోహ్లికి విశ్రాంతి ఇవ్వడంతో అతని స్థానంలో దినేష్ కార్తీక్ వచ్చి మిడిల్ ఆర్డర్‌లో ఆడుతాడు. ఎలాగైనా టీమిండియా విజయాన్ని అడ్డుకుంటామని, సిరీస్‌ను సజీవంగా ఉంచుతామని కివీస్ కెప్టెన్ విలియమ్స న్ అంటున్నాడు. వికెట్లు కోల్పోవడం తోనే ఓటమి పాలయ్యా మని, రెండు వన్డేలతో చాలా నేర్చుకున్నామని అన్నారు.

భారత్ జట్టు : కోహ్లీ (కెప్టెన్), రోహిత్‌శర్మ, శిఖర్ ధావన్, ధోనీ (వికెట్ కీపర్), కెదార్ జాదవ్, దినేష్ కార్తీక్, విజయ్ శంకర్, శుభమన్‌గిల్, చాహల్, కుల్దీప్ యాదవ్, షమీ, భువనేశ్వర్ కుమార్, మహ్మద్ సిరాజ్, ఖలీల్ అహ్మద్, రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యా.

న్యూజిలాండ్ జట్టు : కేన్ విలియమ్సన్ (కెప్టెన్), టేలర్, లాథమ్, మార్టిన్ గప్తిల్, కొలిన్ డీ గ్రాండ్హోమ్, ట్రెంట్ బౌల్ట్, హెంర్డీ నికోల్స్, బ్రాస్‌వెల్, ఫెర్గ్యుసన్, మ్యాట్ హెంర్డీ, కొలిన్ మున్రో, ఇష్ సోధీ, మిచెల్ శాంట్నర్, టిమ్ సౌథీ.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.